
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 157

SUNDAY Special | ఆదివారం 27-8-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రణయ్ పరాజయం..

వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ సెమీ ఫైనల్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన కున్లావత్ విదిత్‌సర్న్ చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకున్న భారత షట్లర్.


- వివరాలు 12లో



తగ్గేదే లే.. ఆపేదే లే.. అనుకున్నా..!

"ఒకరు అదే పనిగా మనల్ని విమర్శిస్తున్నారంటే మనం ఎదిగినట్లే".. అంటూ నేషనల్ బెస్ట్ హీరో అల్లు అర్జున్ 'సాక్షి'తో పలు విషయాలు పంచుకున్నారు

- వివరాలు 12లో



మదురై రైలు బోగీలో మంటలు

తమిళనాడులోని మదురైలో ఓ రైలు బోగీలో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. ఘటనలో తొమ్మిది మంది మరణించారు.


- వివరాలు 6లో



తోటి విద్యార్థులతో కొట్టించి..

యూపీలో ఓ టీచర్.. ఓ విద్యార్థిని తోటి విద్యార్థులతో కొట్టించింది. బాలుడు కళ్లనీళ్లతో తలవంచుకొని కనిపించడం కలచివేస్తోంది.

- వివరాలు 6లో



2న ఆదిత్య-ఎల్1 ప్రయోగం!

చంద్రయాన్-3 సక్సెస్‌తో జోరుమీదున్న ఇస్రో సౌర వాతావరణం అధ్యయనానికి ఆదిత్య-ఎల్1 ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది.

- వివరాలు 6లో



4 దేశాలు.. నలుగురు వ్యోమగాములు

నాలుగు వేర్వేరు దేశాలకు చెందిన నలుగురు వ్యోమగాములతో స్పేస్ ఎక్స్ రాకెట్ కేప్ కెనవెరాల్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది.

- వివరాలు 6లో

శనివారం చేవెళ్లలో జరిగిన కాంగ్రెస్ ప్రజాగర్జన సభకు హాజరైన జనం



బీఆర్ఎస్, బీజేపీలను

ఇంటికి పంపాల్సిందే!

ఆ రెండు పార్టీలూ ఒకటే.. చేవెళ్ల ప్రజాగర్జన సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

- వచ్చే ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం
- అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు
- హామీలు ఇవ్వడమే కాదు అమలు చేసి తీరుతాం
- ప్రజల పోరాటాలతోనే సోనియా తెలంగాణ ఇచ్చారు..
- కేసీఆర్ చేసిందేమీ లేదు
- మోదీ సర్కారు కేంద్ర సంస్థలను ప్రైవేటు కట్టబెడుతోందని ఆరోపణ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణలోని బీఆర్ఎస్, దేశంలోని బీజేపీ రెండు ఒక్కటేనని, ఆ రెండు పార్టీలను ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నమైందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల పోరాటాల ఫలితంగానే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, అందులో కేసీఆర్ చేసిందేమీ లేదని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని చెప్పి.. మిగతా 2వ పేజీలో ▶

ఎస్సీలకు 18%.. ఎస్టీలకు 12% రిజర్వేషన్లు

12 హామీలతో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ - 2లో



సభలో మాట్లాడుతున్న ఖర్గే

బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ సెంటర్‌లో శాస్త్రవేత్తలను అభినందిస్తున్న మోదీ. చిత్రంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్ తదితరులు



'శివశక్తి'గా పిలుచుకుందాం

- చంద్రుడిపై ల్యాండర్ దిగిన ప్రాంతానికి నామకరణం చేసిన ప్రధాని మోదీ
- ఆగస్ట్ 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా పాటిద్దామని పిలుపు
- బెంగళూరులో ఇస్రో శాస్త్రవేత్తలను కలిసి అభినందించిన ప్రధాని
- 'మీ అంకితభావం, నిబద్ధత, తెగువకు నా సెల్యూట్' అంటూ ప్రశంసలు

"విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతాన్ని 'శివశక్తి'గా, 2019లో చంద్రయాన్-2 చంద్రునిపై కూలిన ప్రదేశాన్ని తిరంగా పాయింట్‌గా పిలుచుకుందాం. శివశక్తిలోని శివ.. మానవత్వం శ్రేయస్సుకు ప్రతీక. శక్తి.. మానవాళి సంక్షేమ ఆకాంక్షలకు తగిన ధైర్యాన్ని, స్థైర్యాన్ని అందిస్తుంది. జై విజ్ఞాన్... జై అనుసంధాన్..

\- ప్రధానమంత్రి మోదీ

6లో

సజావుగా 'ప్రజ్ఞాన్' ప్రయాణం

- చంద్రయాన్-3 ప్రాజెక్టులో భాగంగా చంద్రుడిపై ప్రజ్ఞాన్ రోవర్ సజావుగా ముందుకు సాగుతోందని ఇస్రో ప్రకటించింది. ఇందుకు సంబంధించిన వీడియో, ఫొటోలను తన వెబ్‌సైట్‌లో ఉంచింది. చంద్రుడి ఉపరితలంపై సేకరించిన సమాచారాన్ని భూమికి చేరవేస్తోంది.

- వివరాలు 6లో

పార్టీకి దిశానిర్దేశం రైతులకు భరోసా..

నేడు ఖమ్మం సభకు హాజరుకానున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. సభ తర్వాత అక్కడే బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ భేటీ

సాక్షి హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, ఖమ్మం: బీజేపీ అగ్రనేత, కేంద్రహోంమంత్రి అమిత్‌షా బహిరంగసభకు సర్వం సిద్ధమైంది. ఆదివారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఖమ్మం పట్టణంలో నిర్వహిస్తున్న 'రైతు గోస-బీజేపీ భరోసా' సభలో అమిత్ షా ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభావేదిక వద్దకు అమిత్‌షా చేరుకుంటారు. ఈ సభలో రైతుల సమస్యలను ప్రస్తావించడంతోపాటు పరిష్కారానికి బీజేపీ ఏం చేయనుందనే అంశాన్ని వెల్లడిస్తారు. త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ సభకు భారీగా జనసమీకరణతో పాటు పెద్దసంఖ్యలో పార్టీ కేడర్ పాల్గొనేలా చేయడం ద్వారా సభ సక్సెస్ చేసి సత్తా చాటాలని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. ప్రధానంగా రైతులను అధిక సంఖ్యలో సభకు సమీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

బస్సు యాత్రలపై రాష్ట్రనేతలతో సమావేశం

అమిత్ షా ఖమ్మం జిల్లా పర్యటనకు నిర్దేశించిన సమయం తక్కువగా ఉండడంతో భద్రాచలంలో శ్రీరాముల వారి దర్శనం, అక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమం రద్దయినట్టు పార్టీవర్గాలు వెల్లడించాయి. సభ అనంతరం ఖమ్మంలోనే బీజేపీ రాష్ట్రస్థాయి కోర్ కమిటీ మీటింగ్‌లో అమిత్ షా మాట్లాడనున్నారు. అసెంబ్లీ ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు.. బాసరలోని సరస్వతి అమ్మవారి దేవాలయం, జోగుళాంబ అమ్మ వారి గుడి, భద్రాచలం శ్రీరాముల దేవాలయం నుంచి.. వచ్చేనెల 7 తర్వాత ముఖ్యనేతలు 3 బస్సు యాత్రలు చేపట్టి సెప్టెంబర్ 17న ముగించి భారీ సభ నిర్వహించే అంశంపై అమిత్‌షాతో రాష్ట్రనేతలు చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా అమిత్‌షా సమక్షంలో కొందరు మాజీ ఎమ్మెల్యేలు, ఇతరనేతలు మిగతా 2వ పేజీలో ▶



ఖమ్మంలోని ప్రధాన కూడలిలో బీజేపీ జెండాలు

నెలాఖరులోగా గురుకుల పరీక్షల తుది 'కీ'లు!

- ప్రాథమిక కీలపై అభ్యంతరాలకు ముగిసిన గడువు
- ఆన్‌లైన్‌లో వచ్చిన అభ్యంతరాలు నిపుణుల కమిటీ ముందుకు
- కమిటీ సూచనలకు అనుగుణంగా ఫైనల్ 'కీ' విడుదల
- అదేరోజు వెబ్‌సైట్‌లో అభ్యర్థుల మార్కుల వివరాలు
- డీఎల్, జేఎల్ పోస్టుల డెమో పరీక్షలకూ త్వరలో తేదీల ఖరారు

- వివరాలు 14లో

పనిమంతులకు 'పండుగే'..



- వరుస పండుగల నేపథ్యంలో 'స్టాఫ్'కు డిమాండ్
- ఈ కామర్స్, ఆటోమొబైల్స్ రంగాల్లో ప్రతి నెలా 5వేల కొత్త ఉద్యోగాలు లభిస్తాయనే అంచనాలు
- హైదరాబాద్ సహా బెంగళూరు, చెన్నై, ముంబై, మెట్రోనగరాల్లో జాబ్స్ జోరు
- ప్రముఖ బిజినెస్ సర్వీసెస్ ప్రొవైడర్ సంస్థ క్వెస్ తాజా అధ్యయనం..

- వివరాలు 14లో

నూహ్‌లో ఇంటర్నెట్ సేవలు బంద్..

- 26 నుంచి 28 వరకు నిషేధాజ్ఞలు అమలు
- శోభాయాత్ర దృష్ట్యా హరియాణా ప్రభుత్వం నిర్ణయం

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

కోకాకోలా రూ.647 కోట్ల అదనపు పెట్టుబడి



సిద్దిపేట జిల్లాలోని కోకాకోలా కొత్త బాట్లింగ్ ప్లాంట్‌లో మరో రూ.647 కోట్లను పెట్టుబడిగా పెట్టనున్నట్టు సంస్థ ఉపాధ్యక్షుడు జేమ్స్ మేక్‌గ్రివి ప్రకటించారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్‌తో న్యూయార్క్‌లో సమావేశమైన ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

- వివరాలు 5లో

వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు సపోర్ట్



రాష్ట్రంలో రెండో పౌర విమానాశ్రయంగా రూపొందనున్న వరంగల్ విమానాశ్రయాన్ని రీజనల్ కనెక్టివిటీ స్కీం (ఆర్‌సీఎస్)లో చేర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఇది ఏర్పాటు కానుంది.

- వివరాలు 3లో

గల్ఫ్ చట్టాలు తెలియకే..



గల్ఫ్ దేశాల చట్టాలపై కనీస అవగాహన లేకపోవడంతో పలువురు భారతీయులు జైళ్ల పాలవుతున్నారు. వివిధ కారణాలతో అక్కడి జైళ్లలో 4,630 మంది భారతీయులు మగ్గిపోతున్నారు.

- వివరాలు 14లో

ప్రతి నియోజకవర్గంలో ఓ అటవీ పార్కు



రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఓ అటవీ పార్కును అభివృద్ధి చేస్తామని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే 109 పార్కులకుగానూ 73 పూర్తి చేశామని చెప్పారు.

- వివరాలు 5లో



క్లుప్తంగా...

రాక్రేతో పొన్నాల భేటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో శనివారం పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్లలో ఠాక్రేతో సమావేశమైన పొన్నాల జనగామ జిల్లా రాజకీయాలపై చర్చించినట్టు సమాచారం. కొన్ని రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసిన పొన్నాల పలువురు ఏఐసీసీ నేతలను కలిసి పార్టీ వ్యవహారాలపై చర్చించారు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే ఆయన ఠాక్రేతో సమావేశం కావడం గమనార్హం.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మొద్దు: రఘుమారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రలోభాలకు గురిచేసి డబ్బులు వసూలు చేసే దళారులు, సంస్థ సిబ్బంది మాటలు నమ్మి మోసపోవద్దని అభ్యర్థులకు సంస్థ సీఎండీ రఘుమారెడ్డి సూచించారు. జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) నియామకంలో నిర్ణీత అర్హతలు ఉండి, స్తంభాలు ఎక్కే (పోల్ క్లైంబింగ్) పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ అనుసరించి అత్యంత పారదర్శకంగా ఎంపిక జరుగుతుందని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్స్‌ను ప్రామాణికంగా తీసుకుని అర్హులైన అభ్యర్థులకు ఈనెల 28 నుంచి వివిధ జిల్లా/సర్కిల్ కేంద్రాల్లో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, పోల్ క్లైంబింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో 1,553 జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు ఈ ఏడాది నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే.

ఎంపీ సోయం బాపూరావు క్షమాపణలు చెప్పాల్సిందే

ఎల్బీనగర్ ఘటనపై రవీంద్రనాయక్ ఫిర్యాదు



సాక్షి, న్యూఢిల్లీ: లంబాడాల రిజర్వేషన్లపై మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ డిమాండ్ చేశారు. బాపూరావు సోయి లేకుండా మాట్లాడుతున్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కును పార్లమెంట్ సభ్యుడైన ఆయన ఎలా వ్యతిరేకిస్తారని ప్రశ్నించారు. 'రిజర్వేషన్లపై సోయం మాట్లాడటం ఆయన వ్యక్తిగతం అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు స్పష్టత ఇచ్చారు. అసలు బాపూరావు వర్గం ప్రాబల్యం రెండు జిల్లాల్లోనే ఉందన్న విషయం గుర్తుంచుకోవాలి. తెలంగాణలో లంబాడాలు 90 నియోజకవర్గాలను ప్రభావితం చేయగలరు'అని పేర్కొన్నారు. ఎల్బీనగర్ గిరిజన మహిళ అంశంపై శనివారం ఢిల్లీలో తెలంగాణకు చెందిన గిరిజన సంఘాల ప్రతినిధులతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రవీంద్ర నాయక్ ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఓం బిర్లా విచారం వ్యక్తం చేశారని తెలిపారు. తెలంగాణలో శాంతి భద్రతలు లేవని, అగ్రవర్ణాలకు ఒక న్యాయం, బడుగులకు ఒకరకమైన న్యాయం దక్కుతోందని రవీంద్ర నాయక్ ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల ఇళ్లలోని మహిళలపై గిరిజన మహిళపై జరిగిన విధంగా అత్యాచారాలు జరిగితే నష్టపరిహారం తీసుకొని వదిలేస్తారా? అని ప్రశ్నించారు. గిరిజనుల మాన, ప్రాణాలకు కేసీఆర్ ప్రభుత్వం వెలకట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గిరిజన మహిళ లక్ష్మికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగబోదని రవీంద్ర నాయక్ తేల్చిచెప్పారు.

వచ్చే నెల 3న కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ భేటీ

ఏపీ, తెలంగాణకు జలాల కేటాయింపుపై చర్చ



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి ఏపీ, తెలంగాణకు జరిపే నీటి కేటాయింపులపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి సెప్టెంబర్ 3వ తేదీన హైదరాబాద్ జలసౌధలో త్రిసభ్య కమిటీ భేటీ కానుంది. కృష్ణాబోర్డు సభ్యకార్యదర్శి నేతృత్వంలోని ఈ కమిటీలో ఏపీ, తెలంగాణ నీటిపారుదల శాఖల ఈఎన్సీలు సభ్యులుగా ఉన్నారు. ఈ నెల 21న నిర్వహించిన త్రిసభ్య కమిటీ సమావేశానికి తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ గైర్హాజరు కాగా, ఏపీ ఈఎన్సీ, బోర్డు సభ్యకార్యదర్శి పాల్గొని నీటి కేటాయింపులపై చర్చించారు. అనంతరం శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి తాగునీటి కోసం సెప్టెంబర్ 30 నాటికి ఏపీకి 25.29 టీఎంసీలు, తెలంగాణకు 6.04 టీఎంసీల జలాలు విడుదల చేయాలని కృష్ణాబోర్డు ముసాయిదా సిద్ధం చేయడం వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో మరోసారి త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించి నీటి కేటాయింపులపై నిర్ణయం తీసుకోవాలని కృష్ణా బోర్డు భావిస్తోంది.





చేవెళ్లలో సభా వేదికపై గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న ఖర్గే, రేవంత్‌రెడ్డి ● ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న ఠాక్రే, రేవంత్, దామోదర, ఖర్గే, భట్టి, ఉత్తమ్, జగ్గారెడ్డి, సంపత్, వీహెచ్ తదితరులు

బీఆర్ఎస్, బీజేపీలను | ఇంటికి పంపాల్సిందే!

▶ మొదటి పేజీ తరువాయి

తీరా ఫొటో తీసుకుని బయటికి వచ్చాక మాట మార్చారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. తాము ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి తీరుతామని చెప్పారు. శనివారం చేవెళ్లలో కాంగ్రెస్ నిర్వహించిన ప్రజాగర్జన సభలో ఖర్గే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత వేదికపై ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రసంగించారు.

53ఏళ్ల పాలనలో ఎంతో చేశాం

దేశంలో మహిళలు, గిరిజనులు, ఆదివాసులకు రక్షణ లేకుండా పోయిందని, అనేక మంది పేద విద్యార్థులు కనీస తిండికి నోచుకోలేక పోతున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు కడుపు నిండా తిండి పెట్టాలనే ఉద్దేశంతోనే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆహార భద్రత పథకాన్ని తీసుకొచ్చిందని.. పేదలకు పని కల్పించేందుకు ఉపాధి హామీ, గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాలను తెచ్చిందని గుర్తు చేశారు. దేశానికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. ప్రతి ఒక్కరి చేతుల్లోకి సెల్‌ఫోన్లు రావడానికి రాజీవ్ గాంధీయే కారణమని వివరించారు. ఈ సమయంలో కార్యకర్తలతో చేతుల్లోని ఫోన్లను పైకెత్తించి, టార్చిలైట్లు వెలిగించాలని కోరారు. ఇక ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం అహర్నిశలు శ్రమించి, దేశం కోసం ప్రాణ త్యాగాలు చేశారని ఖర్గే చెప్పారు.

హరిత విప్లవం, నీలి విప్లవం తెచ్చాం

కాంగ్రెస్ పార్టీ పారిశ్రామిక విప్లవంతోపాటు నీలి విప్లవం, హరిత విప్లవాలనూ తీసుకొచ్చిందని ఖర్గే వివరించారు. పారిశ్రామిక విధానంతో ఎన్నో పరిశ్రమలను నెలకొల్పి, అనేక మందికి ఉపాధి కల్పించిందని చెప్పారు. నాగార్జునసాగర్ వంటి భారీ బహుళార్థక ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వమే కట్టించిందని.. బ్యాంకులను జాతీయాకరణ చేసిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలోని బీజేపీ, మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం పేదలకు ఏం చేశాయని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు అనేక ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పితే.. నేటి మోదీ ప్రభుత్వం లాభాల్లో ఉన్న ఆ సంస్థలను నష్టాల్లోకి నెట్టేసి, వాటి ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో మహిళలు, ఎస్సీ, ఎస్టీల అక్షరాస్యత పెరిగితే.. బీజేపీ హయాంలో ఘోరంగా పడిపోయిందని విమర్శించారు.

బయట తిట్టుకుని.. లోపల మంతనాలా?

సీఎం కేసీఆర్ బయటికి మోదీని తిడుతూ, లోలోపల మంతనాలు జరుపుతున్నారని ఖర్గే విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు ఒకే తాను ముక్కలు అని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు బలపడాలన్నా.. బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి సాధించాలన్నా ఈ రెండు పార్టీలను ఇంటికి పంపాల్సిందేనని పేర్కొన్నారు.

మోదీ హఠావో.. బీజేపీ హఠావో

ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారని.. తాజాగా చైనా సరిహద్దుల్లోనూ బైక్‌పై పర్యటించారని ఖర్గే చెప్పారు. అలాంటి నేతపై బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా, నియంతలా వ్యవహిస్తోందని మండిపడ్డారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా రాహుల్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదన్నారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని.. అన్ని వర్గాలకు సముచిత స్థానం దక్కుతుందని చెప్పారు. 'మోదీ హఠావో.. బీజేపీ హఠావో' అని పిలుపునిచ్చారు.

ఎస్సీలకు 18%.. ఎస్టీలకు 12% | రిజర్వేషన్లు

చేవెళ్ల సభలో 12 హామీలతో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్

- అంబేడ్కర్ అభయ హస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం
- ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, ప్రైవేటు విద్యాసంస్థలు, కంపెనీల్లోనూ రిజర్వేషన్లు
- టెన్త్ నుంచి పీహెచ్‌డీ దాకా పాసైన ప్రతి విద్యార్థికి ఆర్థిక సాయం

చేవెళ్ల: చేవెళ్ల ప్రజాగర్జన సభ వేదికగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. మొత్తం 12 అంశాలతో కూడిన ఈ డిక్లరేషన్‌ను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సమక్షంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలన్నింటినీ తాము అధికారంలోకి రాగానే అమలు చేస్తామని.. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఖర్గే ప్రకటించారు.

డిక్లరేషన్‌లోని అంశాలివీ..

- జనాభా దామాషా ప్రాతిపదికన ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12% మేర రిజర్వేషన్ల పెంపు. వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేస్తాం.
- అంబేడ్కర్ అభయహస్తం కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల చొప్పున ఆర్థిక సాయం. ఐదేళ్ల పాటు ప్రతి బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించి పథకం అమలు.
- ఎస్సీ, ఎస్టీలకు అన్ని ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 18 శాతం, 12 శాతం చొప్పున రిజర్వేషన్లు అమలు. ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందే ప్రైవేటు కంపెనీల్లో కూడా వారికి రిజర్వేషన్లు
- ఇందిరమ్మ పక్కా ఇళ్ల పథకం కింద ఇంటి స్థలాలు లేని ప్రతి దళిత, గిరిజనులకు ఇంటి స్థలంతోపాటు ఇల్లు కట్టుకునేందుకు రూ.6 లక్షల ఆర్థిక సాయం. ఐదేళ్లలో ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ఈ పథకం వర్తింపు.
- బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకున్న ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములను అన్ని హక్కులతో తిరిగి అసైనీలకే కేటాయింపు. ప్రజా ప్రయోజనార్థం, భూసేకరణ చట్టం–2013 ప్రకారం భూములను సేకరించినప్పుడు సదరు అసైన్డ్ భూములకు పట్టా భూములతో సమానంగా పరిహారం. ఎస్సీలకు ఇచ్చిన అసైన్ భూములపై యాజమాన్య హక్కుల కల్పన. అమ్ముకునేందుకు, బ్యాంకుల్లో తాకట్టు పెట్టుకునే హక్కులు.
- ఎస్టీలకు ఇచ్చిన పోడు భూములపైనా వారికి పూర్తి హక్కులు. అటవీ హక్కుల చట్టం పటిష్టంగా అమలు.
- సమ్మక్క–సారక్క గిరిజన గ్రామీణ అభివృద్ధి పథకం కింద ప్రతి గూడెం, తండా గ్రామ పంచాయతీలకు రూ.25లక్షల అభివృద్ధి నిధులు.
- ఎస్సీలకు 3 కార్పొరేషన్లు ఏర్పాటు. మాదిగ, మాల, ఇతర ఉపకులాలకు ఒక్కో కార్పొరేషన్ ద్వారా ఏటా రూ.750 కోట్ల నిధులు.
- గిరిజనుల కోసం మూడు కార్పొరేషన్లు. తుకారాం ఆదివాసీ కార్పొరేషన్, సంత్ సేవాలాల్ లంబాడా కార్పొరేషన్, ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు. వాటికి ఏటా రూ. 500 కోట్ల కేటాయింపు.
- రాష్ట్రంలో ఐదు కొత్త ఐటీడీఏలు, తొమ్మిది సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు. మైదాన ప్రాంత గిరిజనుల కోసం నల్లగొండ, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో ఐటీడీఏల ఏర్పాటు. అన్ని ఐటీడీఏ కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు.. విద్యాజ్యోతుల పథకం కింద పదో తరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి రూ.10 వేల నగదు, ఇంటర్ పాసైతే రూ.15 వేలు, డిగ్రీ పాసైతే రూ.25వేలు, పీజీకి రూ.లక్ష.. ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు రూ.5లక్షల నగదు బహుమతులు.
- ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద అందరికీ విద్య. గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం. విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన ప్రతి ఎస్సీ, ఎస్టీ విద్యార్థికి ఆర్థిక సాయం.

ఎస్సీ, ఎస్టీలను మోసం చేసిన కేసీఆర్

- బీఆర్ఎస్ పాలనలో వారిపై దాడులు పెరిగాయి: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- గులాబీ ఎమ్మెల్యేల అవినీతికి అదుపులేకుండా పోయిందని విమర్శ
- తొమ్మిదిన్నరేళ్లలో లక్ష కోట్ల ఆస్తులు.. పదివేల కోట్ల భూములను ఆక్రమించారని ఆరోపణ



సాక్షి, రంగారెడ్డి జిల్లా/ చేవెళ్ల/ మొయినాబాద్: బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలకు రక్షణ లేకుండా పోయిందని.. పైగా వారిపై దాడులు మరింతగా పెరిగాయని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. దళిత సీఎం అని చెప్పి, మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి మోసం చేశారని.. గిరిజనులకు పోడు భూములు దక్కలేదని, వారిపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అవినీతికి, అక్రమ సంపాదనకు అడ్డు, అదుపు లేకుండా పోయిందని.. తొమ్మిదిన్నర ఏళ్లలో రూ.లక్ష కోట్ల ఆస్తులను, రూ.పదివేల కోట్ల విలువ చేసే భూములను కొల్లగొట్టారని ఆరోపించారు. చేవెళ్ల వేదికగా శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రజాగర్జన సభలో ఆయన 12 అంశాలతో కూడిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించారు. అనంతరం మాట్లాడారు.

మూడో విజయం తెలంగాణలోనే..

మల్లికార్జున ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక కాంగ్రెస్ తొలి విజయం హిమాచల్‌ప్రదేశ్‌లో, రెండో విజయం కర్ణాటకలో సాధించిందని.. మూడో విజయం తెలంగాణలో సాధించబోతోందని రేవంత్ చెప్పారు. తమ ప్రభుత్వంలో స్వేచ్ఛతోపాటు సామాజిక న్యాయం, సమాన అభివృద్ధికి ప్రాధాన్యత లభిస్తుందన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని రంగాల ప్రజలను మోసం చేశారని.. మంత్రి వర్గంలో బీసీలకు, ఎస్సీలకు ప్రాధాన్యత లేదని రేవంత్ విమర్శించారు. రాష్ట్రంలో 50శాతం జనాభా ఉన్న బీసీలకు మూడే మంత్రి పదవులతో సరిపెట్టారన్నారు. దేశంలోని మోదీ, తెలంగాణలోని కేసీఆర్, పాతబస్తీలోని అసదుద్దీన్ ముగ్గురూ ఒక్కటేనని.. వీరిలో ఎవరికి ఓటేసినా కేసీఆర్‌కు వేసినట్టేనని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో అమర వీరుల కుటుంబాలకు, తెలంగాణ పోరాట యోధులకు, ఉస్మానియా విద్యార్థులకు, తెలంగాణ వాదులకు గుర్తింపు లేకుండా పోయిందని మండిపడ్డారు. ఈ అవినీతి, అణచివేత, కుటుంబ పాలనకు చరమగీతం పాడాల్సిందేనన్నారు. కాగా.. ప్రజా గర్జన సభలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీనియర్ నేతలు దామోదర రాజనర్సింహ, వీహెచ్, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీ, శ్రీధర్‌బాబు, షబ్బీర్ అలీ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, షబ్బీర్ అలీ, పొన్నాల లక్ష్మయ్య, బలరాం నాయక్, గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయి: దామోదర



తెలంగాణలో భూమి కోసం, హక్కులకోసం పోరాటాలు చేసిన చరిత్ర ఉందని.. అది గుర్తించే సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. ఇందిరాగాంధీ 25 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచారన్నారు. కానీ బీఆర్ఎస్ కుటుంబ పాలనలో పేదల భూములను గుంజుకుని, రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసి కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణలో దొర అహంకారం మితి మీరిందని.. కేసీఆర్‌పై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని పేర్కొన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే పదవులు: సీతక్క



తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ దళితులకు ఏదో చేసిందని గొప్పలు చెప్పుకుంటోందే తప్ప.. చేసిందేమీ లేదని ములుగు ఎమ్మెల్యే సీతక్క విమర్శించారు. వందల ఎకరాల భూములు, ఫాంహౌస్‌లు ఉన్న పెద్దలకే రైతు బంధు సొమ్ము ఎక్కువగా అందుతోందని.. భూమి లేని పేదలకు ఈ ప్రభుత్వం చేసిందేమిటో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు ఆత్మగౌరవం, సమానత్వం లభిస్తాయన్నారు.

ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ చరిత్రాత్మకం: భట్టి



రాష్ట్ర సంపదలో అన్నివర్గాల ప్రజలను భాగస్వాములను చేయడానికి కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించిందని.. ఇది చరిత్రాత్మక నిర్ణయమని సీఎల్పీనేత భట్టి విక్రమార్క చెప్పారు. చేవెళ్ల నుంచి నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎల్పీ నేతగా పాదయాత్ర చేపట్టి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చారని.. అదే సీఎల్పీ నేతగా తాను చేపట్టిన పాదయాత్రలో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించానని వివరించారు. వాటిపై కాంగ్రెస్ పెద్దలంతా చర్చించి పేదలకు ఇంటి స్థలం, భూమి, ఆర్థిక సాయం అంశాలతో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ తీసుకొచ్చారని చెప్పారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్న సీఎం కేసీఆర్.. ఆ హామీ నెరవేర్చకపోగా, పేదలకిచ్చిన లక్షల ఎకరాల భూములను వెనక్కి తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకిచ్చిన భూములకు పూర్తి హక్కులు కల్పిస్తామని.. లాక్కున్న భూములను తిరిగి ఇస్తామని చెప్పారు.

రూ.2 లక్షల రుణమాఫీపైనే మొదటి సంతకం

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు సంబంధించిన రూ.2 లక్షల రుణమాఫీపైనే మొదటి సంతకం పెడతామని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎవరు సీఎంగా ఉన్నా.. తాను కీలకంగా వ్యవహరించి రుణమాఫీ చేయిస్తానని హామీఇచ్చారు. నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 200 మంది శనివారం ఎంపీ కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గతంలో నల్లగొండను దత్తత తీసుకుంటానని చెప్పి ఎలాంటి అభివృద్ధి పనులూ చేయలేదని విమర్శించారు. నల్లగొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప కొత్తగా ఏమీ కనిపించడం లేదన్నారు. ప్రస్తుతం ఎక్కడ కూడా 14 గంటల కన్నా ఎక్కువ విద్యుత్ సరఫరా కావడం లేదని చెప్పారు. ఎన్నికలు వస్తున్నాయని రాష్ట్రంలో భూములు అమ్మడంతో పాటు వైన్‌షాపులకు ముందస్తుగానే టెండర్లు వేసి వచ్చిన డబ్బులను సీఎం కేసీఆర్ తమ ఖాతాలో జమ చేసుకున్నారని కోమటిరెడ్డి ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తనను నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 సీట్లను గెలుచుకుంటామని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కోమటిరెడ్డి స్పష్టంచేశారు. కార్యక్రమంలో నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, వెలుగుపల్లి మాజీ సర్పంచ్ జూలకంటి వెంకట్‌రెడ్డి, నాయకులు చెల్ల పద్మారెడ్డి, బ్రహ్మచారి, చెలక సైదిరెడ్డి, ఎం.రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగభృతి ఇచ్చాకే | కేసీఆర్ ఓట్లు అడగాలి

నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్: రాష్ట్రంలోని నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇచ్చిన తర్వాతే సీఎం కేసీఆర్ ఓట్లు అడగాలని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 2018 డిసెంబర్ నుంచి నిరుద్యోగులకు ప్రభుత్వం నెలకు రూ.3 వేల చొప్పున బాకీ ఉన్నదని చెప్పారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీలో చెప్పి ఇంతవరకు పట్టించుకోకుండా కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. గత ఎన్నికల్లో దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక అందరినీ మోసం చేశారన్నారు. రాష్ట్రంలో అతి పెద్ద సామాజికవర్గంగా ఉన్న మాదిగలకు మంత్రి పదవి ఇవ్వలేదని, మరో పెద్ద సామాజికవర్గం ముదిరాజ్‌లకు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వలేదని, ముస్లింలకు మూడు సీట్లు ఇచ్చినా వాటిలో రెండు ఓడిపోయే సీట్లేనని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు కలిసిపోయాయని, ఢిల్లీలోని బీజేపీని ఇంటికి పంపాలంటే బీఆర్ఎస్‌ను ఓడించాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడించాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 70 పైచిలుకు స్థానాలు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న 12 సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హుజూర్‌నగర్, కోదాడలలో 50 వేల ఓట్ల మెజార్టీతో గెలవబోతున్నామని ఆయన తెలిపారు.

పార్టీకి దిశానిర్దేశం.. రైతులకు భరోసా..

▶ మొదటి పేజీ తరువాయి

చేరే అవకాశాలు ఉన్నాయని పార్టీవర్గాలు వెల్లడించాయి.

బహిరంగ సభ విజయవంతం కోసం..

సభను విజయవంతం చేయడం కోసం బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకత్వాలు సర్వశక్తులొడ్డాయి. కేంద్ర హోంమంత్రి స్థాయిలో ఉన్న బీజేపీ అగ్ర నేత జిల్లాకు వస్తుండడం ఇదే ప్రథమం కావడంతో నేతలు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. బీజేపీ జెండాలు, ఫ్లెక్సీలను నగరవ్యాప్తంగా ఏర్పాటు చేయడంతో ఖమ్మం కాషాయమయంగా కనిపిస్తోంది. సభా ప్రాంగణంలో అమిత్‌షా, ప్రధాని మోదీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ శనివారం సభా ప్రాంగణాన్ని పరిశీలించి సూచనలు చేశారు. సభకు 'రైతు గోస..బీజేపీ భరోసా' అని నామకరణం చేశారు.

రైతుల ఇబ్బందులు తొలిగేలా ఖమ్మం సభలో ప్రకటన: బీజేపీ నేత ప్రేమేందర్‌రెడ్డి

రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు భరోసా కల్పించి, వారి ఇబ్బందులు తొలగించే విధంగా బీజేపీ నాయకత్వం ఖమ్మం సభలో రైతు భరోసా ప్రకటన చేయనున్నదని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.



ఖమ్మంలో అమిత్‌షా సభ జరగనున్న మైదానంలో ఏర్పాట్లు

అమిత్ షా షెడ్యూల్ ఇలా....

- ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.25 నిమిషాలకు బయలుదేరి మధ్యాహ్నం 2.50 నిమిషాలకు ఏపీలోని గన్నవరం విమానాశ్రయంలో దిగుతారు
- అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3.25 నిమిషాలకు ఖమ్మం చేరుకుంటారు
- 3.40 నిమిషాలకు ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్స్ బహిరంగసభ ప్రాంగణానికి వస్తారు
- 3.45 నిమిషాల నుంచి సాయంత్రం 4.35 నిమిషాల వరకు సభలో పాల్గొంటారు
- అక్కడి కాలేజీ ప్రాంగణంలోనే 4.40 నిమిషాల నుంచి సాయంత్రం 5.30 దాకా పార్టీ ముఖ్యనేతలతో భేటీ అవుతారు
- సాయంత్రం 5.50 నిమిషాలకు ఖమ్మం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 6.20 నిమిషాలకు గన్నవరం చేరుకుంటారు
- సాయంత్రం 6.25 గంటలకు ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు.

బీజేపీ కటౌట్లలో ఈటల ఫొటో ఎక్కడ.. ముదిరాజ్‌ల ఆందోళన


ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ ఆధ్వర్యాన ఆదివారం ఖమ్మంలో జరిగే బహిరంగ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ప్రధాని మోదీ, షాతో పాటు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, సంజయ్, అరుణ తదితరుల ఫొటోలతో కటౌట్లు ఏర్పాటుచేశారు. అయితే ఈ కటౌట్లలో ఈటల రాజేందర్ ఫొటో లేకపోవడంతో శనివారం రాత్రి ముదిరాజ్ సంఘం నేతలు ఆందోళన చేపట్టారు. బీసీ నేత అయిన ఈటల ఫొటో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. దీంతో అక్కడికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ చేరుకు ని ఈటల ఫొటోలు కూడా పెట్టిస్తున్నామని సర్దిచెప్పడంతో వారు శాంతించారు.



ముదిరాజ్ నేతలకు నచ్చచెబుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ

ఏపీలో పథకాల అమలు భేష్

పార్లమెంటరీ కమిటీ చైర్మన్ కనిమొళి



సాక్షి, విశాఖపట్నం: ఏపీలో కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు తీరు ప్రశంసనీయంగా ఉందని కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పార్లమెంటరీ కమిటీ చైర్మన్ కనిమొళి అభినందించారు. కనిమొళి అధ్యక్షతన 11 మంది ఎంపీలతో కూడిన బృందం విశాఖ జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం మండలాల్లో శనివారం పర్యటించింది. పద్మనాభం మండలం రెడ్డిపల్లి సచివాలయాన్ని సందర్శించిన బృందం.. ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరా తీసింది. వివిధ గ్రామాల స్వయం సహాయక బృందాల సభ్యులతో మాట్లాడి పథకాల అమలు తీరుపై ఆరా తీసింది. అనంతరం నగరంలోని ఓ హోటల్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన సంస్థ విభాగాలకు సంబంధించిన జిల్లా అధికారులు, యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ అధికారులతో శనివారం రాత్రి సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా కనిమొళి మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు అద్భుతమన్నారు. కేంద్ర పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు తీరుని ప్రశంసించారు.

క్లుప్తంగా...

కొన్ని పార్టీల్లోకి కొందరిని పంపించాం

ఎన్నికలయ్యాక మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి వస్తరు: బాల్క సుమన్



చెన్నూర్: 'రాజకీయంగా సవాలక్ష ఉంటాయి. కొన్ని బయటకు చెప్పలేం. కొన్ని పార్టీల్లోకి మనమే కొందరిని పంపించాం. అందరూ మనవాళ్లే'అని మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వ్యాఖ్యానించారు. చెన్నూర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో శనివారం చెన్నూర్‌లో నిర్వహించిన ఆశీర్వాదసభలో ఆయన మాట్లాడారు. 'ఎవరి ప్రచారం వాళ్లది. కాంగ్రెస్ వాళ్లను ఏమీ అనొద్దు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలు ప్రచారం చేసుకుంటాయి. ఎవరి ప్రచారం వారిది. బీఆర్‌ఎస్ శ్రేణులు వారిని ఏం అనొద్దు. గతంలో నాపై కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన వెంకన్న(పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత) మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి రాలేదా.. ఎన్నికలయ్యాక వాళ్లు గూడ వస్తరు'అన్నారు.

బీఆర్‌ఎస్‌కు మాజీమంత్రి కృష్ణాయాదవ్ రాజీనామా




పంజగుట్ట: ఆత్మగౌరవం లేని పార్టీలో ఉండలేక పోతున్నానని, అందుకే బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్ తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీలో డబ్బున్నవారు, భూస్వాములు, పెత్తందారులు, పారిశ్రామికవేత్తలకే చోటు ఉందని, బీసీలకు ప్రాధాన్యత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరో నాలుగు రోజుల్లో కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులతో సమావేశమై నిర్ణయం ప్రకటిస్తానని తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016లో జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌లోకి వెళ్లానని, 2018 అక్టోబర్ 2వ తేదీ గాంధీజయంతి రోజు బాపూఘాట్ వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ కలిసి తనతోపాటు కారు ఎక్కించుకుని 2 గంటలపాటు ఎన్నో అంశాలపై చర్చించి తగిన ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నేటి వరకు ఎలాంటి పదవి ఇవ్వకపోయినా పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డానని, ఈసారి అంబర్‌పేట నియోజకవర్గం నుంచి తనకు అవకాశం ఇస్తారనుకుంటే మొండిచేయి చూపించారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల చేసిన రోజే ఆ పార్టీ బీసీ వ్యతిరేక పార్టీ అని అర్థమైందని అన్నారు.

బీఆర్‌ఎస్ జాబితా ఉత్తిదే: ఈటల



మహబూబాబాద్: ఇటీవల భారత్ రాష్ట్ర సమితి ప్రకటించిన ఎమ్మెల్యేల జాబితా ఉత్తిదేనని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. మహబూబాబాద్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ ఇవ్వకపోతే పార్టీనుంచి వెళ్లిపోతారనే భయం కేసీఆర్‌కు పట్టుకుందన్నారు. అందుకోసమే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ ప్రకటిస్తూ జాబితా విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ జాబితా బీఫామ్ ఇచ్చేవరకు ఉండదని, బీఆర్‌ఎస్‌లోని అసమ్మతివాదులందరూ బీజేపీతో టచ్‌లో ఉన్నారని స్పష్టం చేశారు. మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకునే సీఎం కేసీఆర్ నిజ స్వరూపం రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయిందని ఈటల ఎద్దేవా చేశారు.

'అవినీతిపై సీజే సమీక్షించాలి'



సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక డ్రా ప్రక్రియలో అక్రమాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఓ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ నేత ఎన్వీవీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. దీంతోపాటు వివిధ సంక్షేమ పథకాల అమల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలు, రాజకీయ కేటాయింపులపై సమీక్షకు సీజే సుమోటోగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల పరిశీలనలో కూడా జీహెచ్‌ఎంసీ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. అధికారపార్టీ ఎమ్మెల్యేలు సూచించిన పేర్లనే ఖరారు చేసి నివేదికలు పంపారని మండిపడ్డారు.

'సేంద్రియ ఉత్పత్తుల' సాంకేతిక కమిటీ సభ్యుల నియామకం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ సాంకేతిక కమిటీ సభ్యులుగా వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌కు చెందిన నాగం సురేందర్‌రెడ్డి, చీర్కపల్లికి చెందిన దొడ్ల రాములు, అప్పీల్ కమిటీ సభ్యులుగా ఖిల్లాఘణపురం మండలం మామిడిమాడకు చెందిన తూము శ్రీకాంత్ నియమితులైనట్లు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.ఈ పదవుల్లో వీరు నాలుగేళ్లు కొనసాగనున్నారు. ఈ సాంకేతిక కమిటీ సేంద్రీయ ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలను నిర్ధారిస్తుంది. సేంద్రీయ ఉత్పత్తుల కోసం నమోదు చేసుకున్న ఫిర్యాదులు, విన్నపాలను అప్పీల్ కమిటీ పరిష్కరిస్తుంది. దక్షిణ భారతదేశం మొత్తానికి తెలంగాణ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ప్రాంతీయ కేంద్రం.. సేంద్రీయ ఉత్పత్తుల జాతీయ కార్యక్రమం నియమ నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు అందజేస్తుంది.

వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు సపోర్ట్!

- రీజినల్ కనెక్టివిటీ స్కీంలో చేర్చే యోచన
- మూడేళ్లపాటు వయబిలిటీ గ్యాప్ ఫండ్
- పౌర విమానయాన శాఖకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండో పౌర విమానాశ్రయంగా రూపొందనున్న వరంగల్ విమానాశ్రయాన్ని రీజినల్ కనెక్టివిటీ స్కీం (ఆర్‌సీఎస్)లో చేర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతానికి డొమెస్టిక్ (దేశీయ విమానాలు నడిచే విమానాశ్రయం) విమానాశ్రయంగా రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో.. విమానాశ్రయం సిద్ధమయ్యాక ఆర్థిక అడ్డంకులను అధిగమించేందుకు ముందస్తు ఏర్పాట్లు కూడా ప్రారంభమయ్యాయి. ఇందుకోసం దీన్ని 'ఉడాన్'పథకంలో అంతర్భాగంగా ఉన్న రీజినల్ కనెక్టివిటీ పథకంలోకి తీసుకురావాలని రాష్ట్రప్రభుత్వం తాజాగా పౌర విమానయాన శాఖకు ప్రతిపాదించింది. ఈ పథకంలో చేర్చే విమానాశ్రయాలకు మూడేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండ్ అందించనుంది. ఈమేరకు ఈ స్కీంలో వరంగల్ విమానాశ్రయాన్ని చేర్చాలంటూ తాజాగా పౌరవిమానయాన శాఖకు ప్రతిపాదించింది. ప్రతిపాదన తర్వాత ఇప్పుడు మరో లేఖ కూడా రాసింది.

ఏర్పాట్లు ఎందుకంటే..

ప్రస్తుత అవసరాల ఆధారంగా ఏర్పాటవుతున్న చాలా విమానాశ్రయాలు, ఆ తర్వాత రకరకాల కారణాలతో కునారిల్లుతున్నాయి. ప్రయాణికుల రద్దీ అంతంతమాత్రంగా ఉండటంతో విమానయాన సంస్థ (ఆపరేటర్లు)లు ఆసక్తి కోల్పోతున్నాయి. వెంటనే సర్వీసులను ఉపసంహరించుకుంటున్నాయి. ఫలితంగా విమానాశ్రయాలనే మూసేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇక సమీపంలోనే మరో విమానాశ్రయం ఉంటే ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. ప్రతిపాదిత వరంగల్ విమానాశ్రయం శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి 150 కిలోమీటర్ల పరిధిలోనే ఉంది. దీంతో వరంగల్ విమానాశ్రయానికి డిమాండ్ ఎక్కువగా ఉండదన్న అభిప్రాయం గతంలో వ్యక్తమైంది. ఆ కారణంగానే ఈ విమానాశ్రయ నిర్మాణంలో ఇంతకాలం జాప్యం జరుగుతూ వచ్చింది. కానీ ఇటీవల, భారీ టెక్స్‌టైల్ పార్కు, వేగంగా విస్తరిస్తున్న ఐటీ పార్కు, ఇతర సంస్థల రాకతో వరంగల్ పారిశ్రామికంగా, ఐటీ పరంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం విమానాశ్రయం ఏర్పాటుకు ముందుకొచ్చి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ అడిగిన మేరకు భూమిని సేకరించి ఇచ్చేందుకు సిద్ధమైంది. భూమి బదలాయింపు జరిగిన ఏడాదిన్నరలోనే విమానాశ్రయాన్ని సిద్ధం చేసేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ కూడా సానుకూలత వ్యక్తం చేసింది. ఇటీవలే వరంగల్ మామూనూరులోని పాత ఎయిర్ స్ట్రిప్ అధీనంలో 750 ఎకరాల భూమి పోను, అదనంగా కావలసిన 253 ఎకరాల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైన కావడం తెలిసిందే. గత నెలాఖరులో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈమేరకు తీర్మానించగా, ఇప్పుడు సంబంధిత అధికారులు భూసేకరణ కసరత్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, వరంగల్ విమానాశ్రయం నుంచి విమానాలను నడిపేందుకు ఆయా సంస్థల ఆసక్తి ఏంటనేది ఇప్పుడు తెరపైకి వచ్చింది. దేశీయంగా విమానాలు నడుపుతున్న సంస్థలన్నీ ముందుకొస్తే దీనికి మంచి డిమాండ్ ఏర్పడుతుంది. వాటిల్లో ఆ ఆసక్తి రావాలంటే ప్రభుత్వాల నుంచి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ఫండింగ్‌కు వీలు కల్పిస్తూ ఉడాన్ పథకంలో భాగంగా కేంద్రప్రభుత్వం రీజినల్ కనెక్టివిటీ స్కీంను ప్రారంభించడం తెలిసిందే. ప్రయాణికులు విమానాలు ఎక్కే విషయంలో.. ఆశించిన డిమాండ్- ప్రస్తుతం ఉన్న డిమాండ్‌ను ఆపరేటర్లు పరిగణనలోకి తీసుకుంటారు. ఆశించిన డిమాండ్ కనక లేకుంటే.. ఎంత నష్టం జరుగుతుందో లెక్కలేస్తారు. దాన్ని నష్టంగా భావిస్తారు. డిమాండ్ అంచనా-వాస్తవ డిమాండ్.. ఈ రెంటి మధ్య ఉన్న గ్యాప్‌ను భర్తీ చేసేదే వయబిలిటీ గ్యాప్‌ఫండ్. దాన్ని ఆపరేటర్లకు అందిస్తే వారు నష్టాలతో సంబంధం లేకుండా విమానాలను కొనసాగిస్తారు.

ఎవరెంత భరిస్తారు..

రీజినల్ కనెక్టివిటీ స్కీంలో భాగంగా అందించే వయబిలిటీ గ్యాప్ ఫండ్‌ను కేంద్రప్రభుత్వం 80 శాతం భరిస్తే రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం భరించాల్సి ఉంటుంది. దీన్ని ఆపరేషన్ మొదలైన మూడేళ్లపాటు కొనసాగిస్తారు. దీనికిందకు వరంగల్ విమానాశ్రయాన్ని తీసుకురావాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదిస్తూ లేఖ రాసింది. త్వరలో ఉన్నతస్థాయిలో సంప్రదింపులు కూడా జరగనున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 72 విమానాశ్రయాలకు ఈ నిధి సమకూరుతున్నట్టు సమాచారం.



శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ

3,856 బైక్‌లతో బీజేపీ భారీ ర్యాలీ

కామారెడ్డి టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా శనివారం 3,856 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజారెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మహారాష్ట్ర అకుల్ కోట్ ఎమ్మెల్యే కల్యాణ్ శెట్టి మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను అమ్మేసిన ఘనత కేసీఆర్‌దేనని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను కామారెడ్డి నుంచి పారిపోయేలా చేస్తామని బీజేపీ కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బద్దం మైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌పై తన యుద్ధం ఆగదని కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి చెప్పారు.

తెలుగు చిత్ర రంగానికి గర్వకారణం

- అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారంపై సీఎం కేసీఆర్ హర్షం
- చంద్రబోస్, దేవిశ్రీప్రసాద్ సహా ఇతర పురస్కార గ్రహీతలకూ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలకు గణనీయంగా అవార్డులు దక్కడం పట్ల సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ జాతీయ నటుడిగా నిలిచిన అల్లు అర్జున్‌ను అభినందించారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి 69 ఏళ్లలో తొలిసారి ఉత్తమ నటుడిగా నిలిచారని ప్రశంసించారు. నాటితరం గొప్పనటుడు అల్లు రామలింగయ్య వారసుడిగా, విలక్షణ నటుడైన చిరంజీవి వంటి వారి స్ఫూర్తితో ఎదిగిన అల్లు అర్జున్ కృషి గొప్పదన్నారు. పాటల రచయిత చంద్రబోస్, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్, గాయకుడు కాలభైరవ, ఫిల్మ్ క్రిటిక్ పురుషోత్తమాచార్యులతో పాటు ఆయా విభాగాల్లో జాతీయ అవార్డులు పొందినవారందరికీ సీఎం అభినందనలు తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినీ రంగం ప్రతిభ చాటుతుండటం గర్వకారణమన్నారు. తెలుగు చిత్ర రంగ అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం తన వంతు కృషి కొనసాగిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. విభిన్న సంస్కృతుల మేళవింపుతో భవిష్యత్తులో తెలుగు సినిమా విశ్వవ్యాప్తంగా మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

మా ఓటు కేసీఆర్‌కే..

- ఏకగ్రీవ తీర్మానాలు చేసిన 'కామారెడ్డి' గ్రామాల ప్రజలు
- తీర్మాన కాపీలతో హైదరాబాద్‌కు..
- ముఖ్యమంత్రి అందుబాటులో లేకపోవడంతో కవితకు అందజేత

మాచారెడ్డి/కామారెడ్డి: సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకోవడంతో ఆయనకు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు తీర్మానాలు చేస్తున్నారు. శనివారం కామారెడ్డి జిల్లా మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావ్ ఆధ్వర్యంలో ఎల్లంపేటతో పాటు మరో ఎనిమిది గిరిజన గ్రామాల ప్రజలు ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అలాగే పాల్వంచ మండలం మంతన్ దేవునిపల్లి గ్రామస్తులు సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు తప్ప ఎవరికీ ఓటేయమని ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ఎంపీపీ నర్సింగరావు, జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, వైస్‌ఎంపీపీ జీడిపల్లి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సంతకాలు చేశారు. ఎల్లంపేటలో ర్యాలీ అనంతరం తమ తీర్మాన ప్రతులతో కేసీఆర్‌ను కలిసేందుకు హైదరాబాద్ వెళ్లారు. అయితే ముఖ్యమంత్రి అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్సీ కవితను కలిసి తీర్మాన కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఎన్నికల ఖర్చు కోసం 10 గ్రామాల ప్రజలు రూ.50 వేలు జమచేసి కవితకు అందజేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ కోసం అప్పట్లో టీఆర్‌ఎస్ ఆవిర్భవించిన తొలినాళ్లలోనూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మాచారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎంపీటీసీలను ఏకగ్రీవంగా ఎన్నుకుని చరిత్ర సృష్టించారు. అప్పట్లో 13 ఎంపీటీసీలకు గాను 8 చోట్ల ఏకగ్రీవంగా ఎన్నుకుని ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే జెడ్పీటీసీని కూడా గెలిపించారు.

కేసీఆర్‌కే జై కొడుతున్న పంచాయతీలు: కవిత



కవితకు తీర్మాన ప్రతులను అందజేస్తున్న కామారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేతలు

సీఎం కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని నిజామాబాద్ బిడ్డగా స్వాగతిస్తున్నానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తారని ప్రకటించడంతో గ్రామ పంచాయతీలు, గిరిజన తండాలు కేసీఆర్‌కు జై కొడుతున్నాయన్నారు. కామారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో కలిసి ఏకగ్రీవ తీర్మాన ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీచేస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే గంప గోవర్ధన్, కేసీఆర్‌ను పోటీ చేయాలని ఆహ్వానించారని చెప్పారు. మాచారెడ్డి మండలంలోని గ్రామాల ప్రజలు ఏకగ్రీవ తీర్మానాలు చేశారని, షబ్బీర్ అలీ వంటి వారు ఎన్నిమాట్లాడినా, ప్రజలు కేసీఆర్‌ను పార్టీలు, కులమతాలకు అతీతంగానే చూస్తారని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో 28న కామారెడ్డిలో భారీ సమావేశం జరుగుతుందని ఆ సమావేశంలో తాను కూడా పాల్గొంటానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అయచితం శ్రీధర్, మఠం భిక్షపతి, మేడే రాజీవ్ సాగర్, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యంరావు పాల్గొన్నారు. కాగా, ఎంపీపీ నర్సింగరావుకు శనివారం రాత్రి సీఎం కేసీఆర్ ఫోన్ చేసి అభినందించారు.

కాళేశ్వరం లేకపోతే యాసంగి పంట పండేదా?

- కాంగ్రెస్ హయాంలో సాగు నీటి కోసం ఇబ్బంది పడ్డాం
- ఇప్పుడు కాళేశ్వరం నీళ్లున్నాయి
- మంత్రి హరీశ్‌రావు
- బీఆర్‌ఎస్‌కే మద్దతు అంటూ రాంపూర్ వాసుల తీర్మానం



రాంపూర్‌లో హరీశ్‌రావుకు రాఖీ కట్టి బీఆర్‌ఎస్‌కే ఓట్లు వేస్తామని తీర్మాన కాపీని అందజేస్తున్న మహిళలు

సాక్షి, సిద్దిపేట: కాంగ్రెస్, బీజేపీ నాయకులు తిట్టడంలో పోటీపడుతుంటే.. సీఎం కేసీఆర్ పుట్లకొద్దీ వడ్లు పండించడంలో పోటీపడుతున్నారని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం ఆయన సిద్దిపేటలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటి, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో సాగునీరు లేక రైతులు ఎంతో ఇబ్బంది పడ్డారని, కానీ ఇప్పుడు కాళేశ్వరం నీళ్లు ఉన్నాయని చెప్పారు. కాళేశ్వరం నీళ్లు రాకపోతే యాసంగి పంటలు పండేనా అని ప్రశ్నించారు. అలాంటి జీవనాన్ని సీఎం కేసీఆర్ ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో చేపట్టిన హరితహారం కార్యక్రమం చరిత్రకెక్కిందన్నారు. 273.33 కోట్ల మొక్కలు నాటి దేశంలోనే అత్యధిక మొక్కలు నాటిన రాష్ట్రంగా తెలంగాణ రికార్డుల్లో నిలిచిందని కేంద్రం పార్లమెంట్‌లో చెప్పిందని గుర్తు చేశారు. పచ్చదనంలో రాష్ట్రం ఇప్పటికే 28 శాతానికి చేరిందని, మరో ఐదు శాతం సాధిస్తే 33 శాతం అడవులు ఉన్న రాష్ట్రంగా దేశానికే తెలంగాణ రోల్ మోడల్ అవుతుందని అన్నారు.

బీఆర్‌ఎస్‌కే మా మద్దతు..

సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్న సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీకే ఓటు వేస్తామంటూ గ్రామస్తులు ప్రకటించారు. ఈ మేరకు వివిధ సంఘాల నాయకులు మంత్రికి ఏకగ్రీవ తీర్మాన కాపీలను అందజేశారు. దీనిపై హరీశ్‌రావు స్పందిస్తూ, గ్రామం చిన్నదైనా.. గ్రామస్తులది పెద్ద మనసు అని నిరూపించుకున్నారన్నారు. 'మీ ప్రేమను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా, రాంపూర్ గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి తీర్మానం చేసి మద్దతు తెలపడం సంతోషంగా ఉంది'అని అన్నారు.

ఓ పెద్ద మనిషి మీడియాతో మాట్లాడొద్దన్నారు

- వివాదాస్పద వ్యాఖ్యలపై ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు
- రాజకీయాల్లో ప్రతి ఒక్కరికీ ఆశ ఉంటుంది.. దాన్ని సాధిస్తా
- వారం తర్వాత అన్ని విషయాలు చెప్తానని వెల్లడి
- మల్కాజిగిరి, మెదక్ అసెంబ్లీ స్థానాల నేతలు, కార్యకర్తలతో భేటీ



కుత్బుల్లాపూర్ (హైదరాబాద్): ''ఓ పెద్ద మనిషి మీడియాతో మాట్లాడవద్దని నాతో ప్రామిస్ తీసుకున్నాడు. అందుకే ఇప్పుడు నేను ఎటువంటి వ్యాఖ్యలు చేయను. వారం తర్వాత మీడియా సమావేశం ఏర్పాటు చేసి అన్ని విషయాలు చెప్తా. రేపటి నుంచి నా నియోజకవర్గంలో తిరిగి ప్రజలను కలుస్తా..''అని మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టికెట్ల విషయంలో ఇటీవల మంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి మైనంపల్లి తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ ఆయనపై చర్యలు తీసుకుంటుందనే ప్రచారం జరిగింది. ఈ క్రమంలో శనివారం ఆయన మల్కాజిగిరి, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నేతలు, కార్యకర్తలు, తన అనుచరులతో హైదరాబాద్ శివార్లలోని దూలపల్లిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కోవిడ్ సమయంలో మెదక్ నియోజకవర్గంలో తన కుమారుడు రోహిత్ ప్రాణాలకు తెగించి మరీ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాడని మైనంపల్లి చెప్పారు. తన కుమారుడి వెంట తిరిగిన కొందరు బీఆర్‌ఎస్ నాయకులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి బెదిరించారని, అణచివేయాలని చూశారని ఆరోపించారు. మెదక్‌లో నేతలు, కార్యకర్తలు రోహిత్ నాయకత్వాన్ని కోరుకున్నారన్నారు. రాజకీయాల్లో ప్రతి ఒక్కరికీ ఆశ ఉంటుందని, దానిని సాధిస్తానని చెప్పారు. ఎవరైనా తన జోలికి రాకుంటే ఏమీ అనబోనని, వ్యక్తిగతంగా ఇబ్బందిపెడితే తిడతానని పేర్కొన్నారు. వచ్చే వారం రోజులు ప్రజల మధ్య ఉంటానని, కార్యకర్తలను కలుస్తానని చెప్పారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడి వివరాలు వెల్లడిస్తానన్నారు.

పల్లాకు డబ్బు మదం ఎక్కువైంది

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ఘాటు వ్యాఖ్యలు



జనగామ: 'పల్లా రాజేశ్వర్‌రెడ్డికి డబ్బు మదం ఎక్కువై జనగామ నియోజకవర్గంలోని అమాయక ప్రజలను మలినం చేస్తున్నాడు. ఇది అధర్మం, ముఖ్యమంత్రి సంకల్పానికి విరుద్ధం'అంటూ జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం దివ్యాంగులకు ఆసరా పింఛన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో పల్లాపై ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ మరోసారి ఆంధ్రోళ్ల చేతిలోకి వెళ్లకుండా, సీఎం ఇచ్చిన ఒక్క పిలుపుతో ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరి, కేసీఆర్‌కు అండగా నిలిచారన్నారు. కేసీఆర్‌కు కుడిభుజంలా ఉంటూ... ఆయన తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని స్వాగతిస్తూ.. తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేస్తుంటే.. 'కుక్కల్లా మొరుగుతుంటే... బీఆర్‌ఎస్‌కు తీసుకువచ్చి పిల్లులను చేశాం'అని పల్లా అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. కుక్కలు అనే పదం వాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. దీనికితోడు తన మాటలను వక్రీకరించారని పల్లా అనడం ఆయన అసమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. 'తప్పు జరిగింది... క్షమించండి'అని ఓపెన్‌గా చెబితే కనీస గౌరవం దక్కుతుందన్నారు. ఉద్యమ సమయంలో చంద్రబాబును జనగామ ప్రాంత ప్రజలు ఎలా తరిమికొట్టారో... పల్లా తన మాటలు వెనక్కి తీసుకోకుంటే... నాటి చంద్రబాబు గతే పడుతుందన్నారు. సీఎం కేసీఆర్‌పై తనకు పూర్తి విశ్వాసం ఉందని, జనగామ టికెట్ తనదే అంటూ ముత్తిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నికల కోసం రైతులను రెచ్చగొడుతున్నారు: కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: మద్దతు ధర కోసం ప్రశ్నించిన రైతులకు బేడీలు వేసి జైలుకు పంపిన సీఎం కేసీఆర్ ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో అదే రైతులను రెచ్చగొడుతున్నారని ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి విమర్శించారు. ధరణి పోర్టల్ ద్వారా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ ఇబ్బందులు తొలగించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తాము చెపుతుంటే ధరణి లేకపోతే రైతుబీమా రాదని, రైతుబంధు రాదని రైతులను భయపెట్టే ప్రయత్నం కేసీఆర్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటే రైతులని, రైతులంటే కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. టీపీసీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు సుంకేట అన్వేశ్‌రెడ్డి మాట్లాడుతూ దళితుల భూముల రక్షణ, ధరణి కష్టాలు, పంట నష్టం అంశాలపై చర్చించేందుకు ఈనెల 28న గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ సమావేశం జరుగుతుందని, ఈ సమావేశంలో మండల, జిల్లా స్థాయి నేతలతో పాటు బాధితులు పాల్గొంటారని వెల్లడించారు.

ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా.. బీఆర్‌ఎస్‌లోకే

- 30 మంది కాంగ్రెస్ అభ్యర్థులకు డబ్బులు
- గెలిచాక వారంతా బీఆర్‌ఎస్‌లోకే: బండి

వేములవాడ, కరీంనగర్ టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ వ్యభిచారం చేస్తున్నాడని.. ఏ పార్టీ వాళ్లు గెలిచినా.. అందరినీ తన పార్టీలో కలుపుకోవాలని భావిస్తున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్, ఎంఐఎం సహా ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఉన్న ఇండిపెండెంట్ అభ్యర్థులకు సైతం డబ్బులు పంపిస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికే కాంగ్రెస్‌కు చెందిన 30 మంది అభ్యర్థులకు డబ్బులిచ్చాడని, గెలిచిన తర్వాత వారంతా బీఆర్‌ఎస్‌లో చేరతారని తెలిపారు. బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకే కేసీఆర్ ఈ కుట్రకు తెరలేపాడని, కేసీఆర్ కుట్రలను బీఆర్‌ఎస్ నాయకులతోపాటు ప్రజలు గమనించాలని కోరారు. వేములవాడలో శనివారం బండి సంజయ్ విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ రాక్షస పాలనను అంతం చేసి పేదల రాజ్యాన్ని స్థాపించడమే బీజేపీ లక్ష్యమని అన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థుల్లో సగం మందికి టికెట్లు రావు

కేసీఆర్ ఇటీవల ప్రకటించిన బీఆర్‌ఎస్ అభ్యర్థుల్లో సగం మందికి టికెట్లు ఇవ్వరని, అసమ్మతిని తగ్గించుకునేందుకే ఈ



శనివారం వేములవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

ఎత్తుగడ వేస్తున్నారన్నారు. ప్రజల పట్ల బీఆర్‌ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరారు. కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ కమిట్‌మెంట్‌తో పనిచేసే నాయకులని, అధ్యక్ష పదవి నుంచి తప్పించడాన్ని సాకుగా చూపి కొందరు మా మధ్య భేదాభిప్రాయాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారన్నారు. గవర్నర్‌ను చూసి కేసీఆర్ గజగజ వణుకుతున్నాడని.. ఆర్టీసీ విలీనం బిల్లు పేరుతో కేసీఆర్ ఆడుతున్న డ్రామాను గవర్నర్ బట్టబయలు చేశారన్నారు. బండి సంజయ్ ఎక్కడ పోటీ చేయాలనేది హైకమాండ్ నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

నా లైన్ పేదలు... హిందుత్వమే

'కరీంనగర్ ఎంపీగా గెలిపించిన ప్రజలంతా నాకు పేదల సమస్యలపై పోరాడాలని, హిందుత్వాన్ని జనంలోకి తీసుకెళ్లాలని లైన్ ఇచ్చారు. నాలుగేళ్లుగా ఏనాడూ మీరిచ్చిన లైన్ తప్పలేదు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ బలపడటానికి మీరిచ్చిన లైనే కారణం. చివరి క్షణం వరకు ఈ లైన్‌తప్పే ప్రసక్తే లేదు' అని బండి సంజయ్ ఉద్ఘాటించారు. శనివారం కరీంనగర్‌లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సోషల్ మీడియా వలంటీర్ల సమావేశం జరిగింది. బండి మాట్లాడుతూ, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని, బీజేపీ గ్రాఫ్‌ను తగ్గించేందుకు ముఖ్యమంత్రి కేసీఆరే కాంగ్రెస్ గ్రాఫ్‌ను పెంచే కుట్రకు తెరదీశారన్నారు. కేసీఆర్ గుప్పిట్లో చాలా మీడియా సంస్థలు ఉన్నాయని, వాస్తవాలు బయటకు రాకుండా, బీజేపీ వార్తలకు ప్రాధాన్యం ఇవ్వకుండా కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలొస్తున్న నేపథ్యంలో బీజేపీ వార్తలు రాకుండా కేసీఆర్ కుట్రలు చేసే ప్రమాదముందన్నారు. సోషల్ మీడియా ఆయుధంగా జనంలోకి వెళ్లామని అన్నారు. ఎన్నికల వరకు సోషల్ మీడియా అప్రమత్తంగా ఉంటూ కేంద్ర ప్రభుత్వ పథకాలతోపాటు మోదీ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

మత్స్యరంగంలో ఆధునిక విధానాలు

ఫిషరీస్ చైర్మన్ రవీందర్

సాక్షి, హైదరాబాద్: చేపల వేటలో మత్స్యకారులకు ఇబ్బందులు రాకుండా అధునాతన విధానాలు అమలు చేస్తామని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ చెప్పారు. కేరళ మత్స్యకారులు అలంబిస్తున్న నూతన పద్ధతులపై ఆ రాష్ట్రంలో నాలుగో రోజు వివిధ ప్రాంతాలను రవీందర్ సందర్శించి అక్కడి అధికారులతో చర్చించారు. తెలంగాణ జలాశయాలు, పెద్ద పెద్ద చెరువుల్లోనూ ఉపయోగించేందుకు సౌరశక్తితో నడిచే తేలికపాటి పడవల రూపకల్పనపై కేరళ శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. చేపల ఉత్పత్తుల జాతీయ ఎగుమతి సంస్థ (ఎంపెడా) కార్యదర్శి డాక్టర్ ప్రదీప్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల బృందంతో రవీందర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ తెలంగాణలో ఉత్పత్తి అయ్యే మంచినీటి చేపలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో డిమాండ్ ఉందని వివరించారు. తెలంగాణ చేపలను విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఫిషరీస్ ఫెడరేషన్ చేసే ప్రయత్నాలకు సహకరిస్తామని ఎంపెడా కార్యదర్శి ప్రదీప్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. శుద్ధిచేసిన చేపల ఆహార పదార్థాల తయారీకి అందుబాటులో ఉన్న శాస్త్ర సాంకేతిక సహకారాన్ని తెలంగాణ మత్స్యరంగానికి అందజేస్తామన్నారని వివరించారు. తెలంగాణలో పెద్ద ఎత్తున అందుబాటులో ఉండే చిన్న చేపలను సౌర శక్తితో శుద్ధిచేసి.. ఎండు చేపలుగా మార్చే సాంకేతిక సహకారానికి షిఫ్ట్ డైరెక్టర్ డాక్టర్ జార్జి నైనన్ సంసిద్ధత వ్యక్తం చేశారని రవీందర్ వెల్లడించారు.

> దేవుడు నాకు ఎత్తయిన కోటగా ఉన్నాడు.
> నా బలమా! నిన్నే కీర్తించెదను.
> - క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.ఏకాదశి సా.5.21 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.51 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.1.01నుండి 2.34 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.38 నుండి 5.26 వరకు, **అమృతఘడియలు:** రా.10.12 నుండి 11.54 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఎన్. బీరెన్ సింగ్ (మణిపూర్ సీఎం) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇంఫాల్ నుండి ఢిల్లీలోని కృష్ణ మీనన్ మార్గ్‌లో ఉన్న అమిత్ షా నివాసానికి వెళ్లేందుకు ఏమంతగా సమయం పట్టలేదు.

అమిత్ షా నివాసం నుండి తిరిగి ఇంఫాల్ చేరుకోడానికే బాగా ఆలస్యమైపోయి, ఫ్లయిట్ దిగేటప్పటికి చీకటి పడిపోయింది.

చీకట్లో మణిపూర్‌ను చూడాలంటే ఈ మధ్య నాకు భయంగా ఉంటోంది! అమిత్ షాను కలిసి, తిరిగి ఇంఫాల్ వస్తున్నప్పుడు... "దేవుడా! చీకటి పడే లోపు మమ్మల్ని మణిపూర్ చేర్చు, అలా కాకున్నా మణిపూర్‌లో దిగగానే మంటలేమీ కనిపించకుండా చెయ్యి..." అని దారంతటా ప్రార్థిస్తూనే ఉన్నాను.

నాతో పాటు మంత్రులు రంజన్, గోవింద్ దాస్ ఉన్నారు. "అమిత్‌షాను మేమూ చూస్తాం..." అని అంటే వారిని కూడా ఢిల్లీ వెంట బెట్టుకెళ్లాను. "అమిత్‌షాను చూడటం ఏంటి?" అని నేను వారిని అడగలేదు. ఈ మధ్య నేను ఎవర్నీ ఏమీ అడగలేకపోతున్నాను.

"ఎలా వచ్చారు?" అని అడిగారు అమిత్‌షా... మేము వెళ్లగానే!

"చార్టర్డ్ ఫ్లయిట్‌లో వచ్చాం అమిత్‌జీ!" అని చెప్పాను.



"షెడ్యూల్డ్ ఫ్లయిట్స్ లేవా?" అన్నారు.

"ఉన్నాయి అమిత్‌జీ! అయితే జర్నీ మధ్యలో ఎమర్జెన్సీగా తిరిగి మణిపూర్ వెళ్లవలసి వస్తే సొంత ఫ్లయిట్ అయితే బెటర్ కదా అని... రానూపోనూ మాట్లాడుకున్నాం" అని చెప్పాను.

"రానూపోనూ ఎందుకు బీరెన్‌జీ! ఢిల్లీ వచ్చేటప్పుడు మణిపూర్‌లో ఎమర్జెన్సీ అయితే తిరిగి వెళ్లడానికి సరే. మణిపూర్‌కి వెళ్లేటప్పుడు తిరిగి ఢిల్లీ వచ్చే ఎమర్జెన్సీ ఏముంటుంది?" అన్నారు అమిత్‌షా.

"అంటే అమిత్‌జీ... మీకేదైనా గుర్తొచ్చి... ఫోన్‌లో కాకుండా పర్సనల్‌గా మీరేదైనా చెప్పాలనుకుంటే అప్పుడు ఢిల్లీకి రావడం ఎమర్జెన్సీ అవుతుంది కదా అని బీరెన్‌జీ అనుకుని ఉంటారు..." అన్నారు రంజన్!

"అవును అమిత్‌జీ అందుకోసమే రానూపోనూ ఫ్లయిట్ బుక్ చేసుకున్నాం..." అన్నారు గోవింద్ దాస్.

అమిత్‌షాను చూస్తాం అని వచ్చినవారు అమిత్‌షాతో మాట్లాడేశారు కూడా!

"అమిత్‌జీ! ఆయన రంజన్, ఈయన గోవింద్ దాస్..." అని పరిచయం చేశాను.

"కూర్చోండి..." అన్నారు అమిత్‌షా ఆ ఇద్దరికీ సోఫాలు చూపిస్తూ.

నాకు తను కూర్చొని ఉన్న సోఫా ఛైర్ పక్కన... ఇంకో సోఫా ఛైర్‌ను చూపించాక, "ఏమిటిలా వచ్చారు?" అన్నారు.

వస్తున్నట్లు ముందే చెప్పాం కదా అమిత్‌జీ అని అనలేకపోయాన్నేను. ఈ మధ్య నేను ఎవర్నీ ఏమీ అనలేకపోతున్నాను.

"ఆగస్టు 29న మాన్‌సూన్ సెషన్స్ పెట్టుకున్నాం అమిత్‌జీ..." అన్నారు రంజన్.

"29 నుంచా?" అన్నారు అమిత్‌షా.

"కాదు అమిత్‌జీ, 29 ఒక్కరోజే! ఆ రోజు కూడా ఎమ్మెల్యేలు రాలేమంటున్నారు. ఎవరు ఎప్పుడు ఎక్కడ మీద పడి మంటల్లోకి తోసేస్తారోనని భయపడుతున్నారు. రాజ్యాంగం ప్రకారం సెప్టెంబర్ 2 లోపు సెషన్స్ జరగాలి కాబట్టి ఆ ఒక్కరోజైనా మేడమ్ గవర్నర్ ఒప్పుకున్నారు కానీ... లేకుంటే నో అనేవారే..." అని చెప్పారు గోవింద్ దాస్.

"ఇంకా ఏంటి సంగతులు..?" అన్నారు అమిత్‌షా, ఆగస్టు 29 పెద్ద సంగతే కాదన్నట్లు!

"మణిపూర్‌లో శాంతి సామరస్యాలు నెలకొనడానికి మీరూ, మోదీజీ ఇస్తున్న గైడెన్స్ చక్కగా పని చేస్తోంది అమిత్‌జీ. అందుకు థ్యాంక్స్ చెబుదామని వచ్చాం..." అన్నాను.

"అయితే ఆ... శాంతి సామరస్యాలను కొనసాగేలా చూసే బాధ్యత మాత్రం మీదే..." అని నవ్వారు అమిత్‌షా. ఆ నవ్వు రిటర్న్ జర్నీలో నాకు బాగా అలసటను తెప్పించింది.

"బీరెన్‌జీ! వచ్చేశాం దిగండి. ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంటున్నారు రంజన్, గోవింద్ దాస్!

ఇంఫాల్‌లో ఫ్లయిట్ దిగుతుండగానే ఆకాశంలోకి నాలుగు వైపులా చూశాను.

మంటలేం ఎగిసి పడటం లేదు!!

అందిన 'మామ' అందరివాడా?

జనతంత్రం



వర్ధెల్లి మురళి

అంతర్జాతీయ యవనికపై మన జాతీయ పతాకం సమున్నతంగా రెపరెపలాడిన దృశ్యం. భరతమాత ముద్దుబిడ్డల హృదయాలు ఎందుకు ఉప్పొంగవు? ఆబాల గోపాలం ఆనంద తరంగిణిలో ఎందుకు ఓలలాడదు? ఉరుము ఉరిమితేనే, మెరుపు మెరిస్తేనే, ఆకసాన హరివిల్లు విరిస్తేనే బాల్యం మురిసిపోతుందట! అవన్నీ తనకోసమేనని గంతులేస్తుందట! ఊహలు ఊరడం మొదలైన తొలిరోజు నుంచీ బాల్యానికి కథలు చెప్పే పుస్తకం చందమామ. కలలకు రెక్కలు తొడిగే నేస్తం చందమామ. అలాంటి చందమామ మన చేతికందిన దృశ్యం పిల్లల్ని పరవశింపజేయకుండా ఉంటుందా? ఆ పారవశ్యం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనిపించింది. పిల్లలకూ, పెద్దలకూ ఎన్నెన్నో సైన్స్ పాఠాలను నేర్పింది. ఓ పిడికెడు మందికి కామర్స్ పాఠాలు, బిజినెస్ పాఠాలు కూడా నేర్పి ఉండవచ్చు. అయినా ఆ శుభదినాన్ని (ఆగస్టు 23) 'జాతీయ స్పేస్ డే'గానే ప్రధాని ప్రకటించారు.

చంద్రగోళాన్ని క్షేమంగా తాకిన నాలుగు దేశాల్లో ఇప్పుడు భారత్ ఒకటి. అంటే అంతరిక్ష విజ్ఞానంలో తొలి నాలుగు స్థానాల్లో మనకు చోటు దక్కింది. అందులో క్లిష్టమైన దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని ఎంచుకొని దిగిన తొలి దేశంగా మన దేశం రికార్డులకెక్కింది. ఘన రూపంలో అపార జల నిక్షేపాలు, ఖనిజ సంపద ఈ ప్రాంతంలో ఉన్నాయని ఇప్పటికే శాస్త్రవేత్తలు నిర్ధారించారు. భూగోళం పుట్టిన తొలిరోజుల్లో అంగారకుడి పరిమాణంలో ఉండే పదార్థం ఒకటి దాన్ని ఢీకొట్టిందట! ఫలితంగా కొన్ని భూశకలాలు భూమి నుంచి వేరుపడి ఆ తర్వాత ఒకచోటకు చేరి చందమామగా ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బహుశా అందుకే భూమాతకు తోబుట్టువుగా భావించి మనం మేన మామగా పిలుచుకుంటున్నామేమో! ఇక్కడ జరిగే పరిశోధనల ఫలితంగా తొలిరోజుల నాటి భూగర్భ రహస్యాలపై అధ్యయనం చేయవచ్చు. ప్రాథమికంగా భూభౌతిక పదార్థమే గనుక, నీళ్లు కూడా ఉన్నాయని చెబుతున్నారు కనుక మానవ ఆవాస యోగ్యమైన పరిస్థితులు సృష్టించడం కష్టం కాదనే భావన ఏర్పడింది.

దక్షిణ ధ్రువ ప్రాంతంలో దిగడం సవాళ్లతో కూడుకున్నది కనుకనే గతంలో అమెరికా, రష్యా, చైనా దేశాలు ఈక్వెటార్ ప్రాంతంలోనే దిగాయి. అంతరిక్ష రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న రష్యా మన చంద్రయాన్–3 కంటే రెండు రోజుల ముందు ఇక్కడ దిగడానికి విఫలయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ కూడా ఇటువంటి ప్రయత్నంలో విఫలమైంది. నాలుగేళ్ల కింద మన చంద్రయాన్–2 ప్రయత్నం చివరి క్షణాల్లో విఫలం కావడం ఈ విజయానికి గుణపాఠంగా ఉపయోగపడింది. ఇక దక్షిణ ధ్రువంపై కాలూనడానికి ప్రపంచంలోని మిగిలిన అంతరిక్ష సంస్థలు కూడా పోటీపడతాయి. 2025లో ఆర్టెమిస్ అనే వ్యోమనౌకను అమెరికా ప్రయోగించబోతున్నది. ఇద్దరు మనుషుల్ని కూడా ఈ ప్రయోగం ద్వారా అమెరికా దించబోతున్నది. వారు ఒకటి రెండు వారాలపాటు అక్కడ గడుపుతారు. తాత్కాలిక స్థావరాన్ని కూడా ఏర్పాటు చేయబోతున్నారు. పోర్చుగీసు నావికుడైన వాస్కోడాగామా ఐరోపా నుంచి భారత్‌కు సముద్ర మార్గాన్ని కనుగొన్నాడని మనకు తెలుసు. ఫలితంగా పోర్చుగీసు వారు అప్పటికి సుసంపన్న దేశంగా ఉన్న భారత్ నుంచి సుగంధ ద్రవ్యాలను కారుచౌకగా తరలించుకొని వెళ్లి వ్యాపారాల్లో బాగా లాభపడ్డారు. కామధేనువు లాంటి ఇండియాకు మార్గం తెలిసింది కనుక ఐరోపాలో అంతకంటే బలవంతుడైన బ్రిటిష్‌వాడు ప్రవేశించాడు. పోర్చుగీసు వారిని తరిమేసి కామధేనువు మూలుగల్ని పీల్చిపారేశాడు. తాజా కథ కూడా దాదాపు ఇలాంటిదే కావచ్చేమో!

అంతరిక్ష విజ్ఞానం శాస్త్ర జిజ్ఞాస దశను దాటి వాణిజ్య దశలోకి ప్రవేశించింది. అంతరిక్ష ప్రయోగాలు చేయగలిగే దేశాలకు ఇప్పుడు చేతినిండా 'ఆర్డర్లు'. కమ్యూనికేషన్లు తదితర అవసరాల కోసం అన్ని దేశాలూ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించుకోవాలి. కొన్ని ప్రైవేట్ సంస్థలకు కూడా అటువంటి అవసరాలున్నాయి. ఇవి వన్‌టైమ్ ఆర్డర్లు మాత్రమే కాదు, నిరంతరం ఉండేవి. అంతరిక్ష ప్రయోగాల నైపుణ్యం ఉన్న దేశాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. అందులో చౌకగా పనిచేసి పెట్టే దేశం భారత్. ఫలితంగా భారత అంతరిక్ష మార్కెట్ రూ.70 వేల కోట్లకు చేరుకున్నది. ఇంకో పదిహేనేళ్లలో ఈ మార్కెట్ మూడున్నర లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ఇప్పుడు చంద్రయాన్–3 విజయంతో భారతదేశ సామర్థ్యం పట్ల నమ్మకం పెరిగింది. అతి తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను ప్రయోగించగలిగే దేశం భారత్ మాత్రమే!

భారత ఆధునిక అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ ఇస్రోలో మొదటి నుంచి పొదుపును ఒక అలవాటుగా తీర్చిదిద్దారని చెబుతారు. అందుబాటులో ఉన్న వనరులను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవడంతోపాటు, పూర్తి స్వదేశీ పరికరాలనే ఇస్రో ఉపయోగిస్తున్నది. ప్రపంచంలోని మిగిలిన స్పేస్ సెంటర్లలో పనిచేసే వారితో పోలిస్తే మన ఇస్రో సిబ్బంది జీతాలు చాలా తక్కువ. మన దేశంలో ఐటీ ఉద్యోగులతో పోల్చినా కూడా బాగా తక్కువే. ప్రయోగం విజయవంతమైన సమయంలో టీవీ ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వారిని దేశ ప్రజలందరూ గమనించారు. సాధారణ మధ్యతరగతి కుటుంబీకుల్లాగానే వారి ఆహార్యం కనిపించింది. జీతాల్లో, జీవితాల్లోనే వారు మధ్యతరగతి. విజ్ఞానంలో, అంకితభావంలో, దేశభక్తిలో వారు అత్యున్నత తరగతికి చెందినవారని పదేపదే నిరూపితమవుతూ వస్తున్నది. రాంచీలో ఉన్న హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ (హెచ్ఈసీ) వాళ్లు చంద్రయాన్ కోసం రాకెట్ లాంచ్ ప్యాడ్‌ను తయారుచేసి ఇచ్చారు. ఇది కూడా ప్రభుత్వరంగ సంస్థే. బహుశా ప్రైవేటీకరణ లిస్టులో ఉందేమో! ఇక్కడ ఇంజనీర్లకూ, ఉద్యోగులకూ 17 నెలలుగా జీతాలు లేవు. అయినా సరే దేశం కోసం చేసే పనిని దైవకార్యంగా భావించి ఉద్యోగులు జీతాలపై పట్టుబట్టకుండా ఇచ్చిన కాంట్రాక్టును గడువు లోపల పూర్తిచేసి పెట్టారు. సాధారణ ఉద్యోగులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తల త్యాగం పెట్టుబడిగా ఇప్పుడు భారత్ లక్షలకోట్ల మార్కెట్‌కు వల వేసింది. తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు ఇప్పుడు భారత అంతరిక్ష మార్కెట్ విధానం. 'ఆదిపురుష్' సినిమా కంటే తక్కువ ఖర్చుతో చంద్రయాన్–3 అనేది నినాదం!



> భారత ఆధునిక అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ ఇస్రోలో మొదటి నుంచి పొదుపును ఒక అలవాటుగా తీర్చిదిద్దారని చెబుతారు. అందుబాటులో ఉన్న వనరులను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవడంతోపాటు, పూర్తి స్వదేశీ పరికరాలనే ఇస్రో ఉపయోగిస్తున్నది. ప్రపంచంలోని మిగిలిన స్పేస్ సెంటర్లలో పనిచేసే వారితో పోలిస్తే మన ఇస్రో సిబ్బంది జీతాలు చాలా తక్కువ. మన దేశంలో ఐటీ ఉద్యోగులతో పోల్చినా కూడా బాగా తక్కువే. ప్రయోగం విజయవంతమైన సమయంలో టీవీ ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వారిని దేశ ప్రజలందరూ గమనించారు. సాధారణ మధ్యతరగతి కుటుంబీకుల్లాగానే వారి ఆహార్యం కనిపించింది. జీతాల్లో, జీవితాల్లోనే వారు మధ్యతరగతి. విజ్ఞానంలో, అంకితభావంలో, దేశభక్తిలో వారు అత్యున్నత తరగతికి చెందినవారని పదేపదే నిరూపితమవుతూ వస్తున్నది. రాంచీలో ఉన్న హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ (హెచ్ఈసీ) వాళ్లు చంద్రయాన్ కోసం రాకెట్ లాంచ్ ప్యాడ్‌ను తయారుచేసి ఇచ్చారు. ఇది కూడా ప్రభుత్వరంగ సంస్థే. బహుశా ప్రైవేటీకరణ లిస్టులో ఉందేమో! ఇక్కడ ఇంజనీర్లకూ, ఉద్యోగులకూ 17 నెలలుగా జీతాలు లేవు. అయినా సరే దేశం కోసం చేసే పనిని దైవకార్యంగా భావించి ఉద్యోగులు జీతాలపై పట్టుబట్టకుండా ఇచ్చిన కాంట్రాక్టును గడువు లోపల పూర్తిచేసి పెట్టారు. సాధారణ ఉద్యోగులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తల త్యాగం పెట్టుబడిగా ఇప్పుడు భారత్ లక్షలకోట్ల మార్కెట్‌కు వల వేసింది. తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు ఇప్పుడు భారత అంతరిక్ష మార్కెట్ విధానం. 'ఆదిపురుష్' సినిమా కంటే తక్కువ ఖర్చుతో చంద్రయాన్–3 అనేది నినాదం!

లక్షల కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టే కొత్త మార్కెట్ ఇది. న్యూ ఎకానమీ. కొత్త ఆర్థిక రంగానికి ద్వారాలు తెరిచినప్పుడు పరమ పవిత్రమైన పెట్టుబడిదారీ వ్యవస్థ సంప్రదాయాల ప్రకారం ముందుగా ప్రైవేట్ రంగం కుడికాలు మోపి లోపలికి ప్రవేశించాలి. అందుకు అనుగుణంగా మన అంతరిక్ష రంగాన్ని ప్రైవేటీకరించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. సాంకేతిక నైపుణ్య అభివృద్ధికీ, పరిశోధనలకూ ఇస్రోను పరిమితం చేస్తారు కాబోలు! ఉపగ్రహాలు ప్రయోగించడం, ముందుముందు అంతరిక్ష, చంద్రగ్రహ టూరిజం అభివృద్ధి చెందితే వ్యోమ నౌకలను ప్రైవేట్ ట్రావెల్స్ పేరుతో నడపడం వంటివన్నీ ప్రైవేట్ చేతికి వెళ్తాయి. ఆవు శిరస్సు భాగం ప్రభుత్వ నిర్వహణలో ఉంటుంది. దానికి గడ్డి వేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. పొదుగు భాగం ప్రైవేట్‌కు వెళ్తుంది. పాలు పిండుకునే కర్తవ్యం వారిది. ముందుముందు ఈ రంగంలో భారీ పెట్టుబడుల అవసరం ఉంటుంది కనుక ప్రైవేట్‌రంగం ప్రవేశించక తప్పదని ప్రభుత్వం వాదన. ఇందుకు వారు 'నాసా'ను మార్గదర్శిగా ఎంచుకున్నారు.

భూగర్భంలోని ఖనిజాలు, చమురు–వాయువులు, భూమ్మీద కొండలు గుట్టలు, అడవులు, ఆకాశయానాలతో సహా అన్నిటా ఇప్పటికే ప్రైవేటు రంగం ప్రవేశించింది. స్పేస్ టెక్నాలజీ సృష్టించిన న్యూ ఎకానమీని కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించాలా? మౌలిక రంగాల్లో, సంక్షేమ రంగాల్లో ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నది కదా! దీనికి డబ్బెక్కడి నుంచి రావాలి? మనం కట్టే పన్నులేనా? సాధారణ ప్రజలు పన్నులు కట్టాలి... బడాబాబులు బ్యాంకులు లూటీ చేయాలా? ఇదెక్కడి న్యాయం? ఇటువంటి సందేహాలు సగటు కుటుంబరావులకు సహజంగా కలుగుతుంటాయి. వారికి ఆర్థిక సూత్రాలు, వాటి లోతుపాతులు అర్థంకావు. అర్థం కాదు కాబట్టే దాన్ని ఆర్థిక శాస్త్రం అన్నారు. ప్రభుత్వాలకూ, పెట్టుబడులకూ సరిగ్గా అర్థమవుతాయి. లాభాలు ఏ రంగంలో వచ్చినా సరే దేశ జీడీపీ పెరుగుతుంది. అది పెరుగుతున్నకొద్దీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. తలసరి ఆదాయాలు పెరుగుతాయి, తలసరి విద్యుత్ వినియోగం పెరుగుతుంది. ఇటువంటి లెక్కలేవో చెబుతారు.

కార్మికులు, ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, గ్రామికులు, కష్టాలు, కన్నీళ్లు, దోపిడీ, పీడన, బ్యాంకుల లూటీ, ఎర్రజెండాలు, ధర్నా చౌకులు... వగైరా పదజాలాన్ని కాస్సేపు పక్కనబెడదాం. చంద్రయాన్–3 ప్రయోగ విజయం న్యూ ఎకానమీ వృద్ధికి తోడ్పడుతుందనేది నిర్వివాదాంశం. ఈ విజయం ఆర్థిక రంగానికి మాత్రమే పరిమితం కాలేదు. జీ–20 అధ్యక్ష హోదాలో ఉన్న సమయంలోనే వచ్చిన అవకాశం. దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తుంది. ఆర్థికరంగం, శాస్త్ర విజ్ఞాన రంగం, రక్షణ పాటవం... ఈ మూడు రంగాల్లో ఏ దేశం ఆధిపత్యం వహిస్తుందో అదే అగ్రరాజ్యం. ఈ మూడు రంగాల్లో కూడా ఇంచుమించు టాప్–5 లోకి భారత్ ప్రవేశించిన సూచనలు కనిపిస్తున్నాయి. మరో మూడు నాలుగేళ్లలో టాప్ త్రీలోకి చేరుతామని ప్రధాని చెబుతున్నారు. అందుకు చంద్రయాన్ విజయం లాంటివి ఉపకరిస్తాయి. అందుకే కాబోలు ఈ ప్రయోగం మీద ప్రధాని ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. 'బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొంటున్నప్పటికీ నా మనసంతా ఇక్కడే ఉంది'ని ఇస్రో శ్రేణులతో సంతోషాన్ని పంచుకున్నారు. ఇండియాకు వచ్చిన తర్వాత స్వయంగా ఇస్రో కేంద్రానికి వెళ్లి సిబ్బందిని అభినందించారు. ల్యాండర్ దిగిన ప్రదేశానికి 'శివశక్తి'గా నామకరణం చేశారు.

ప్రయోగాల ముందు పూజలు, దేవుళ్ల పేరుతో నామకరణాలు వగైరాల పట్ల అభ్యంతరం చెబుతున్నవారు కూడా తక్కువేమీ కాదు. మూఢ నమ్మకాలు సైన్స్ పురోగతికి ప్రతిబంధకాలే. కానీ మూఢ నమ్మకాలు వేరు, విశ్వాసాలు వేరు. ఈ సృష్టికి కారణమేమిటి? అనే ప్రశ్నకు సైన్స్ ఇప్పటికీ సంతృప్తికరమైన సమాధానాన్ని ఇవ్వలేదు. సైన్స్ ఆ సమాధానం చెప్పనంతవరకూ ఎవరి విశ్వాసం వారికుంటుంది. ఆ విశ్వాసాల మేరకు ప్రార్థనలూ, పూజలూ ఉంటాయి. కాకపోతే రాజ్యాంగబద్ధంగా మనది సెక్యులర్ దేశం కనుక ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎటువంటి పూజా విధానాలను అనుసరించాలి అనే అంశంపై ఆమోదయోగ్యమైన మార్గదర్శకాలు అవసరం. అంతరిక్షంతోపాటు సమస్త విజ్ఞానమంతా వేదాల్లోనే ఉన్నదని హిందూ చరిత్రకారులు ఢంకా భజాయిస్తారు. 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయట' అంటూ వారిని కొందరు వేళాకోళం చేస్తుంటారు. వేళాకోళం చేయవలసిన అవసరమయితే కనిపించడం లేదు. రుగ్వేద కాలం నాటికే మనకు అంతరిక్ష పరిజ్ఞానం ఉన్నది. ఈ విశ్వం అనంతమైనదని, ఎక్కడ మొదలైందో, ఎక్కడ అంతమవుతుందో తెలియదని ఖగోళ శాస్త్రం చెబుతున్నది. ఆది మధ్యాంత రహితమని వేదం కూడా చెప్పింది. విశ్వం ఆవిర్భవించడానికి కారణంగా బిగ్‌బ్యాంగ్ థియరీని శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. ఇది ఇరవయ్యో శతాబ్దం ప్రథమార్థం నాటి సంగతి. అంతకంటే సుమారు నాలుగు వేల ఏళ్లకు పూర్వం రుగ్వేదంలోని నాసదీయ సూక్తం కూడా దాదాపు ఇదే ప్రతిపాదన చేసింది. 'హిరణ్యగర్భం'లో సంభవించిన బ్రహ్మాండ విస్ఫోటనం వల్ల నక్షత్ర మండలాలు ఏర్పడ్డాయని ఈ సూక్తం చెబుతున్నది. రుగ్వేద కాలం నాటికి అంతరిక్ష పరిజ్ఞానం ఉన్నదనే మాట కేవలం హిందూ చరిత్రకారులు మాత్రమే చెప్పడం లేదు. హేతువాది, బౌద్ధ మతావలంబి, కమ్యూనిస్టు ఆలోచనాపరుడైన మహాపండితుడు రాహుల్ సాంకృత్యాయన్ కూడా తన 'రుగ్వేద ఆర్యులు' పుస్తకంలో ఈ సంగతి నిర్ధారించారు.

విశ్వం మీద ప్రసిద్ధ రచనలు చేసిన కార్ల్ సేగన్ అభిప్రాయం ప్రకారం ఆధ్యాత్మికతకూ, సైన్స్‌కూ వైరుధ్యం లేదు. పైగా ఆధ్యాత్మిక ఆలోచనలకు సైన్స్ గొప్ప ప్రేరణ కూడా! మనకు దృగ్గోచరమైన జగత్తులో సూర్యుడు ప్రసరించే కోటానుకోట్ల కిరణాల్లో ఒక కిరణం వెదజల్లే అనంతకోటి ధూళి రేణువుల్లో ఒకదాన్ని చూడండి. అదే మన ఇల్లు. అక్కడే మన చరిత్ర. మన సంస్కృతి. అక్కడే రాజులూ–రాజ్యాలు, నాగరికత నిర్మాతలు – విధ్వంసకులు, ప్రేమలు – పగలు, తల్లీదండ్రీ, ఆనందాలు – ఉద్వేగాలు, కష్టాలు–కన్నీళ్లు, మతాలు–ప్రార్థనలు, నీతులు చెప్పే పంతుళ్లు – అవినీతి గోతులు తీసే నాయకులు, సూపర్ స్టార్లు – సుప్రీమ్ లీడర్లు, సాధువులు – పాపులు... అన్నీ.. అందరూ అక్కడే ఆ ధూళి రేణువుపైనే అంటాడు. సూర్యకాంతిలోని ఓ ధూళి రేణువంత భూగోళంలో ఉన్న మనం ఈ అనంత విశ్వాన్ని ఎప్పుడు ఎట్లా అర్థం చేసుకోవాలి!

మహా అయితే ఇంకో వందేళ్లకో, రెండొందల ఏళ్లకో మనం ఈ భూమిని ఖాళీ చేయవలసిందే! ఆ తర్వాత ఇంకెంతమాత్రం భూగోళం ఆవాసయోగ్యం కాదని స్టీఫెన్ హాకింగ్ చేసిన హెచ్చరిక పదేపదే చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. అంతగా ధ్వంసం చేశారు భూదేవిని! 'సముద్రవసనే దేవీ, పర్వతస్తన మండలే, విష్ణుపత్నీ నమస్తుభ్యం, పాదస్పర్శం క్షమస్వమే' అని పూజించిన భూమిని కొందరు స్వార్థం కోసం పీల్చి పిప్పిచేశారు. దురాశతో, కక్కుర్తితో, కండూతితో నిస్సారంగా మార్చారు. అందువల్ల మరో గ్రహాన్వేషణ తప్పదట! మరో గ్రహంలో తలదాచుకోకపోతే మానవజాతి అంతరించిపోక తప్పదట. అదిగో అందుకోసం కూడా ఈ చంద్రయానం తప్పనిసరి. ఇది మొదటి అడుగు.

చందమామపై నివాసంతోపాటు దాన్ని అంతరిక్ష గేట్‌వేగా ఉపయోగించుకొని అంగారక గ్రహానికి (మార్స్) వలస పోవాలని ప్రయత్నాలు ప్రారంభమవుతున్నాయి. ఈ 'స్పేసి'నేని ట్రావెల్స్ ప్రభుత్వరంగంలో కాక ప్రైవేట్‌రంగంలో ఉండబోతున్నది కనుక ప్రయాణం చేయగలిగినవాడు కోటీశ్వరుడై ఉండాలి. యుగాంతంపై తీసిన '2012' సినిమా గుర్తుకొస్తున్నది. సౌరతాపం వల్ల భూకేంద్రకం వేడెక్కి సముద్రాలు ఉప్పొంగుతాయని హెచ్చరికలు వస్తాయి. కొన్ని దేశాలు కలిసి బలిష్ఠమైన పడవల్లాంటి ఆశ్రయాలను హిమాలయాలపై నెలకొల్పుతాయి. వీటిలో 40 లక్షల మందే పడతారు. వారంతా ఖరీదైన టిక్కెట్లు కొనుక్కొని ప్రాణాలు కాపాడుకుంటారు. మిగిలిన 700 కోట్ల జనాభా మునిగిపోతుంది. 'టైటానిక్' సినిమా కూడా అంతే కదా! పడవ మునగబోతున్నది, లైఫ్ బోట్లలో 700 మందే పడతారు. పెద్దటిక్కెట్లు కొన్నవారిని క్షేమంగా లైఫ్ బోట్లలో తరలిస్తారు. పేద టిక్కెట్ల బ్యాచ్ 1,500 మంది జలసమాధి అవుతారు. భూ విధ్వంసానికి ఎవరైతే కారకులయ్యారో వారే స్పేస్ ట్రావెల్స్ టిక్కెట్లు కొనుక్కొని బతికి బయటపడవచ్చు... కొనలేని వారి పరిస్థితి? 'మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది, పదండి ముందుకు పదండి తోసుకు' అంటూ శ్రీశ్రీ శ్రామిక లోకానికి పిలుపునిచ్చారు. ఇంకో వందేళ్లకు సంపన్నులందరూ తోసుకుంటూ దూసుకుంటూ మరో ప్రపంచానికి వెళ్తారు కాబోలు! చందమామా నువ్వు అందరివాడివా? కొందరివాడివా?

vardhelli1959@gmail.com

జాతీయోద్యమ కెరటాలు నాటి తెలుగు పత్రికలు

విశ్లేషణ



వి.వి. రమణ

భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికలు గణనీయమైన పాత్ర పోషించాయి. 'వందేమాతరం' ఉద్యమం నుండి 'క్విట్ ఇండియా' ఉద్యమం దాకా సుమారుగా నాలుగు దశాబ్దాల పాటు స్వాతంత్ర్య ఉద్యమ బాటలో నడిచాయి. మొదట్లో మత పరమైన పత్రికలు తెలుగునేలపై ఆవిర్భవించాయి. వీరేశలింగం పంతులు 1874లో 'వివేక వర్ధిని' పత్రికను వెలువరించడంతో తెలుగు సమాజంలో నూతన శకం ఆరంభమైంది. 20వ శతాబ్దం ప్రారంభం నాటికి తెలుగు పత్రికా రంగం వికాస దశను అందుకుంది. ఈ దశలో అవి ప్రజల్లో ఒక వంక ఆంధ్రాభిమానాన్నీ, మరో వంక జాతీయ భావాన్నీ పెంపొందించాయి.

కొండా వెంకటప్పయ్య వంటి దేశభక్తుల కృషి ఫలితంగా 'కృష్ణా జిల్లా సంఘం' ఆధ్వర్యంలో మచిలీ పట్నంలో నెలకొన్న 'కృష్ణా పత్రిక' (1902) తెలుగు పత్రికా రంగంలో ఒక మైలు రాయిలా నిలిచింది. ముట్నూరి కృష్ణారావు దీని ప్రధాన సంపాదక బాధ్యతలను చేపట్టి జాతీయోద్యమానికి సంబంధించిన వ్యాసాల ద్వారా ఆంధ్రుల్ని ఉత్తేజితుల్ని చేశారు. తెలుగు ప్రాంతంలో కాశీనాథుని నాగేశ్వరరావు స్థాపించిన 'ఆంధ్ర పత్రిక' కూడా (1908) జాతీయ ఉద్యమంలో భాగస్వామి అయింది. బోడి నారాయణరావు, పింగళి లక్ష్మీనారాయణలతో కలిసి గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1908లో బెజవాడ నుండి 'స్వరాజ్య' వార పత్రికను ప్రారంభించారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా రచనలు చేశారని ఈయనకు మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించారు. ఒక రచనతో జైలు పాలైన మొదటి దక్షిణాది వ్యక్తి గాడిచర్ల.

1923లో 'ఆంధ్ర పత్రిక', 'కృష్ణా పత్రిక', 'కాంగ్రెస్' వంటి పత్రికలు నిషేధానికి గురైనాయి. 1925లో 'మాతృసేవ', 'పశ్చిమాంధ్ర', 'శారద', 'స్వధర్మ', 'స్వతంత్ర' పత్రికలకూ అదే గతి పట్టింది. కమ్యూనిస్టు పార్టీని నిషేధించక ముందు గద్దె లింగయ్య కృష్ణా జిల్లా నుండి 'ప్రభ' పత్రిక తొలి సంచికను 1935లో విడుదల చేశారు. అయితే అది బ్రిటిష్ వారు విధించిన రూ. 8,000 జరిమానా చెల్లించలేక మూతపడింది. సోషలిస్ట్ పార్టీ తరఫున 'నవశక్తి' పత్రిక అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో వెలువడింది. ఆ తర్వాత దీనిని పుచ్చలపల్లి సుందరయ్య, చంద్రశేఖరరావు, మరికొంతమంది కలిసి నడిపారు. రెండవ ప్రపంచ యుద్ధం మొదలైనప్పుడు 'నవశక్తి' పత్రికను కూడా బ్రిటిష్ వారి కఠిన నిర్ణయాల వలన ఆపివేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

'గోల్కొండ పత్రిక' ద్వారా సురవరం ప్రతాపరెడ్డి జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు. నరసింహారావు 'రయ్యత్' దినపత్రిక ద్వారా ఉద్యమంలోకి వచ్చారు. గద్దె లింగయ్య 'ప్రభ' పత్రిక, మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో 'నవశక్తి', కాళీపట్నం



కొండయ్య 'వీరభారత్' పోషించిన పాత్ర అమోఘం. కాంగ్రేగుల రామచంద్రారావు, చుండ్రుపట్ల హనుమంతరావు తమదైన శైలిలో పత్రికల ద్వారా ప్రజలను ఉత్తేజ పరుస్తూ ఉద్యమాన్ని నడిపారు. ప్రకాశం పంతులు 'స్వరాజ్య' ఆంగ్ల దినపత్రిక ప్రజలను ఉద్యమం వైపు నడిపింది. అంతేకాదు పప్పూరు రామాచార్యులు 1922లో మిత్రుల సహాయంతో 'పినాకిని' పత్రికను అనంతపురంలో ప్రారంభించారు. దీనితో పాటే 'శ్రీసాధన' పత్రికను కూడా నడిపారు. ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక, శ్రీసాధన పత్రికలతో తాము బలవంతులమయ్యామని స్వయంగా వావిలాల గోపాలకృష్ణయ్య అన్నారు. సర్కారులో కొండా వెంకటప్పయ్య, రాయలసీమలో పప్పూరు రామాచార్యులు, తెలంగాణలో మాడపాటి హనుమంతరావు ముఖ్యులుగా ఉన్నారని కూడా వావిలాల చెప్పారు. ఇక ముట్నూరి కృష్ణారావు, కాశీనాథుని నాగేశ్వరరావు, కందుకూరి వీరేశలింగం – ఈ ముగ్గురిని కలిపితే సురవరం ప్రతాపరెడ్డి అవుతారని అనుకునే వాళ్లు. ఆంధ్ర, కృష్ణా పత్రికలను కలిపితే 'గోల్కొండ పత్రిక' అవుతుందని కూడా!

'జన్మభూమి' పత్రిక కోసం రాసిన వ్యాసం కారణంగా నార్ల వెంకటేశ్వరరావును పోలీసులు చితక బాదారు. గాడిచర్ల హరి సర్వోత్తమరావు, ఖాసా సుబ్బారావు, కోటంరాజు రామారావు, పప్పూరు రామాచార్యులు కఠినమైన జైలు శిక్షలు అనుభవించారు. అనిబీసెంట్ అరెస్టును 'దేశమాత' పత్రికలో ఖండించారని చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుకు వెయ్యి రూపాయల అపరాధ రుసుము విధించారు. ఆ యా పత్రికలు దేశకాల పరిస్థితులకు అనుగుణంగా తెలుగువారి మనోభావాల్ని మలచడంలో చరిత్రాత్మక పాత్రను పోషించాయి. అనేకమంది పత్రికా సంపాదకులు తమ శక్తికి మించి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు.

వ్యాసకర్త ఉపాధ్యాయుడు

క్లుప్తంగా...

ప్రేమ వేధింపులకు బాలిక బలి

ఖలీల్‌వాడి: ప్రేమ పేరుతో యువకుడు వేధించడంతో పదో తరగతి చదువుతున్న ఓ బాలిక (16) ఆత్మహత్య చేసుకున్నట్లు నార్త్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. 'నిజామాబాద్ నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికను ఓ యువకుడు ప్రేమ పేరుతో వేధించేవాడు. నిత్యం ఫోన్ చేసి వేధిస్తుండటంతో బాలిక మనస్తాపం చెందింది. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అన్న.. అమ్మ, నాన్నను జాగ్రత్తగా చూసుకో అని సూసైడ్ రాసి బలవన్మరణానికి పాల్పడింది. వేధింపులకు పాల్పడిన వ్యక్తి ఫోన్ నంబర్ కూడా రాసింది' అని సీఐ వివరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్టీలు, వ్యక్తుల కోసం పనిచేయం

జనశక్తి నేత అమర్ స్పష్టీకరణ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎన్నికల్లో పనిచేసే పార్టీ కోసం, వ్యక్తుల కోసం పనిచేయబోమని జనశక్తి నాయకుడు అమర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గత ఏప్రిల్ నెలలో విడుదలైన జనశక్తి నేత కూర రాజన్నను కలవడానికి దేశం నలుమూలల నుంచి పూర్వ సహచరులు వస్తున్నారని వెల్లడించారు. దేశవ్యాప్తంగా జరిగిన కిసాన్ ఆందోళనలో చురుగ్గా పాల్గొన్న బిహార్ కిసాన్ సమితి (బీకేఎస్), భూమిహీన్ కిసాన్ సంఘర్ష్ సమితి (బీకే ఎస్ఎస్), బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నేతలు ముగ్గురు ఆగస్టు 24వ తేదీన రాజన్నను పరామర్శించడానికి వచ్చారని, ఆ సమయంలో రాజన్న ఆహ్వానం మేరకు తాను వెళ్లానని పేర్కొన్నారు. భారత ప్రధాని రైతులకు క్షమాపణలు చెప్పి ఒప్పుకున్న డిమాండ్లు నేటికీ అమలు చేయక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, వాటికి సంబంధించి రాజన్నను సలహాలు అడిగారని తెలిపారు. అంతేతప్ప ఈ సమాలోచనలు ఎన్నికలు, ఆయా పార్టీలు, వ్యక్తులకు సంబంధించి కానేకాదని తెలిపారు. ఈ సమాలోచనల విషయం తెలుసుకొని అనుమానాలతో వచ్చిన పోలీసులు సుదీర్ఘ పరిశీలన, విచారణా నంతరం.. ఇదే విషయాన్ని నిర్ధారించుకొని సొంత పూచీకత్తుపై ఈ నెల 25న సాయంత్రం తమకు స్వేచ్ఛ కల్పించారని వివరించారు.

లక్ష్యాన్ని మించి కోటి వృక్షార్చన

- ఒక్కరోజే కోటి 30 లక్షలకు పైగా మొక్కలు నాటినట్టు అటవీశాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: స్వతంత్రభారత వజ్రోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా చేపట్టిన 'కోటి వృక్షార్చన'కు మంచి స్పందన లభించింది. శనివారం ఒక్కరోజు కోటి ఇరవై ఐదు లక్షల మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని మించి కోటి ముప్పై లక్షలకు పైగా మొక్కలు నాటినట్లు అటవీశాఖ వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా 12,431 గ్రామాలు, ఆవాసాల్లో ఒక కోటి పదహారు లక్షల తొంబై రెండు వేల తొంబై ఎనిమిది (1,16,92,098) మొక్కలు నాటినట్టు ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 143 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోని 1402 వార్డులు, డివిజన్లలో పదమూడు లక్షల ఎనభై ఆరు వేల రెండు వందల రెండు (13,86,202) మొక్కలను నాటారు. మొత్తం కలిపి 13,833 ప్రాంతాలలో కోటి ముప్పై లక్షలకు పైగా మొక్కలు నాటినట్టు తెలియజేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు కార్యక్రమంలో పాల్గొని లక్ష్యాన్ని మించి విజయవంతం చేశారని పేర్కొంది. మొత్తం 49,455 మంది ప్రజా ప్రతినిధులు వజ్రోత్సవ కోటి వృక్షార్చనలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్ కృతజ్ఞతలు తెలిపారు.

మందు కొట్టి.. కారుతో ఢీకొట్టి..

మద్యం మత్తులో డ్రైవింగ్ చేసిన సీఐ



ఘటనా స్థలిలో కారుతో సీఐ శ్రీనివాస్

రసూల్‌పురా: కమాండ్ కంట్రోల్ విభాగంలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ మద్యం మత్తులో కారు నడిపి కూరగాయల వ్యాన్‌ను ఢీకొట్టడంతో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన బొల్లారం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ శ్రీనివాస్ చెప్పిన వివరాల ప్రకారం.. పోలీసు శాఖ కమాండ్ కంట్రోల్‌లో శ్రీనివాస్ సీఐగా పనిచేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున రాజీవ్ రహదారిపై బోయినపల్లి మార్కెట్‌కు వెళ్తున్న కూరగాయల వ్యాన్‌ను ఆయన మద్యం మత్తులో కారు నడుపుతూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పోలీసులు సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సీఐ శ్రీనివాస్‌కు పోలీసులు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా 210 వచ్చినట్లు సమాచారం. మద్యం మత్తులోనే ఈ ఘటన జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బొల్లారం సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కోకాకోలా రూ.647 కోట్ల అదనపు పెట్టుబడి

- సిద్దిపేటలో నిర్మాణంలోని బాట్లింగ్ ప్లాంట్‌పై వ్యయం
- వరంగల్, కరీంనగర్‌లో రెండో యూనిట్‌కు సంసిద్ధత
- దీంతో రూ.2500 కోట్లకు పెరగనున్న సంస్థ పెట్టుబడులు
- న్యూయార్క్‌లో కేటీఆర్‌తో భేటీలో సంస్థ ఉపాధ్యక్షుడి ప్రకటన



శనివారం న్యూయార్క్‌లో కోకాకోలా సంస్థ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట జిల్లాలో కోకాకోలా సంస్థ నిర్మిస్తున్న కొత్త బాట్లింగ్ ప్లాంట్‌లో మరో రూ.647 కోట్లను పెట్టుబడిగా పెట్టనున్నామని సంస్థ ఉపాధ్యక్షుడు జేమ్స్ మేక్‌గ్రివి ప్రకటించారు. రూ.1000 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్ నిర్మాణం కోసం గత ఏప్రిల్ 22న రాష్ట్ర ప్రభుత్వంతో కోకాకోలా సంస్థ ఎంఓయూ చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ప్లాంట్ నిర్మాణంలో వేగం, ఈ ప్రాంతంలో వ్యాపార వృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు జేమ్స్ వెల్లడించారు. ఈ ప్లాంట్ డిసెంబర్ 24 నాటికి పూర్తి కానుందని తెలిపారు. తమకు ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్ భారతదేశం అని, ఇక్కడ తమ కార్యకలాపాల విస్తరణపై దృష్టి పెట్టామని చెప్పారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావుతో శనివారం న్యూయార్క్‌లో సమావేశమై ఈ మేరకు విస్తరణ ప్రణాళికలను తెలియజేశారు.

తెలంగాణలో కోకాకోలా పెట్టుబడులు రెట్టింపు: రాష్ట్రంలో తమ పెట్టుబడులను రెట్టింపు చేయనున్నామని జేమ్స్ మేక్‌గ్రివి ఈ సందర్భంగా వెల్లడించారు. అమీన్‌పూర్‌లోని తమ బాట్లింగ్ ప్లాంట్ విస్తరణకు గతంలో రూ.100 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో రెండో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. కరీంనగర్, వరంగల్ ప్రాంతంలో ఈ తయారీ కేంద్రం వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతిపాదిత నూతన ప్లాంట్‌నూ పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రంలో రూ.2500 కోట్లకు పైగా పెట్టుబడులను పెట్టినట్లు అవుతుందని తెలియజేశారు. ఇటీవల కాలంలో అత్యంత తక్కువ సమయంలో వేగంగా విస్తరించిన ప్రాంతంగా తెలంగాణ నిలుస్తుందన్నారు.

భారీ పెట్టుబడులకు ఇదే సాక్ష్యం: రాష్ట్రానికి అన్ని రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయనడానికి తాజాగా కోకాకోలా సంస్థ చేసిన ప్రకటనే సాక్ష్యంగా నిలుస్తుందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఐటీ, అనుబంధ రంగాలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్/ అనుబంధ రంగాలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులను తెలంగాణ ఆకర్షించిందన్నారు. కోకాకోలా రాష్ట్రంలో పెట్టుబడులను రెట్టింపు చేసేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. సంస్థ ప్రతిపాదించిన రెండో తయారీ కేంద్రానికి అన్ని రకాల సహాయ, సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

పలువురు సీఈవోలు, ప్రతినిధులు, విద్యావేత్తలతో కేటీఆర్ భేటీ

అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు శనివారం షికాగోలో వేర్వేరు భేటీల్లో పాల్గొన్నారు. వివిధ అంతర్జాతీయ కంపెనీలు, విద్యావేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులతో చర్చించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. ఈ భేటీల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, భాగస్వామ్యాల అన్వేషణపై మాట్లాడారు. వైద్య ఉపకరణాలు, కృత్రిమ మేధస్సులో అగ్రగామిగా ఉన్న అలైవ్ కోర్ బృందంతో కేటీఆర్ భేటీ అయ్యారు. తెలంగాణలో మెడ్ టెక్ రంగంలో కలిసి పని చేసేందుకు అలైవ్ కోర్ కు చెందిన ఈసీజీ టెక్ ఆసక్తి వ్యక్తం చేసింది. అట్లాంటాకు చెందిన హెల్త్ టెక్ కంపెనీ సీఈఓ క్యారలోన్, అధ్యక్షుడు రజత్ పూరీ కేటీఆర్‌ను కలిశారు. రాష్ట్రంలోని ద్వితీయశ్రేణి పట్టణాల్లో ఐటీ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా క్యారలోన్‌ను కోరారు.

ఏడీఎం విస్తరిస్తే సహకరిస్తాం: కేటీఆర్

వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ రంగంలో పేరొందిన ఆర్చర్ డేనియల్స్ మిడ్ లాండ్ (ఏడీఎం) సీఈవో విక్రం లూథర్ కేటీఆర్‌ను కలిశారు. తెలంగాణలో ఏడీఎం కార్యకలాపాలు విస్తరిస్తే తాము సహకరిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఇల్లినాయిస్ స్టేట్ ఫస్ట్ అసిస్టెంట్ డిప్యూటీ గవర్నర్ క్రిష్టి జార్జ్, కామర్స్ సెక్రెటరీ క్రిస్టిన్ రిచర్డ్స్ కేటీఆర్‌తో భేటీ అయ్యారు. క్లీన్ టెక్, సుస్థిర మొబిలిటీ, లైఫ్ సైన్సెస్, వైమానిక, వ్యవసాయ రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. చికాగో బూత్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ మాధవ రంజన్ కూడా కేటీఆర్‌ను కలిశారు. హైదరాబాదులో పరిశోధన, ఐఎస్‌బీ తరహా విద్యాసంస్థల ఏర్పాటు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు రావలసిందిగా ప్రొఫెసర్ మాధవ్ రంజన్‌ను ఆహ్వానించారు. షికాగోలో భారత్ కాన్సుల్ జనరల్ సోమనాథ్ ఘోష్, రాష్ట్ర ఐటీ పరిశ్రమల కార్యదర్శి జయేశ్ రంజన్, ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, డిజిటల్ మీడియా వింగ్ డైరెక్టర్ కొణతం దిలీప్ పాల్గొన్నారు.

మైనర్ ఇరిగేషన్‌లో 5వ స్థానంలో రాష్ట్రం

- జాతీయ చిన్న నీటిపారుదల వనరుల గణనలో వెల్లడి
- చిన్న వనరుల సంఖ్యలో జాతీయ స్థాయిలో రాష్ట్రం వాటా 7.3%
- వ్యక్తిగత యాజమాన్యం కిందే 95.8 శాతం వనరులు
- 81% శాతం వనరులకు సబ్ మెర్సిబుల్ పంపులు



సాక్షి, హైదరాబాద్: చిన్న నీటిపారుదల వనరుల సంఖ్యలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఐదో స్థానంలో నిలిచింది. భూగర్భ వనరుల్లో 5వ స్థానం, భూ ఉపరితల వనరుల్లో 3వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో మొత్తం 16,79,868 చిన్న నీటిపారుదల వనరులుండగా, అందులో 16,79,868 (94%) భూగర్భ జల వనరులు, 1,00,619 (6%) భూ ఉపరితల జల వనరులున్నాయి. కేంద్ర జలశక్తి శాఖ తాజాగా ప్రకటించిన చిన్న నీటిపారుదల వనరుల 6వ గణన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. 2017–18కి సంబంధించిన గణాంకాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. ఐదో గణనతో పోలిస్తే 6వ గణన నాటికి రాష్ట్రంలో 15,22,292 (10.4%) వనరులు పెరిగాయి. దేశంలోని మొత్తం చిన్న నీటిపారుదల వనరుల్లో రాష్ట్రం వాటా 7.3 శాతంగా ఉంది.

95 శాతం ప్రైవేటు యాజమాన్యంలోనే..

చిన్న నీటిపారుదల వనరుల్లో 16,09,623 (95.8 శాతం) ప్రైవేటు వ్యక్తుల యాజమాన్యంలో ఉండగా, 56,668 (3.4 శాతం) ప్రభుత్వం, 13,577 (0.8 శాతం) రైతు గ్రూపుల యాజమాన్యంలో ఉన్నాయి. 1,00,619 భూ ఉపరితల వనరుల్లో 52,703 (52.4%) ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఐదెకరాలు, అంతకంటే తక్కువ పొలాలు కలిగిన చిన్న కమతాల రైతుల యాజమాన్యంలోనే 13,36,767 (83.1%) వ్యక్తిగత చిన్న నీటిపారుదల వనరులున్నాయి. మిగిలిన 16.9 శాతం వనరులు పెద్ద, మధ్యతరహా రైతుల యాజమాన్యంలో ఉన్నాయి.

81% సబ్ మెర్సిబుల్ పంపులే..

16,79,868 చిన్న నీటిపారుదల వనరుల్లో 15,96,852 వనరుల నుంచి నీళ్లను తోడడానికి మోటార్లను వినియోగిస్తున్నారు. అందులో 13,03,446 (81.6%) సబ్ మెర్సిబుల్ పంపులు, 2,60,626 (16.3%) సాధారణ పంపు మోటార్లను వినియోగిస్తున్నారు. 893 (0.1శాతం) వనరుల నుంచి మనుషులు, జంతువుల సహాయంతో నీళ్లను తోడుతున్నారు.

41.6 శాతం భూగర్భ పైప్‌లైన్ ఆధారిత వనరులు..

చిన్న నీటిపారుదల వనరుల్లో 6,75,008 (41.6%) వనరులు భూగర్భ పైప్‌లైన్ ద్వారా, 3,98,977 (24.6%) వనరులు లైనింగ్ లేని కాల్వల ద్వారా, 2,32,821 (14.4%) వనరులు భూ ఉపరితల పైపుల ద్వారా, లైన్డ్ కాల్వల ద్వారా 2,30,859 (14.2%) వనరులు, 42,858 (2.6%) వనరులు డ్రిప్, 31,523 (1.9%) వనరులు స్ప్రింకర్ల ద్వారా, మిగిలిన 9,045 (0.7%) వనరులు ఇతర పరికరాల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాయి.

96.5% వనరులు వినియోగంలో..

మొత్తం 16,79,868 వనరుల్లో 16,21,091 (96.5%) శాతం వినియోగంలో ఉండగా, 35,798 (2.1%) తాత్కాలికంగా, 22,979 (1.4%) వనరులు శాశ్వతంగా వినియోగంలో లేవు.

16.3% పెరిగిన సామర్థ్యం..

రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వనరుల అభివృద్ధితో 16.3 శాతం సాగునీటి సామర్థ్యం పెరిగింది. 5వ గణన నాటికి 30,14,446 హెక్టార్లు ఉన్న ఆయకట్టు 6వ గణనలో 35,06,333 హెక్టార్లకు పెరిగింది. 5వ గణన నాటికి 22,06,925 హెక్టార్ల ఆయకట్టు వినియోగంలో ఉండగా, 6వ గణనలో వినియోగం 28,88,483 (30.9 శాతం వృద్ధి) హెక్టార్లకు పెరిగింది.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను శనివారం రాత్రి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏపీలో రెండ్రోజులు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: చాలా రోజుల తర్వాత నైరుతి రుతుపవనాల్లో కాస్త కదలిక వచ్చింది. ఫలితంగా ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం.. పశ్చిమ, నైరుతి గాలులు, రుతుపవనాల ప్రభావం ఏపీలో మరో రెండు రోజులపాటు ఉంటుందని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు. ఆది, సోమవారాల్లో ఉత్తర కోస్తాలో కొన్నిచోట్ల.. దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది.

భారతీయ విద్యార్థులకు యూకేలో అధిక అవకాశాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గారెత్ విన్ ఓవెన్, మిథాలీ రాజ్

రాంగోపాల్‌పేట్: భారతీయ విద్యార్థులకు యూకేలో ఉన్నత విద్యనభ్యసించేందుకు అధిక అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. శనివారం సాయంత్రం సికింద్రాబాద్ ఎస్వీఐటీ ఆడిటోరియంలో గ్లోబల్ ట్రీ సంస్థ ఆధ్వర్యంలో 'అచీవర్స్ డైలాగ్స్' పేరుతో యూకే వెళ్లే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే టాప్ టెన్ యూనివర్సిటీలు యూకేలో ఉన్నాయని చెప్పారు. అలాగే నేటి విద్యా విధానానికి అనుగుణంగా అధునాతన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. భారత దేశం నుంచి ప్రతి ఏడాది లక్షన్నర మంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం యూకే వెళుతున్నారని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన చెప్పారు. యూకేలో నాణ్యమైన విద్యతో పాటు విస్తతమైన ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా భారత మహిళా క్రికెట్ కెప్టెన్ మిథాలీ రాజ్ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. క్రీడల్లో తాను కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఎలా చేరుకున్నది వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గానికీ ఓ అటవీ పార్కు

- రాష్ట్రంలో 270 కోట్ల మొక్కలు
- హైదరాబాద్‌లో 60నుంచి 70 పార్కులు
- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



పార్కు ఆవరణలో సంతోష్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటిన మంత్రులు మహేందర్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, సబితారెడ్డి తదితరులు

మణికొండ: రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికీ ఓ అటవీ పార్కును అభివృద్ధి చేస్తామని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే 109 పార్కులకు గానూ 73 పూర్తి చేశామని, మంచిరేవులలో 74వ పార్కు అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. శనివారం హైదరాబాద్ నగర శివారు చిలుకూరు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని మంచిరేవుల ఔటర్‌రింగ్ రోడ్డుకు ఆనుకుని 360 ఎకరాలలో రూ.7.38 కోట్ల నిధులతో అభివృద్ధి చేసిన ట్రెక్ పార్కును ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, మంత్రులు పి.సబితారెడ్డి, పి.మహేందర్‌రెడ్డిలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 230 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే లక్ష్యాన్ని దాటి 270 కోట్ల మొక్కలను నాటామన్నారు. అందులో 80శాతం మొక్కలు బతుకుతున్నాయని, ఈ ఏడాది 30 కోట్ల మొక్కలను నాటాలని నిర్ణయించుకున్నామని వివరించారు. హైదరాబాద్‌లో 60నుంచి 70 పార్కులు అందుబాటులో ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని పార్కులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అర్బన్ లంగ్ స్పేస్‌లో భాగంగా మానసిక ఉల్లాసం, ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు సరికొత్త థీమ్‌తో ఈ ట్రెక్ పార్కును అభివృద్ధి చేశామన్నారు. ఇందులో 50 వేల రకాల మొక్కలు, 2 కిలోమీటర్ల ట్రెక్కింగ్ ట్రాక్, 4 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, రాక్ పెయింటింగ్, ఓపెన్ జిమ్, హంపి థియేటర్, ట్రీ వాటర్ ఫాల్, వాచ్ టవర్ లాంటి అనేక సౌకర్యాలను కల్పించామని స్థానిక ప్రజలు దీన్ని వినియోగించుకోవాలని కోరారు. పార్కును ప్రారంభించి సఫారీ వాహనంలో పర్యటించి, మొక్కలు నాటారు.

రాష్ట్రం ఏర్పడిన మొదలు..

రాష్ట్రం ఏర్పడినప్పటినుంచి కోట్లాది మొక్కలు నాటడం ఎంతో మంచి కార్యక్రమమని రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రం చూసుకున్నా పచ్చదనం తగ్గుతుంటే రాష్ట్రంలో మాత్రం 7.3శాతం పెరగటం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి. ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, పైలెట్ రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ వి.ప్రతాప్‌రెడ్డి, సీఎం కార్యదర్శి భూపాల్‌రెడ్డి, సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ హరీశ్, బండ్లగూడ మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధితోనే దేశ ప్రగతి

- 'నిలువెత్తు నిజాయితీ' పుస్తకావిష్కరణలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు
- హాజరైన జస్టిస్ ఎన్వీ రమణ

బంజారాహిల్స్ (హైదరాబాద్): గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం మరింత వేగంగా ముందుకు వెళ్తున్నట్లు భావించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ పూర్వ చీఫ్ ఇంజనీర్ గూడపాటి సీతారామస్వామి జీవిత చరిత్రపై రచయిత పాలకోడేటి సత్యనారాయణరావు రచించిన 'నిలువెత్తు నిజాయితీ' పుస్తకాన్ని ఆయన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, సీతారామస్వామి జీవితం నేటి యువతకు, భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకం అని అన్నారు. వారి కర్తవ్య దీక్ష, పల్లెలపై ప్రేమ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో వారు నెలకొల్పిన ప్రమాణాలు ఆదర్శనీయమని ప్రశంసించారు. ఎంత ఉన్నత స్థాయికి చేరినా స్వగ్రామం కోసం సీతారామస్వామి ఎంతో తపించారని పేర్కొన్నారు. నేటి యువతకు, రేపటి తరానికి సీతారామస్వామి అనుభవాలు అందించేందుకు, స్ఫూర్తి కలిగించేందుకు ఈ పుస్తకం తీసుకురావడం అభినందనీయమని అన్నారు. కాగా, మాతృభాషలో మాట్లాడితే తక్కువగా చూస్తారు అనే తప్పుడు భావన చాలా మందికి ఉందని, భారత అత్యున్నత న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తికి ఎన్వీ రమణ మాతృభాషలో ఈ సభా వేదికపై మాట్లాడటం సంతోషాన్ని కలిగించింది అన్నారు. కార్యక్రమంలో నటుడు మురళీమోహన్, పుస్తక రచయిత సత్యనారాయణరావు, గూడపాటి సీతారామస్వామి, మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ, రమేష్, మాజీ ఎంపీ వివేక్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తదితరులు

సారూ.. మాకు ఇల్లొచ్చిందా?

సికింద్రాబాద్‌కు చెందిన మణెమ్మ నాలుగేళ్ల క్రితం మీ సేవలో డబుల్ బెడ్రూం ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంది. రెండు నెలల క్రితం ఇద్దరు ప్రభుత్వ సిబ్బంది వచ్చి విచారణ జరిపారు. అన్ని వివరాలు అడగటంతో పాటు ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ ప్రతులను తీసుకున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల డ్రా ఉందని తెలుసుకున్న మణెమ్మ కలెక్టరేట్‌కు వెళ్లింది. అక్కడి ప్రాంగణంలో కనిపించిన వారికి మీ సేవ రసీదు చూపిస్తూ.. నాకు ఇల్లొచ్చిందా సారూ..? జర సూడండి అంటూ వేడుకోవడం కనిపించింది. ఇలా మణెమ్మ ఒక్కతే కాదు.. గత మూడు రోజులుగా కలెక్టరేట్‌కు వస్తున్న ఎంతో మంది పేదలది ఇదే గోస.

- డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఉరుకులు పరుగులు
- మీ సేవ రసీదులతో కలెక్టర్ కార్యాలయానికి క్యూ
- ఫోన్‌కు సమాచారం వస్తుందంటూ సమాధానం

సాక్షి, హైదరాబాద్: నగరంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కావడంతో పేదవాళ్లు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. గత మూడు రోజులుగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టరేట్‌లకు దరఖాస్తుదారులు క్యూ కడుతున్నారు. రెండు రోజుల క్రితం ఆన్‌లైన్ పద్ధతిలో మొదటి విడతగా నియోజకవర్గానికి 500 చొప్పున లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కావడంతో నిరుపేదల్లో ఆందోళన మొదలైంది. మీ సేవ రసీదులతో కలెక్టరేట్‌కు చేరుకొని హౌసింగ్ విభాగంలో ఎంపికైన జాబితాలో తమ పేరు ఉందో లేదో అని ఆరా తీసున్నారు. అక్కడి సిబ్బంది మాత్రం ఇళ్లు మంజూరైతే ఫోన్‌కు సమాచారం(ఎస్ఎంఎస్) వస్తోందని సమాధానం ఇస్తున్నారు. వాస్తవంగా ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారులు ఎంపిక పూర్తయినా.. ఇంకా ఫోన్‌లకు సమాచార ప్రక్రియ ప్రారంభంకానట్లు తెలుస్తోంది.. ఇది తెలియక దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. వచ్చే నెల 2 నుంచి ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

మొదటి విడతలో 12 వేల ఇళ్లు: గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాలకు కలిపి మొదటి విడతగా మొత్తం 12 వేల మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. ఏడు లక్షలపైగా దరఖాస్తులు ఉండగా క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం మూడున్నర లక్షల వరకు కుటుంబాలు అర్హత సాధించినట్లు తెలుస్తోంది. వాటిలో విడతల వారీగా ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టారు. మొదటి విడత కింద గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజవర్గాలకు కలిపి 7,500, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని నాలుగు అర్బన్ నియోజకవర్గాలకు కలిపి రెండు వేలు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని అయిదు అర్బన్ నియోజవర్గాలకు 2,500 మంది లబ్ధిదారులను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేశారు.

క్లుప్తంగా...

ట్రంప్‌తో కలిసి పోటీ పడడానికి సిద్ధమే

ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపికైనా ఓకేనన్న వివేక్ రామస్వామి



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష అభ్యర్థి రేసులో అనూహ్యంగా పుంజుకొని అందరి దృష్టిని ఆకర్షిస్తున్న భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి తన రూటు మార్చారు. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి రేసులో ఉన్న ఆయన ఇన్నాళ్లూ ఉపాధ్యక్ష పదవికైతే పోటీ పడనని చెబుతూ వస్తున్నారు. అధ్యక్ష పదవి తప్ప తనకు దేనిపైనా ఆసక్తి లేదని గతంలో చెప్పిన ఆయన ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష అభ్యర్థి నామినేషన్‌ను గెలుచుకుంటే ఆయనతో కలిసి పోటీ చేయడానికి సిద్ధమేనని స్పష్టం చేశారు. బ్రిటన్‌కు చెందిన జీబీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామస్వామిని ట్రంప్‌కు ఉపాధ్యక్షుడిగా పోటీ చేయడం మీకు సంతోషమేనా అని ప్రశ్నించగా ఇప్పుడు తన వయసుకు అది మంచి పదవేనని చెప్పారు. ''అమెరికాని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి పునరేకీకరణ చేయాల్సిన అవసరం ఉంది. వైట్‌హౌస్‌లో ఒక నాయకుడిగా ఉంటేనే ఆ పని నేను చెయ్యగలను''అని చెప్పారు. 38 ఏళ్ల రామస్వామి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల చర్చలో తన సత్తా చూపించి రేసులో ట్రంప్ తర్వాత స్థానంలో దూసుకుపోతున్నారు. రామస్వామిని ట్రంప్ శిబిరం కూడా ప్రశంసించింది. అప్పట్నుంచి ట్రంప్, రామస్వామిలు అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులుగా అంతిమంగా బరిలో నిలుస్తారన్న చర్చ పార్టీలో జరుగుతోంది.

సజావుగా ప్రజ్ఞాన్ రోవర్ ప్రయాణం, పనులు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రయాన్–3 ప్రాజెక్టులో భాగంగా చంద్రుడిపై ప్రజ్ఞాన్ రోవర్ సజావుగా ముందుకు సాగుతోందని ఇస్రో ప్రకటించింది. ఇందుకు సంబంధించిన వీడియో, ఫొటోలను తన వెబ్‌సైట్‌లో శనివారం విడుదల చేసింది. విక్రమ్ ల్యాండర్ ర్యాంప్ నుంచి చంద్రుని ఉపరితలానికి చేరిన రోవర్ ఇప్పటికి 8 మీటర్ల దూరం ప్రయాణించింది. చంద్రుడి ఉపరితలం మూలకాల కూర్పును అధ్యయనం చేయడానికి రోవర్‌లో రెండు పరికరాలను అమర్చడం తెల్సిందే. ఈ సమాచారాన్ని భూమికి చేరవేస్తోంది. చంద్ర దినం అంటే.. ఏకధాటిగా 14 రోజులపాటు సూర్యకాంతి ఉండే కాలంలో రోవర్ 500 మీటర్ల దూరం మాత్రమే ప్రయాణించనుంది. 'తొలి టాస్క్ అయిన ల్యాండర్ సేఫ్, సాఫ్ట్ ల్యాండింగ్ పూర్తయింది. రోవర్ సాధారణ కదలిక టాస్క్ సక్సెస్ అయింది. మూడోదైన.. శాస్త్రీయ ప్రయోగ ప్రక్రియలు కొనసాగుతున్నాయి' అని ఇస్రో శనివారం ట్వీట్‌చేసింది.



2న ఆదిత్య-ఎల్ 1 ప్రయోగం!

బెంగళూరు: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో జోరుమీదున్న భారత అంతరిక్ష అధ్యయన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమవుతోంది. సౌర వాతావరణం అధ్యయనానికి ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని మరో వారం రోజుల్లో పంపడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రయోగం మొదటి ప్రయత్నంలో విజయవంతమయ్యేలా ఇస్రో అన్ని జాగ్రత్తలు తీసుకుంది. శ్రీహరి కోట నుంచి పీఎస్ఎల్‌వీ సీ57 వాహక నౌక ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు.

''ఆదిత్య–ఎల్1 ప్రయోగం సెప్టెంబర్ 2న జరగడానికి అవకాశాలు అధికంగా ఉన్నాయి. రెండు వారాల క్రితమే ఉపగ్రహాన్ని బెంగళూరు నుంచి శ్రీహరి కోటకు తీసుకువచ్చాం'' అని ఇస్రో అధికారి ఒకరు వెల్లడించారు.

ప్రయోగం విశేషాలివే..

- భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో వున్న సూర్య వలయం లాంగ్రేజియన్ పాయింట్–1 (ఎల్1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి ఈ ఉపగ్రహాన్ని ప్రవేశపెడతారు
- భూమి నుంచి లాంగ్రేజియన్ పాయింట్‌కి చేరుకోవడానికి ఆదిత్య ఉపగ్రహానికి 175 రోజులు పడుతుంది
- లాంగ్రేజియన్1 పాయింట్‌లో ఆదిత్య ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టడం వల్ల గ్రహణాలు వంటివి పరిశోధనలకి అడ్డంకిగా మారవు.
- ఆదిత్య ఎల్–1 ఉపగ్రహం బరువు 1,500 కేజీలు
- సూర్యుడిలో మార్పులు, సౌర వాతావరణం ఎందుకు వేడిగా ఉంటుంది, అంతరిక్ష వాతావరణం, భూవాతావరణంపై దాని ప్రభావం వంటివన్నీ ఆదిత్య–ఎల్1 అధ్యయనం చేస్తుంది.
- సూర్యుడి వెలువల పొరలు, సౌరశక్తి కణాలు, ఫొటోస్ఫియర్ (కాంతి మండలం) క్రోమోస్ఫియర్ (వర్ణమండలం), కరోనా వలయంలో పెరుగుతున్న వేడి వంటి వాటిపైన అధ్యయనం జరుగుతుంది.
- మొత్తం ఏడు పే లోడ్లను ఇది మోసుకుపోతుంది. ఈ పేలోడ్లతో విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనాగ్రాఫ్ పేలోడ్ ద్వారా సూర్యగోళం నుంచి ప్రసరించే కాంతి ప్రభావాన్ని అధ్యయనం చేస్తుంది.

ఈ ఏడాది రికార్డే

- ఇస్రో చరిత్రలో 2023 ఒక రికార్డుగా మిగిలిపోనుంది. సూర్య చంద్రుల లోతుల్ని తెలుసుకోవడానికి రెండు నెలల వ్యవధిలో రెండు ప్రయోగాలు చేయడం చరిత్రే మరి. చంద్రయాన్–3 జాబిల్లి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగడంతో ఇప్పుడు అన్ని దేశాలు భారత్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయి. ఆదిత్య–ఎల్1 ప్రయోగం కచ్చితంగా విజయవంతమవుతుందనే విశ్వాసం ఏర్పడింది. 2024 చివరికి అంతరిక్షంలోకి మనుషుల్ని పంపి భారతీయుల మరో స్వప్నాన్ని తీర్చాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది.

'శివశక్తి'గా పిలుచుకుందాం

చంద్రుడిపై ల్యాండర్ దిగిన ప్రాంతానికి నామకరణం చేసిన మోదీ

ఆగస్ట్ 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా పాటిద్దామని పిలుపు

శివాజీనగర: చందమామ దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3 ల్యాండర్ దిగిన ప్రాంతం ఇకపై 'శివశక్తి' పేరుతో ఖ్యాతికెక్కనుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఇస్రో సాధించిన ఈ అద్భుత విజయానికి గుర్తుగా ల్యాండింగ్ జరిగిన రోజు(ఆగస్ట్ 23వ తేదీ)ను ఇకపై జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవాలని ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఏథెన్స్ నుంచి తిరుగు పయనమైన మోదీ శనివారం బెంగళూరుకు చేరుకున్నారు. చంద్రయాన్–3 విజయవంతమైన సందర్భంగా బెంగళూరులో ఇస్రో వారి టెలిమెట్రీ ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ సెంటర్‌లో ఇస్రో శాస్త్రవేత్తలను కలిశారు. విజయం కోసం అహర్నిశలు శ్రమించిన వారిని మనసారా అభినందించారు. వారి సమక్షంలో భావోద్వేగంతో మాట్లాడారు. ' భారత అంతరిక్ష ప్రయోగాల పథాన్ని ఈ విజయం నిజంగా అసాధారణమైన ఆనందంతో నింపేసింది. విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతాన్ని 'శివశక్తి'గా, 2019లో చంద్రయాన్–2 చంద్రునిపై కూలిన ప్రదేశాన్ని తిరంగా పాయింట్‌గా పిలుచుకుందాం. శివశక్తిలోని శివ.. మానవత్వం శ్రేయస్సుకు ప్రతీక. శక్తి.. మానవాళి సంక్షేమ ఆకాంక్షలకు తగిన ధైర్యం, స్థైర్యాన్ని అందిస్తుంది. అందుకే ఆ ప్రాంతానికి శివశక్తిగా నామకరణం చేశా' అని అన్నారు. 'భారతీయ గ్రంథాల్లోని ఖగోళ సూత్రాలను శాస్త్రీయంగా రుజువుచేసేందుకు నవతరం ముందుకు రావాలి. వాటిని అధ్యయనం చేయాలి. ఇది మన వారసత్వానికి, శాస్త్రానికి ఎంతో ముఖ్యం. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులపై ఇందుకు సంబంధించి రెట్టింపు బాధ్యత ఉంది. వందల ఏళ్ల బానిసత్వం కారణంగా భారత ఉజ్వల శాస్త్రీయ విజ్ఞానం మరుగునపడింది. 'ఆజాదీ కా అమృత్' కాలంలో ఆ విజ్ఞాన నిధిని మళ్లీ వెలికితీసి ప్రపంచానికి చాటి చెప్పాలి' అని మోదీ అభిలషించారు.


చంద్రయాన్-3 మిషన్‌ను విజయవంతం చేసిన మహిళా శాస్త్రవేత్తలతో శనివారం బెంగళూరులోని ఇస్రో సెంటర్‌లో ప్రధాని మోదీ, ఇస్రో చైర్మన్ సోమనాథ్

ఇబ్బంది పడొద్దనే సీఎం, గవర్నర్‌లను వద్దన్నా

మొదట బెంగళూరు హెచ్ఏఎల్ విమానాశ్రయంలో దిగిన మోదీ అక్కడి నుంచి కాన్వాయ్‌లో ప్రజలకు చేతులు ఊపుతూ మినీ రోడ్‌షో నిర్వహించారు. అభిమానులకు, ప్రజలకు అభివాదం చేస్తూ ఇస్రో కార్యాలయానికి చేరుకున్నారు. బెంగళూరులో ప్రధానికి స్వాగతం పలికేందుకు కర్ణాటక గవర్నర్, ముఖ్యమంత్రి రాలేదు. ఇందుకు కారణాన్ని మోదీనే వివరించారు. ' గ్రీస్ నుంచి సుదూర ప్రయాణం కారణంగా సరిగ్గా ఎన్ని గంటలకు విమానం ల్యాండ్ అవుతుందో తెలీదు. గవర్నర్ గెహ్లాట్, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డెప్యూటీ సీఎం డీకే శివకుమార్ నాకోసం అనవసరంగా చాలా సేపు వేచిఉండాల్సి రావొచ్చు. అందుకే స్వాగతం పలికేందుకు రావద్ద ని ముందే తెలియజేశా' అని మోదీ స్పష్టత నిచ్చారు. కాగా, మోదీ వివరణపై కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ మండిపడ్డారు. 'మోదీ కంటే ముందే ఇస్రో శాస్త్రవేత్తలను సీఎం, డెప్యూటీ సీఎం ఘనంగా సత్కరించారు. అది మోదీకి సుతరాము నచ్చలే దు. అందుకే ఈసారి ఆయన వచ్చినపుడు సీఎంను రావొద్దని చెప్పారు' అని ఆరోపించారు. తర్వాత ఢిల్లీకి చేరుకున్న మోదీ పాలెం ఎయిర్‌పోర్టులో తనకు స్వాగతం పలికిన బీజేపీ చీఫ్ నడ్డా, పార్టీ శ్రేణులతో మాట్లాడారు. 'చంద్రయాన్ విజయంతో వెల్లువెత్తిన ఉత్సాహాన్ని.. యువతరంలో శాస్త్రీయ విజ్ఞానంపై మక్కువ పెంచేందుకు ఉపయోగించాలి. అప్పుడే 2047కల్లా అభివృద్ధి చెందిన భారత్ అనే కల నెరవేరుతుంది' అని అన్నారు.

జై విజ్ఞాన్.. జై అనుసంధాన్

'చంద్రయాన్–3 విజయం తర్వాత ఇక్కడికొచ్చేందుకు, మిమ్మల్ని అభినందించేందుకు ఎంతో ఆత్రుతగా ఎదురుచూశా. పని పట్ల మీ అంకితభావం, నిబద్ధత, ధైర్యసాహసాలు, తెగువకు నా సెల్యూట్' అని బెంగళూరులో ఇస్రో శాస్త్రవేత్తలపై మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. 'చందమామను భారత్ చేరుకుంది. ల్యాండర్, రోవర్ రూపంలో మన జాతి గౌరవం చంద్రుడిపై సగర్వంగా అడుగుపెట్టింది. ఈ ప్రాజెక్టులో పాలుపంచుకున్న మహిళా శాస్త్రవేత్తలను చూసి గర్విస్తున్నా. దేశ నారీశక్తి ఈ ప్రాజెక్టులో పెద్దపాత్ర పోషించింది. మనోధైర్యం ఉంటే విజయం గ్యారెంటీ. శాస్త్ర, సాంకేతిక, నవకల్పనల నుంచి స్ఫూర్తి పొందేందుకు ఆగస్ట్ 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినంగా జరుపుకుందాం' అని మోదీ అన్నారు. 'జై విజ్ఞాన్...జై అనుసంధాన్ అనే నినాదం ఇచ్చారు. 'విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై దిగిన సమయంలో దక్షిణాఫ్రికాలో ఉన్నాను. అయినా నా మనస్సు, ఆలోచన మొత్తం ఇక్కడే ఉన్నాయి. అందుకే గ్రీస్ దేశం నుంచి మిమ్మల్ని కలవడానికే నేరుగా ఇక్కడికొచ్చా. ఇప్పటి వరకు భారత్‌లోని ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడేది. ఇకపై చంద్రునిపైనా త్రివర్ణ పతాకం వెలుగులీనుతుంది. ప్రస్తుతం సాధించిన అంతరిక్ష విజ్ఞానంతో ఎన్నో ఫలితాలు అందుకోవాలి. ఆ ఫలితాలు కీలకమైన వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఉపయోగపడాలి' అని మోదీ అన్నారు.

ఆ మూడ్రోజులు 'ఢిల్లీ'కి సెలవు..

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ జీ–20 శిఖరాగ్ర సదస్సుకు సమాయత్తమవుతోంది. సెప్టెంబర్ 8, 9, 10వ తేదీల్లో జరిగే ఈ సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కేంద్రం ప్రయత్నాలు ప్రారంభించింది. సదస్సు దృష్ట్యా వచ్చే నెల 8 నుంచి మూడ్రోజుల పాటు ఢిల్లీలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవులు ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సదస్సుకు హాజరవుతున్న భాగస్వామ్య దేశాల నేతల భద్రత దృష్ట్యా ఆ మూడు రోజులూ లుటియన్స్ ఢిల్లీలోని అన్ని మాల్స్, మార్కెట్లను మూసి ఉంచాలన్న పోలీసు శాఖ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి కేజ్రీవాల్, లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ సక్సేనా ఆమోదం తెలిపారు. అంతేకాకుండా, రాజధానిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బ్యాంకులు, దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలను మూసివేయనున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సుప్రీంకోర్టు, సెంట్రల్ సెక్రటేరియట్ సహా కొన్ని మెట్రో స్టేషన్లు మూసివేయనున్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్దేశిత ప్రాంతాల్లో ప్రభుత్వ బస్సుల రాకపోకలను గణనీయంగా తగ్గించనున్నారు. సదస్సుకు 20 దేశాల అధినేతలు సహా 14 అంతర్జాతీయ సంస్థల అధిపతులు హాజరయ్యే అవకాశం ఉంది. హాజరయ్యే ముఖ్యుల్లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, యూకే ప్రధాని రిషి సునాక్, జపాన్ ప్రధాని ఫ్యూమియో కిషిదా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ల తదితరులున్నారు.

హోటళ్లకు పెరిగిన గిరాకీ...

జీ20 సదస్సు నేపథ్యంలో ఢిల్లీ సహా, గురుగ్రావ్, నోయిడాల్లోని పెద్ద హోటళ్లకు గిరాకీ పెరిగింది. ప్రపంచ నాయకులతో పాటు వారి ప్రతినిధి బృందాలు, భారీ రక్షణ, మీడియా బృందాలు ముందుగానే భారత్ చేరుకుంటుండటంతో టాప్ ఫైవ్ స్టార్ హోటళ్లలో బుకింగ్‌లు పెరిగాయి. సెప్టెంబర్ 6 నుంచి 12 మధ్య అన్ని ఫైవ్ స్టార్ హోటళ్లు పూర్తిగా బుక్ అయ్యాయని తెలుస్తోంది. హోటల్ గదుల ధరలు కూడా భారీగా పెరిగాయి. ఎయిర్‌పోర్ట్‌కి సమీపంలోని ఏరోసిటీలోని హోటల్‌లో ఉత్తమమైన సూట్ ఒక రాత్రికి రూ.20 లక్షల చొప్పున కోట్ చేశారని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. పార్లమెంట్‌కు కూతవేటు దూరంలోని జన్‌పథ్ సమీపంలోని ఒక హోటల్‌లో ప్రధాన సూట్‌కు ఒక్క రాత్రికి రూ.15 లక్షలకు బుక్ అయిందని అవి వెల్లడించాయి.

మదురై రైలు బోగీలో మంటలు

- తమిళనాడులో ఘోర ప్రమాదం
- 9 మంది మృత్యువాత మరో 20 మందికి గాయాలు
- కోచ్‌లో గ్యాస్ స్టౌపై టీ కాచడంతో పేలిన సిలిండర్
- మృతులంతా యూపీ వాసులు



సాక్షి, చెన్నై: తమిళనాడులోని మదురైలో శనివారం ఘోర రైలు ప్రమాదం చోటు చేసుకుంది. మదురై ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌లో నిలిచి ఉన్న ఒక ప్రైవేటు కోచ్‌లో మంటలు చెలరేగి తొమ్మిది మంది మరణించారు. మృతులందరూ ఉత్తరప్రదేశ్‌కు చెందినవారే. కోచ్‌లోకి అక్రమంగా గ్యాస్ సిలిండర్ తీసుకువెళ్లి టీ కాచుకోవాలని ప్రయత్నించడంతో ఈ ప్రమాదం జరిగిందని దక్షిణ రైల్వే అధికారులు వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 5.15 గంటలకు టీ కాచుకోవాలని స్టౌ ముట్టించగా, సిలిండర్ పేలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయని విచారణలో తేలింది. బోగీలో ఉన్న ప్రయాణికులు ప్రాణ రక్షణ కోసం ప్లాట్‌ఫారమ్ పైకి పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మంటల్లో చిక్కుకొని మరణిస్తే, మరో 20 మంది కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది స్టేషన్‌కు చేరుకొని మంటల్ని అదుపు చేయడానికి రెండు గంటలు పట్టింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 63 మందితో కూడిన బృందం లక్నో నుంచి ఈనెల 17న ఐఆర్‌సీటీసీ ద్వారా రిజర్వు చేసుకున్న ప్రత్యేక రైలు బోగీలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు బయలుదేరారు. తమ పర్యటన లో భాగంగా శుక్రవారం తమిళనాడు లోని కన్యాకుమారిలో పర్యటించారు. ఈ బోగీని నాగర్‌కోయిల్ నుంచి పునలూరు రైలుకు అనుసంధానించి మదురైకు పంపించారు. ఈ రైలు శనివారం వేకువజామున 3.45 గంటలకు మదురైకు చేరుకుంది. పునలూరు రైలు నుంచి ఈ బోగిని వేరు చేసి స్టాబ్లింగ్ లైన్‌లో ఉంచారు. 5.15 గంటల సమయంలో ఈ బోగిలో మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు చుట్టుముట్టి బోగి మొత్తం కాలిపోయింది. ఆదివారానికి ప్రయాణికులు రామేశ్వరం వెళ్లాల్సి ఉంది. పర్యాటక ప్రాంతాల సందర్శన తర్వాత వారంతా లక్నోకు తిరుగు ప్రయాణమవుతారు. అయితే ప్రయాణికులు రైల్వే అధికారుల కళ్లు గప్పి గ్యాస్ స్టౌ, సిలిండర్, వంట చేయడానికి వాడే కలప, వంట సామాగ్రి వంటివన్నీ ఆ కోచ్‌లోకి తీసుకువెళ్లడం వారి ప్రాణాల్ని హరించింది. ప్రమాదం జరిగినప్పుడు కోచ్‌లో 63 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రైల్వే శాఖ మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటించింది. తమిళనాడు సీఎం స్టాలిన్ రూ.3 లక్షలు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఐఆర్‌సీటీసీ వెబ్ పోర్టల్ ద్వారా ఎవరైనా పార్టీ కోచ్‌ను బుక్ చేసుకోవచ్చు. అయితే గ్యాస్ సిలిండర్, మండే గుణం కలిగిన పదార్థాలను తీసుకువెళ్లడంపై నిషేధం ఉంది.

రెడ్ డైరీలో రాజస్తాన్ ప్రభుత్వ అక్రమాలు

సీఎం గెహ్లాట్ రాజీనామా చేయాలి • హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు

జైపూర్: రాజస్తాన్ ప్రభుత్వం అవినీతి, అక్రమాల రహస్యాలన్నీ రెడ్ డైరీలో ఉన్నాయని, దీనిపై సీఎం అశోక్ గెహ్లాట్ రాజీనామా చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. గంగాపూర్‌లో శనివారం జరిగిన 'సహకార కిసాన్ సమ్మేళన్'ను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. ఆయన ప్రసంగం ప్రారంభించగానే కొందరు నినాదాలు ప్రారంభించారు. వారినుద్దేశించి మంత్రి మాట్లాడుతూ..'నినాదాలు చేసేందుకు కొందరిని పంపించినంత మాత్రాన ఒరిగేదేమీ ఉండదని గెహ్లాట్‌కు చెప్పాలనుకుంటున్నా. ఆయనకు సిగ్గుంటే, రెడ్ డైరీ వ్యవహారంపై రాజీనామా చేసి, ఎన్నికలకు వెళ్లి ఉండేవారు'అని వ్యాఖ్యానించారు. 2020లో కాంగ్రెస్ నేత ధర్మేంద్ర రాథోడ్ ఇంటిపై ఆదాయపన్ను శాఖ అధికారులు జరిపిన దాడుల్లో 'రెడ్ డైరీ'దొరికింది. దాన్లో సీఎం గెహ్లాట్ ఆర్థిక లావాదేవీల వివరాలన్నీ ఉన్నట్లు మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన రాజేంద్ర గూఢా చేసిన ఆరోపణలను అమిత్ షా తన ప్రసంగంలో ప్రస్తావించారు.

నూహ్‌లో మళ్లీ ఇంటర్నెట్ సేవలు బంద్

శోభాయాత్ర దృష్ట్యా హరియాణా ప్రభుత్వం నిర్ణయం

చండీగఢ్: శోభాయాత్ర పిలుపు నేపథ్యంలో నూహ్ జిల్లాలో ఈ నెల 28 వరకు మొబైల్ ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించడంతోపాటు నిషేధాజ్ఞలు అమలు చేయాలని హరియాణా ప్రభుత్వం నిర్ణయించింది. జూలై 31వ తేదీన జరిగిన మతపర ఘర్షణల నేపథ్యంలో ఈ మేరకు చర్యలు చర్యలు తీసుకున్నట్లు వివరించింది. నూహ్‌లో సోమవారం తలపెట్టిన శోభాయాత్రకు అనుమతులు నిరాకరించామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఢిల్లీలో సెప్టెంబర్ 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే జీ–20 షెర్పా సమావేశాలను కూడా దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు నిర్ణయించామన్నారు. మొబైల్ ఇంటర్నెట్‌తోపాటు ఎస్ఎంఎస్ సర్వీసులపైనా నిషేధం విధించామన్నారు. సంఘ విద్రోహ శక్తులు సామాజిక మాధ్యమాల ద్వారా వదంతుల వ్యాప్తి చేయకుండా అడ్డుకోవడమే లక్ష్యమని చెప్పారు. ఈ నెల 26–28 తేదీల మధ్య 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని డీజీపీ శత్రుజీత్ కపూర్ చెప్పారు.

ఎన్నికల వేళ.. మధ్యప్రదేశ్ కేబినెట్ విస్తరణ

భోపాల్: అసెంబ్లీ ఎన్నికలు మరికొద్ది నెలల్లో జరగనున్న వేళ మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ తన మంత్రివర్గాన్ని విస్తరించారు. కొత్తగా బీజేపీకే చెందిన ఎమ్మెల్యేలు రాజేందర్ శుక్లా, గౌరీశంకర్ బిసెన్, రాహుల్ లోధిలను కేబినెట్‌లోకి తీసుకున్నారు. కుల, ప్రాంతీయ సమీకరణాల్లో సమతూకం పాటించే లక్ష్యంతో ఒక బ్రాహ్మణ, ఇద్దరు ఇతర వెనుకబడిన కులాల(ఓబీసీ) వీరికి తాజాగా ప్రమోషన్ ఇచ్చినట్లు భావిస్తున్నారు. శనివారం ఉదయం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ మంగుభాయ్ పటేల్ ముగ్గురితో మంత్రులుగా ప్రమాణం చేయించారు. తాజా విస్తరణతో మంత్రుల సంఖ్య 34కు చేరింది.

నాలుగు దేశాలు.. నలుగురు వ్యోమగాములు

స్పేస్ ఎక్స్ రాకెట్‌లో ఐఎస్ఎస్‌కు పంపిన నాసా



కేప్ కెనవెరాల్: నాలుగు వేర్వేరు దేశాలకు చెందిన నలుగురు వ్యోమగాములతో స్పేస్ ఎక్స్ రాకెట్ శనివారం కేప్ కెనవెరాల్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. కక్ష్యలో పరిభ్రమిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోకి ఆదివారం నలుగురు వ్యోమగాములు అడుగిడుతారు. మార్చి నెల నుంచి అక్కడే విధులు నిర్వర్తిస్తున్న వ్యోమగాముల స్థానంలో వీరు బాధ్యతలు చేపడతారు. ఆరు నెలలపాటు అక్కడుంటారు. నలుగురిలో ఒకరు నాసాకు చెందిన వారు కాగా, మిగతా ముగ్గురు డెన్మార్క్, జపాన్, రష్యా దేశస్తులు. అమెరికా ఇలా ఒకే అంతరిక్ష నౌకలో వేర్వేరు దేశాలకు చెందిన వారిని ఐఎస్ఎస్‌కు పంపించడం ఇదే మొదటిసారి. ఇప్పటి వరకు నాసా పంపించిన స్పేస్ ఎక్స్ ట్యాక్సీ రాకెట్లలో ఇద్దరు లేదా ముగ్గురు అమెరికన్లు ఉండేవారు. తాజా బృందానికి నాసాకు చెందిన జాస్మిన్ మొఘబెలి అనే మెరైన్ పైలట్ నాయకత్వం వహిస్తున్నారు. జాస్మిన్ తల్లిదండ్రులు ఇరాన్ దేశస్తులు. 1979లో ఇరాన్ విప్లవం సమయంలో జర్మనీ వెళ్లిపోయారు. అక్కడే జాస్మిన్ పుట్టారు. న్యూయార్క్‌లో పెరిగారు. అమెరికా మెరైన్స్ చేరి అఫ్గానిస్తాన్‌లో యుద్ధ హెలికాప్టర్లు నడిపారు. ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధించవచ్చని ఇరాన్ బాలికలకు చూపుతున్నానని ఆమె అంటున్నారు.

పార్టీ చీలదు

- కొందరు ఎమ్మెల్యేలంటే మొత్తం పార్టీ కాదు
- ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ వ్యాఖ్య

కొల్హాపూర్: ఎన్సీపీలో చీలిక రాబోతోందంటూ వినవస్తున్న ఊహాగానాలకు పార్టీ అధినేత శరద్ పవార్ అడ్డుకట్టవేశారు. 'పార్టీలో చీలిక అనే సమస్యే లేదు. ఒక వేళ నిజంగానే పార్టీ ఎమ్మెల్యేలు కొందరు పార్టీని వీడితే అది అంతవరకే పరిమితం. అంతేగానీ అది మొత్తం పార్టీకి వర్తించదు. ఎమ్మెల్యేలు అంటే అర్థం మొత్తం పార్టీ అని కాదు. పార్టీకి జాతీయ అధ్యక్షుడిని నేనే. మహారాష్ట్ర రాష్ట్ర విభాగానికి జయంత్ పాటిల్ సారథ్యం కొనసాగుతుంది. తిరుగుబాటు శాసనసభ్యులకు ఎందుకంత ప్రాధాన్యత ఇస్తారు?' అని మీడియా ప్రతినిధులను ఎదురు ప్రశ్నించారు. శుక్రవారం పవార్ కూతురు, ఎన్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే మాట్లాడుతూ.. ' అజిత్ పవార్, కొందరు ఎమ్మెల్యేలు షిండే సర్కార్‌లో భాగస్వామ్యం అయినా సరే ఎన్సీపీ చీలిపోలేదు. అజిత్ ఎన్సీపీ నేతగానే కొనసాగుతారు' అని తెలిపారు. దీనిపై శరద్ స్పందిస్తూ.. ' అవును అది నిజమే. ఇందులో వివాదం ఏం లేదు' అని అన్నారు. కానీ కొద్ది సేపటికే అలా అనలేదంటూ మాటమార్చారు.

తోటి విద్యార్థులతో కొట్టించి... మత వివక్ష నూరిపోసి

- యూపీ స్కూల్లో మైనర్ బాలుడిపై టీచర్ దారుణం
- వైరల్‌గా మారిన వీడియో
- బడిలో విద్వేషాలు నూరి పోస్తున్నారన్న రాహుల్

ముజఫర్‌నగర్: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లో ఖుబ్బాపూర్ గ్రామంలోని పాఠశాలలో రెండో తరగతి చదువుకుంటున్న మైనర్ విద్యార్థిపై దారుణం జరిగింది. ఎక్కాలు సరిగా నేర్చుకోలేదని క్లాస్ టీచర్ తృప్తి త్యాగి తోటి విద్యార్థులతో ఆ బాలుడి చెంపలు వాచేలా కొట్టించింది. అయిదో ఎక్కం సరిగా అప్పచెప్పకపోవడంతో ఆ బాలుడిని నిల్చోమని చెప్పిన ఆ టీచర్ పిల్లలందరూ వరుసగా వచ్చి కొట్టండంటూ ఆజ్ఞాపించింది. ఎవరైనా నెమ్మదిగా కొడితే ''ముస్లింలందరినీ కొట్టాలని నిర్ణయించుకున్నా. గట్టిగా కొట్టండి. నడుం మీద కూడా కొట్టండి'' అంటూ పిల్లల్ని రెచ్చగొట్టి కొట్టించడంపై కలకలం రేగుతోంది. దీనికి సంబంధించిన వీడియోలో బాలుడు నిస్సహాయంగా కళ్లనీళ్లతో తలవంచుకొని కనిపించడం కలచివేస్తోంది. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. టీచర్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది.

గంటకు పైగా కొట్టారన్న బాలుడు

టీచర్ ఆదేశాలతో తోటి పిల్లలు గట్టిగా కొట్టడంతో బుగ్గలన్నీ ఎర్రగా వాచిపోయి ఉన్న ఆ బాలుడు కన్నీటిపర్యంతమైపోయాడు. అయిదో ఎక్కం సరిగా చెప్పకపోవడంతో టీచర్ తోటి పిల్లలతో కొట్టించిందన్నాడు. గంటసేపు ఆగకుండా వారు కొడుతూ ఉన్నారని చెప్పాడు. ఈ ఘటనతో ఏడేళ్ల వయసున్న తమ అబ్బాయి భయపడిపోతున్నా డని తండ్రి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ బాలుడి కజిన్ నదీమ్ స్కూల్లో ఏదో పని ఉందని వెళ్లి టీచర్ చేష్టలతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఆ టీచర్ తన సోదరుడ్ని కొట్టించడం వీడియో తీసి ట్విట్టర్‌లో ఉంచడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనపై విచారణ జరుపుతున్నామని జిల్లా మెజిస్ట్రేట్ అరవింద్ మల్లప్ప వెల్లడించారు.

విద్వేషాల పాఠశాలగా మారుస్తారా? రాహుల్ ధ్వజం

అమాయకులైన పిల్లల మెదళ్లను వివక్ష అనే విషంతో నింపేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పవిత్రమైన పాఠశాలను విద్వేష దుకాణంగా మార్చేశారని ఆరోపించారు. ఒక టీచర్ ఈ దేశానికి ఇంతకంటే హాని ఏమీ చెయ్యలేదని ట్వీట్ చేశారు.

సమర్థించుకుంటున్న టీచర్

ఆ స్కూల్‌కి ప్రిన్సిపాల్ కూడా అయిన తృప్తి త్యాగి తాను చేసిన పనిని సమర్థించుకుంటున్నారు. ఆ వీడియోని ఎడిట్ చేసి మతం రంగు పులిమారని ఆరోపించారు. తమ స్కూలులో హిందూ, ముస్లిం పిల్లలు సోదరభావంతో ఉంటారని చెప్పుకొచ్చారు.

స్టేడియంలో తొక్కిసలాట..12 మంది మృతి

అంటననరివో(మడగాస్కర్): క్రీడాపోటీల ప్రారంభం సందర్భంగా స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 12 మంది చనిపోగా మరో 85 మంది గాయపడ్డారు. ఈ విషాద ఘటన హిందూ మహా సముద్ర ద్వీప దేశం మడగాస్కర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. కొమరోస్, మాల్దీవులు, మారిషస్, రీయూనియన్, సెషెల్స్, మయొట్ వంటి ద్వీపదేశాల ఆటల పోటీలు శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ సమయంలో, మహమసినా స్టేడియం ప్రధాన ద్వారం వద్ద భారీగా జనం గుమికూడటం తొక్కిసలాటకు దారితీసిందని అధికారులు తెలిపారు. క్షతగాత్రుల్లో 11 మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు.


భూకంపంతో దెబ్బతిన్న ఫుకుషిమా అణు రియాక్టర్ నుంచి వ్యర్థ అణు జలాలను జపాన్ సముద్రంలోకి వదలడాన్ని నిరసిస్తూ శనివారం దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో నిరసన తెలుపుతున్న వేలాది మంది జనం.

సాక్షి
కరీంనగర్
ఆదివారం । 27 । ఆగస్టు । 2023

జిల్లా సహకార అధికారిగా రామానుజాచార్య



కరీంనగర్ అర్బన్: జిల్లా సహకార అధికారిగా సముద్రాల రామానుజాచార్య నియామకమయ్యారు. జగిత్యాల డీసీవోగా పనిచేసి కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు డీసీవోగా వ్యవహరించిన సీహెచ్.మనోజ్‌కుమార్ ఆడిట్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.



అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సీపీ సుబ్బారాయుడు సూచించారు. ఈ మేరకు పోలీసు సిబ్బందితో సమీక్షించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

దేవుడి భూములకే శఠగోపం!





స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సైట్‌లో..

- పరాధీనంలో 'రంగనాయకుల స్వామి' భూములు
- పట్టా చేయించుకున్న ఓ బడానేత
- వ్యవసాయ భూములుగా చూపుతూ రైతుబంధు స్వీకరణ
- పొజిషన్‌లో కొనసాగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థ
- భూముల పంచాయితీ హైకోర్టుకు చేరడంతో జిల్లాలో చర్చ



ధరణి సైట్‌లో ఇలా..



రంగనాయకుల స్వామి ఆలయం

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ధూప..దీప.. నైవేద్యం.. ఆలయాల పరిరక్షణకు దాతలు వితరణ చేసిన భూములను పర్యవేక్షించడంలో దేవాదాయశాఖ నిర్లక్ష్యంతో ఆలయ భూములు పరాధీనమవుతున్నాయి. 'రాజుల సొమ్ము రాళ్లపాలు.. దేవుడి సొమ్ము దేశదిమ్మరుల పాలు' అన్న చందంగా మారింది. దేవుడి సొమ్మే కదా అని తేరగా కబ్జాలకు పాల్పడుతుండడంతో వేలాది ఎకరాలు అన్యాక్రాంతమవుతున్నాయి. అధికారుల అలసత్వంతో ఇప్పటికే కొన్నిచోట్ల లీజుదారుల కబంధహస్తాల్లో భూమి చిక్కుకుపోయింది. భూములపై నిర్దిష్ట సమాచారం లేకపోవడం, సర్వే చేపట్టకపోవడంతో భూబకాసురుల చెర నుంచి విముక్తి చేయలేక కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. పెద్దపల్లి జిల్లాలో 85 ఆలయాల పరిధిలో 1,089.34 ఎకరాలు ఉండగా.. అందులో 15 నుంచి 20 శాతం భూములు ఆక్రమణలో ఉన్నట్లు సమాచారం. దేవాదాయ భూములకు సంబంధించి ఎక్కడికక్కడ హెచ్చరికబోర్డులు లేకపోవడం, వందల ఏళ్ల కిందటి భూములు కావడంతో రక్షణ కరువైంది. కాలక్రమేణా వీటి ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా పెద్దపల్లి నుంచి ఓ ప్రజాప్రతినిధే అక్రమంగా దేవాదాయ భూములు పట్టా చేయించుకున్నాడని హైకోర్టు నోటీసులు జారీ చేయడంతో జిల్లాలో దేవాదాయ భూముల పరిరక్షణపై చర్చ నడుస్తోంది.

నేత, బంధువుల పేరిట పట్టాలు

దేవుడి భూములు కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే వాటికి ఎసరు పెడుతున్నారు. పెద్దపల్లి మండలంలోని పాలితం, బొంపల్లి, కనగర్తి, కాసులపల్లి, ధర్మాబాద్ గ్రామాల్లో 462.33 ఎకరాలు రంగనాయకుల స్వామి భూములు ఉన్నాయి. ఈ భూములను లీజుకు తీసుకొని ఏళ్లుగా పేదరైతులు సాగు చేసుకుంటూ.. ప్రభుత్వానికి కాస్తు(లీజు) డబ్బులు చెల్లించేవారు. తాజాగా ధరణి పోర్టల్ వచ్చాక రెవెన్యూ రికార్డుల్లో ఆలయం పేరుకు బదులు కొందరు రైతులు పేర్లు ఎక్కించుకున్నారు. అందులో ప్రజాప్రతినిధి, వారి కుటుంబసభ్యులు సైతం ఉన్నారు. ధరణి పోర్టల్‌లో పలువురు రైతులతోపాటు ఆ నాయకుడి కుటుంబ సభ్యుల పేరిట పాసుపుస్తకాలు జారీ అయ్యాయి. అయినా వాటిని ఇంకా దేవాదాయశాఖ భూములుగానే చూపెడుతుండడం గమనార్హం. పాసుపుస్తకాలు జారీకావడంతో సదరు ఆక్రమణదారులు రైతుబంధు పొందుతున్నారు. ఆ ఆలయ భూములను పరిరక్షించాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ గోరక్షక్ జాపతి రాజేశ్‌పటేల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు సదరు నాయకుడితో సహా పలువురు రైతులకు, ప్రభుత్వ అధికారులకు నోటీసులు జారీచేసింది.

ఎన్నికల అఫిడవిట్‌లో వ్యవసాయ భూములుగా..

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సదరు నాయకుడు ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో తన పేరిట ఉన్న భూముల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించారు. అందులో కాసులపల్లిలో తనకు వ్యవసాయ భూమి ఉన్నట్లు చూపించారు. సదరు భూమి ధరణి పోర్టల్‌లో చూస్తే ఆ నేత పేరు చూపుతూనే.. అవి దేవాదాయశాఖ భూములుగా చూపుతుండడం గమనార్హం. ఇంకా ఆ సర్వే నంబర్లలోని భూములకు నాయకుడు రైతుబంధు తీసుకుంటుండగా, ప్రస్తుతం పొజిషన్‌లో ఆ సర్వేనంబర్లలో నాయకుడికి సంబంధించిన ప్రైవేట్ పాఠశాల కొన్నేళ్లుగా కొనసాగుతోంది. దీంతో ఎన్నికల సంఘాన్ని తప్పుదోవ పట్టించడంతోపాటు అర్హత లేకున్నా రైతుబంధు పొందుతుండడంపై వివిధ రాజకీయ పక్షాల నేతలు మండిపడుతున్నారు. స్థానిక అధికారులపై రాజకీయ ఒత్తిళ్లతోనే చర్యలు చేపట్టడం లేదని కోర్టుల ద్వారా సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని చెబుతున్నారు.

పేర్లు ఎక్కిస్తామని డబ్బుల వసూలు

రంగనాయకులస్వామి పరిధిలోని భూములను కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న వారిలో చిన్న, సన్నకారు రైతులు, భూస్వాములు, రాజకీయనేతలు ఉన్నారు. ధరణి పోర్టల్ వచ్చాక పలువురు నేతలు భూములను రైతుల పేరిట ఎక్కిస్తామని ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారు. ఆ సొమ్ముతో కొందరు మాత్రమే తమ పేరిట భూములను ధరణిలో ఎక్కించుకోగా.. మిగతా సాధారణ చిన్న, సన్నకారు రైతులు మోసపోయారు. స్థానిక బడా నేత, ఆయన కుటుంబ సభ్యులు, మరికొందరు విజయవంతంగా ధరణిలో పేరు ఎక్కించుకోవడంతో వారికి రైతుబంధు అందుతుండడం విశేషం. ధరణిలో ఎండోమెంట్ భూములు అని చూపుతున్నా ప్రభుత్వం రైతుబంధు చెల్లిస్తుండడం గమనించాల్సిన విషయం.

ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

దేవాదాయ భూములను ఇతరులకు విక్రయించడం, వాటిని కొనుగోలు చేయటం చట్టరీత్యా నేరం. రాజకీయ పలుకుబడి కలిగిన నేత, అతని బంధువులు మాత్రమే పట్టాలు చేయించుకున్నారు. నిజంగా సాగు చేసుకునే పేద, సన్నకారు రైతుల పేర్ల మీద పట్టాలు జారీకాలేదు. చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వమే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. సాగుచేసుకోకుండా అందులో వ్యాపారాలు చేసుకునే వారి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. దీనిపై పలుసార్లు అధికారులను కలిసినా రాజకీయ ఒత్తిళ్లతో ఎవరూ పట్టించుకోవడం లేదు.

– సత్యనారాయణరెడ్డి, న్యాయవాది

రెండేళ్ల కిందే ప్రభుత్వానికి నివేదించాం

పాలితం గ్రామంలోని రంగనాయకుల స్వామికి చెందిన దాదాపు 400 ఎకరాలకుపైగా భూములు అన్యాక్రాంతమయ్యాయని గతంలోనే నివేదిక ఇచ్చాం. చాలా ఏళ్ల కింద స్థానికులు దేవుని మాన్యం భూములను సాగుపేరిట లీజుకు తీసుకున్నారు. వారిలో కొందరు అక్రమమార్గంలో పట్టాలు పొందారు. అక్రమంగా రైతుబంధు కూడా పొందుతున్నారు. ఈ విషయాన్ని 2021లోనే పెద్దపల్లి కలెక్టర్‌కు, ప్రభుత్వానికి నివేదిక పంపాం. మా దేవాదాయశాఖ కమిషనర్ కూడా ప్రభుత్వానికి లేఖ రాశారు. వారికి వెంటనే రైతుబంధు నిలిపివేయాలని నివేదికలో పొందుపరిచాం.

– ఏసీ చంద్రశేఖర్

సండే స్పెషల్



అనుబంధాల తీజ్

ఉమ్మడి జిల్లాలోని గిరిజన తండాల్లో తీజ్ సందడి నెలకొంది. తరతరాలుగా వస్తున్న ఈ తీజ్ పండుగను సంప్రదాయబద్ధంగా గిరిజనులు జరుపుకుంటారు. ఈ పండుగ బతుకమ్మను పోలి ఉంటుంది. తీజ్‌ను ఎనిమిది రోజుల పాటు పూజించి తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తారు. ఏటా శ్రావణమాసంలో జరిగే ఈ సంబరాలు అంబరాన్నంటుతాయి. మంచి వరుడు దొరకాలని పెళ్లీడుకొచ్చిన యువతులు తొమ్మిది రోజులపాటు గోధుమ మొలకలకు పూజలు చేయడం ఈ వేడుక ప్రత్యేకత. – సాక్షి, కరీంనగర్ డెస్క్



సంస్కృతిని కాపాడుకుందాం

మాకు ప్రత్యేకమైన భాష, ఆచారం, సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా మా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటున్నాం. భవిష్యత్‌లో కూడా వాటిని కాపాడుకుంటాం. తీజ్ పండుగను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలి. రాబోయే కాలంలో తీజ్ పండుగను ప్రభుత్వం గుర్తిస్తుందని భావిస్తున్నాం.

– అజ్మీర శృతి, జగదాంబ తండా, గంభీరావుపేట

- తండాల్లో తీజ్ సంబురం
- ముస్తాబైన గిరిజన గూడేలు
- శ్రావణమాసంలోనే వేడుకలు
- తొమ్మిది రోజులు సందడి
- గోధుమనారుకు పెళ్లికాని యువతుల నిష్టతో పూజలు

తొమ్మిది రోజులు.. కఠిన నియమాలు

పెళ్లికాని యువతులు వెదురుబుట్టలో పుట్టమట్టిని తెచ్చి అందులో నవధాన్యాలు విత్తుతారు. తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షలు ఉంటూ నిత్యం ఉదయం, సాయంత్రం వెదురుబుట్టలో విత్తిన గోధుమనారుకు నీళ్లు పోస్తూ పూజలు చేస్తారు. ఏడో రోజు ఢమోళి అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతీ ఇంట్లో బియ్యం పిండితో చుర్మో రొట్టెలు చేసి వాటిని బెల్లంతో కలిపి ముద్దలు చేస్తారు. తీజ్ ఉన్న ఇంటి ఆవరణలో సేవాబాయి, మెరామల పూజలు నిర్వహిస్తారు. మెరామల పూజ చేసే ఇంటి ముందు జొన్నలు నింపిన గోనె సంచులు ఉంచి దానిపై ఒక చిన్న బిందెలో నీళ్లు పోసి వేప మండలు వేస్తారు. తీజ్ నేపథ్యంలో తొమ్మిది రోజులు అమ్మాయి కఠిన నియమాలు పాటిస్తారు. ఉప్పు, కారం లేని భోజనం తినాలి. తండా నుంచి బయటకు వెళ్లకూడదు. నేలపై పెట్టకుండా బావి నుంచి నీటిని బిందెలో తెచ్చి పందిరిపై పోస్తారు.

యువతుల నృత్యాలు.. పాటలు

తీజ్ తొమ్మిది రోజుల పండుగ. ఆటపాటలు, యువతుల నృత్యాలతో గిరిజన గూడేలలో పండుగ వాతావరణం నెలకొంటుంది. గోధుమ నారును ఎనిమిది రోజులపాటు పూజించి తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తారు. పెళ్లి కాని ఆడపిల్లలే ఈ వేడుక నిర్వహిస్తారు.

ఏర్పాట్ల బాధ్యత వారిదే..

వరి నాట్లు వేయడం పూర్తి కాగానే యువతులు తండా పెద్ద అనుమతి తీసుకొని ఏర్పాట్లు చేస్తుంటారు. ఇంటింటికెళ్లి విరాళాలు సేకరించి, అంగడికెళ్లి గోధుమలు, శనగలు, ఇతర సామగ్రి తెస్తారు. గోధుమలు నానబెట్టడానికి దుస్సేరు తీగలతో బుట్టలను అల్లి, పుట్ట మట్టిని తెచ్చి అందులో మేక ఎరువు కలుపుతారు. మొదట తండా నాయకుడి చేత ఎరువు కలిపి మట్టిని పోయించి గోధుమలను చల్లిస్తారు. శ్రీ సంత్‌సేవాలాల్ మహారాజ్, సీతా మేరమా మాతతోపాటు తిరుపతి బాలాజీ, హాథీరాం బాలాజీ, వేములవాడ రాజన్న, తుల్జా భవానీలను కొలుస్తారు.

ఉమ్మడి జిల్లాలో

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గిరిజనులు అధికంగా ఉన్న వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, ముస్తాబాద్, మండలాలతో పాటు కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలం, కరీంనగర్ సిటీ, చింతకుంటశాంతినగర్, జగిత్యాల జిల్లా రాయికల్, సారంగాపూర్‌లో తీజ్ వేడుకలు నిర్వహిస్తారు.

అసలేరు కార్తెలో..

శ్రావణమాసం అశ్లేషకార్తె ప్రారంభంకాగానే తండాల్లో తీజ్ వేడుకలు మొదలవుతాయి. తండా పెద్ద మనిషి ఇంటి ఎదుట పందిరి ఏర్పాటు చేసి, దానిపై గోధుమబుట్టలను పెడతారు. ఈ గోధుమ బుట్టలపై యువతులు నిత్యం ఉపవాసంతో ఉండి నీరు పోస్తుంటారు. పండుగ ముగిసే వరకు వీరు ఒక్కపూట భోజనం చేస్తారు.

గోధుమ నారుతో ఊరేగింపు

తీజ్‌లో ప్రధాన ఘట్టం చివరి రోజు పందిరిపై ఉంచిన గోధుమనారు బుట్టలను కిందికి దింపి వాటి చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేస్తారు. అనంతరం గోధుమనారు బుట్టలను నెత్తిపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని వాగులలో నిమజ్జనం చేస్తారు. శ్రావణమాసం ప్రారంభంలో మొదలు పెట్టిన తీజ్ ఉత్సవాలు చివరి వారంలోపు ముగుస్తాయి.

తీజ్ అంటే ఆనందం



తీజ్ అంటే ఒక ప్రత్యేకమైన పండుగ. దీన్ని మేము ఆనందోత్సాహాలతో జరుపుకుంటాం. తీజ్ బుట్టలను తొమ్మిదవ రోజున మేము నిమజ్జనానికి డప్పు చప్పుళ్ల మధ్య తీసుకెళ్తాం. గోర్ ప్రజల బతుకమ్మ తీజ్ కాబట్టి మహిళా ట్రైబల్ గురుకులాల్లో ప్రత్యేకమైన సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– మూడ్ మౌనిక, జగదాంబ తండా, గంభీరావుపేట

తొమ్మిది రోజులు ఆటపాటలతో..



తీజ్ పండుగను తొమ్మిది రోజుల పాటు ఆనందోత్సాహాలతో, ఆటపాటలతో నిర్వహించుకుంటాం. తీజ్ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. బతుకమ్మను పూలతో అలంకరించినట్లే తీజ్‌లో నవధాన్యాలు, గోధుమ మొలకలను పూజించడం ఆనవాయితీ. తీజ్ దేవత పంటలను, ప్రకృతిని కాపాడుతుందని మా ప్రగాఢ విశ్వాసం.

– అజ్మీర సాహితి, జగదాంబతండా, గంభీరావుపేట




గోధుమనారుతో యువతులు

న్యూస్‌రీల్

సిటీలో పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతులు, స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు 11కేవీ గీతాభవన్ ఫీడర్ పరిధిలోని రాంనగర్, పద్మనగర్, మంకమ్మతోట, సహజ అపార్ట్‌మెంట్, దన్గర్‌వాడీ స్కూల్, కమలనిర్మల అపార్ట్‌మెంట్, పాతలేబర్ అడ్డా, ఆకుల శైలజ ఆసుపత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. అదే విధంగా 11కేవీ రాంనగర్ ఫీడర్ పరిధిలోని సంతోష్‌నగర్, చేపల మార్కెట్ నుంచి సత్యనారాయణ దేవాలయం, సిద్ధార్థ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పవర్‌కట్ ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 33/11 కె.వీ.వాటర్‌వర్క్స్ (హౌజింగ్ బోర్డు) సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

డీఎస్సీ ద్వారా 13,500 పోస్టులు భర్తీ చేయాలి



కరీంనగర్ కల్చరల్: అసెంబ్లీ సాక్షిగా 13,500 పోస్టులు భర్తీ చేస్తామన్న సీఎం కేసీఆర్ 5,089 పోస్టులు భర్తీ చేస్తామనడం సరికాదని బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట నిరసనకు దిగారు. తమకు న్యాయం కావాలని, మినీ డీఎస్సీ వద్దని, మెగా డీఎస్సీ ముద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లైబ్రరీహాల్స్, స్టడీహాల్స్, కోచింగ్ తరగతుల వద్ద ఆందోళనకు దిగినట్లు తెలిపారు. అభ్యర్థులంతా ఐక్యంగాఉండి పోరాటానికి కలిసిరావాలని పిలుపునిచ్చారు. సర్కారు స్పందించకుంటే సోమ, మంగళవారాల్లో విద్యాశాఖాధికారి కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు.

మనిషి మనుగడకు చెట్లు ఆధారం

- గ్రీన్‌సిటీగా కరీంనగర్
- మంత్రి గంగుల కమలాకర్



రాశివనంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి గంగుల కమలాకర్, మేయర్, కలెక్టర్ తదితరులు

కరీంనగర్ కార్పొరేషన్: మనిషి మనుగడకు చెట్లు ప్రాణాధారమని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు కోటి మొక్కలు..లో భాగంగా నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ఫిల్టర్‌బెడ్ సమీపంలోని రాశివనంలో శనివారం మంత్రి మొక్కలు నాటారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొప్ప పథకం హరితహారమన్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్రంలో లక్షల సంఖ్యలో మొక్కలు నాటామని తెలిపారు. నగరాన్ని ఓ వైపు అభివృద్ధి చేస్తూనే, మరో వైపు గ్రీన్ సిటీగా మారుస్తున్నామని వెల్లడించారు. నాటిన ప్రతి మొక్కను నగరపాలక సంస్థ ద్వారా సంరక్షించడం జరుగుతుందని తెలిపారు. వివిధ పాఠశాలల విద్యార్థులు హరితహారానికి సంబంధించిన పాటలు పాడి అలరించారు.

17 చోట్ల 40 వేల మొక్కలు

హరితహారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఒక్కరోజే నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో 40 వేల మొక్కలు నాటారు. లేక్ పోలీసుస్టేషన్, ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్, అలకాపురి స్మశాన వాటిక, రేకుర్తి కెనాల్, ఆర్టీసీ వర్క్ షాప్, తీగలగుట్టపల్లి, బ్యాంక్ కాలనీ గ్యాస్ గోదాంతో పాటు మొత్తం 17 చోట్ల ఈ మొక్కలు నాటారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ గోపి, నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయి తదితరులు పాల్గొన్నారు.

నీలి విప్లవంతో ఉపాధి పుష్కలం

కరీంనగర్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బృహత్తర చర్యలతో కుల వృత్తులు కళకళలాడుతున్నాయని, ఉపాధి పుష్కలంగా ఏర్పడిందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం ఎల్ఎండీ జలాశయంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా చేపపిల్లలను మేయర్ సునీల్ రావు, జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ, కలెక్టర్ బి.గోపితో కలిసి విడుదల చేశారు. అనంతరం గంగమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. 2014 నుంచి 2023వరకు జిల్లాలోని చెరువులు, కుంటలు,జలాశయాల్లో రూ.10.45కోట్ల విలువచేసే 12.35 కోట్ల చేపపిల్లలు విడుదల చేశామని, తొమ్మిదేళ్లలో 29627.52 లక్షల విలువ చేసే 49.379వేల టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, జిల్లా మత్స్యశాఖ అధికారి దేవేందర్ పాల్గొన్నారు.

పక్కాగా తుది ఓటరు జాబితా

- కలెక్టర్ డాక్టర్ బి.గోపి
- ప్రత్యేక క్యాంపెయిన్ల పరిశీలన



వివరాలు ఆరా తీస్తున్న జిల్లా కలెక్టర్ బి.గోపి

కరీంనగర్ అర్బన్: జిల్లాలో పటిష్టమైన తుది ఓటరు జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ బి.గోపి సిబ్బందిని ఆదేశించారు. శనివారం జిల్లాకేంద్రంలోని కోతిరాంపూర్ పరిధిలోని కొంకటివాడలోని ప్రైవేటు పాఠశాలలో ఓటరు ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని సూచించారు. స్పెషల్ క్యాంపెయిన్ డేలు నిర్వహించే చోట బ్యానర్లను ఏర్పాటు చేయాలని, ఓటరు జాబితాలో ఫొటో, ఇతర మార్పులు ఉన్నట్లయితే ఫామ్–8 ద్వారా ఓటర్లతో నమోదు చేయించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అక్టోబర్ 1,2023 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారందరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ నెల 27న (నేడు), సెప్టెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు కొనసాగుతాయని వివరించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ ఆర్డీఓ కుందారపు మహేశ్వర్, తహసీల్దార్ నరేందర్ ఉన్నారు.

అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాలి

అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదవడంతోపాటు ఓటు హక్కు వినియోగించుకునేలా పకడ్బందీగా ప్రచారం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్‌ను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీసీద్వారా మాట్లాడారు. రెండో ఓటరు జాబితా సవరణలో భాగంగా ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. మహిళా ఓటర్ల నమోదు చాలా తక్కువగా ఉందని, ఓటరు నమోదులో లింగ నిష్పత్తి 700 మాత్రమే ఉందని, నూతన మహిళా ఓటరు నమోదుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అమలు చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో మరణించిన వ్యక్తుల ఓట్లు, డూప్లికేట్ ఓట్లు ఉండకుండా సెప్టెంబర్ 22 నాటికి పూర్తి స్థాయిలో తొలగించి ధృవీకరించి సమర్పించాలని అన్నారు. విద్యాసంస్థలో ప్రత్యేక ఎలక్టోరల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కలెక్టర్ డా.బి.గోపి అధికారులతో మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా సవరించాలని, ఫొటో సరిగాఉండేలా చూడాలని, 18ఏళ్లు పైబడిన వారి ఇంటికి బీఎల్ఓలు వెళ్లి ఫామ్–6 ద్వారా నమోదు చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



కరీంనగర్ అర్బన్: ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపెయిన్ కేంద్రాలను కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని కోతిరాంపూర్, కట్టరాంపూర్, లక్ష్మీనగర్, భగత్‌నగర్, వావిలాలపల్లి తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు సమయపాలన పాటించాలని, విధులను నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం కూడా కార్యక్రమం కొనసాగుతుందని, ప్రతి బీఎల్‌వో నిబద్ధతతో పనిచేసి ఓటరు నమోదు పెంచాలని ఆదేశించారు. ఆయన వెంట అర్బన్ తహసీల్దార్ యు.రమేష్, గిర్దావర్లు రఘు, అన్వర్ ఉన్నారు.

'ఉమ్మడి జిల్లా సంఘాల ఆస్తిగా పరిగణించాలి'

విద్యానగర్(కరీంనగర్): జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రారంభించనున్న కురుమ విద్యార్థి వసతి భవనాన్ని ఉమ్మడి జిల్లా సంఘాల ఆస్తిగా పరిగణించాలని పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల కురుమ సంఘం అధ్యక్షులు పొట్టాల మల్లేశం, ఎనుగుల కనుకయ్య డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. 2008లో అప్పటి ప్రభుత్వం కరీంనగర్ జిల్లా కురుమ విద్యార్థుల కోసం వసతి భవనాన్ని మంజూరు చేసి నిధులు కేటాయించిందన్నారు. ఉమ్మడి కరీంనగర్ ఉన్నప్పుడు మంజూరు అయినందున ఈ వసతి భవనాన్ని ఉమ్మడి ఆస్తిగా పరిగణించాలన్నారు. లేకుంటే ప్రారంభ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని వారు పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీటీసీ మ్యాకల గణేష్, నాయకులు నాగరాజు, రాము, శంకర్, పర్శరాములు, బీరయ్య, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి మూడురోజుల జైలు

కరీంనగర్‌క్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో శనివారం కోర్టు ఓ వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించింది. కరీంనగర్‌లో మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందిని కోర్టు ముందు ప్రవేశపెట్టగా వారిలో కరీంనగర్ కిసాన్‌నగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌కు మూడురోజుల జైలుతో పాటు రూ.2వేల జరిమానా విధించింది. మిగతా 12 మందికి రూ.18,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాపూర్(మానకొండూర్): మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్‌లో శనివారం జరిగింది. పోలీసుల వివరాలు. గ్రామానికి చెందిన పల్లె చిరంజీవి(29) తాగుడుకు బానిసయ్యాడు. ఏ పనీ లేకుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి పల్లె మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపారు.

స్పందన అంతంతే



ఇది కోతిరాంపూర్‌లోని పోలింగ్‌కేంద్రం. నాలుగు కేంద్రాలకు గానూ నలుగురు సిబ్బంది విధులకు హాజరయ్యారు. ఉదయం 10గంటలకే విధులకు రాగా యువత నుంచి స్పందన అంతంతమాత్రమే. నాలుగుబూత్‌లకు గానూ 30కి మించి దరఖాస్తులు రాలేదు.



ఇది ఉమెన్స్ డిగ్రీ కళాశాలలోని ప్రత్యేక క్యాంపెయిన్ తీరు. నలుగురు బీఎల్వోలకు గానూ ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపెయిన్‌కు సంబంధించిన బ్యానర్ ఏర్పాటు చేయలేదు. దీంతో కార్యక్రమం ఉందన్న విషయం ప్రచారం లేకపోయింది. అయినా పలువురు దరఖాస్తులు అందజేశారు.

- తొలిరోజు ఆలస్యంగా కేంద్రాలు.. కనిపించని బ్యానర్లు
- పలు చోట్ల సిబ్బంది గైర్హాజరు
- ఓటరు నమోదు మోదం.. ఖేదం

కరీంనగర్ అర్బన్: ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమం మోదం.. ఖేదమన్నట్లుగా సాగింది. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలనే బృహత్తర ఆశయంతో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో శని, ఆదివారం ప్రత్యేక క్యాంపెయిన్ అన్ని పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్లే జాబితా నిర్ణేతలుగా అనర్హుల ఏరివేతతో పాటు మార్పులు, చేర్పులు, కొత్తగా నమోదు వంటి ప్రక్రియలో భాగస్వామ్యం కావాల్సి ఉంది. పౌరస్పృహతో సాగాల్సిన సదరు కార్యక్రమం పలు చోట్ల విశేష స్పందన లభించగా.. మరిన్ని చోట్ల అంతంతమాత్రమే. జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో 1,338 కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండి సేవలందించారు. కలెక్టర్ డాక్టర్ బి.గోపి నగరంలోని పలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేయగా ఆర్డీవో కుందారపు మహేశ్వర్ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

ఆలస్యంగా కేంద్రాలు ప్రారంభం

కరీంనగర్ నియోజకవర్గంలో 390పోలింగ్ కేంద్రాలుండగా హుజూరాబాద్ 305, చొప్పదండి 327, మానకొండూరు నియోజకవర్గంలో 316 పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందిని నియమించారు. బీఎల్‌ఓలు ఉదయం 10గంటలకు కేంద్రాలకు చేరుకోవాల్సి ఉండగా గరిష్ట కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. అధికారులు ఫోన్ చేసే వరకు కూడా కేంద్రాలకు వెళ్లకపోవడం గమనార్హం. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉండాలి. పలు చోట్ల ఒకే చోట గల పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోలు ఒకేచోట కూర్చోగా కొందరు త్వరగానే విధులు విస్మరించి వెళ్లారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడా బ్యానర్లు ఏర్పాటు చేయకపోవడంతో బీఎల్‌వోలు ఎందుకు కూర్చున్నారో తెలియక చాలామంది సద్వినియోగం చేసుకోలేకపోయారు. ఓటరు నమోదుకు సంబంధించి బ్యానర్లను ఏర్పాటు చేస్తే విశేష స్పందన లభించేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మోదం.. ఖేదం

ఓటరు నమోదులో యువతీ, యువకుల ఆసక్తి భిన్నంగా ఉంది. కరీంనగర్‌సిటీలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో విశేష స్పందన లభించగా సగానికి పైగా కేంద్రాల్లో స్పందన అంతంతేనని తెలుస్తోంది. జిల్లా మొత్తంగా 8వేల వరకు దరఖాస్తులు వచ్చాయని సమాచారం. నగరంలో గణేశ్‌నగర్, లక్ష్మీనగర్, భగత్‌నగర్, విద్యానగర్, వావిలాలపల్లి, రాంనగర్, శ్రీపురం కాలనీ, హౌజింగ్‌బోర్డు కాలనీ, ఆటోనగర్, పద్మనగర్, గోదాం గడ్డ, మారుతినగర్, మంకమ్మతోటలోని పలు కేంద్రాల్లో వందకుపైగా కొత్తగా ఓటరు నమోదు కోసం దరఖాస్తులు వచ్చాయి. ఇక మిగిలిన ప్రాంతాల్లో పది, ఇరవైకి మించి దరఖాస్తులు రాలేదని సమాచారం. కాగా పలు కేంద్రాల్లో కార్పొరేటర్లు అన్ని తామై వ్యవహరించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

వీఆర్ఏల స్థానంలో ఆర్పీలు

వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయగా ఇతర శాఖల సిబ్బందిని బూత్ లెవల్ అధికారులుగా నియమించారు. మునిసిపల్ ఆర్పీలు, కారోబార్, వీవోఏలు, వీవోలు, బిల్ కలెక్టర్లు, రికార్డు అసిస్టెంట్లు, మునిసిపల్ జూనియర్ అసిస్టెంట్లతో సర్దుబాటు చేశారు. కాగా 10మంది బీఎల్‌వోలపై ఒకరిని సూపర్‌వైజర్‌గా నియమించారు.

నేడు ప్రత్యేక క్యాంపెయిన్

ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమం ఆదివారం కూడ కొనసాగనుంది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బిఎల్‌వోలు అందుబాటులో ఉండనున్నారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండేవారందరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరు లేకపోయినా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు.

కాకతీయ కాలువలో హెడ్ కానిస్టేబుల్ గల్లంతు?

- నీళ్లు నిలిపివేసినా దొరకని ఆచూకీ
- అయోమయంలో కుటుంబ సభ్యులు



మల్లయ్య (ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): ఎల్‌ఎండీ రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న కాకతీయ కాలువలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గల్లంతయ్యాడు. తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి కథనం మేరకు.. తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ దుండే మల్లయ్య (50) శుక్రవారం సాయంత్రం కాకతీయ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్దకు వెళ్లాడు. తినుబండారం తిని కాలువలో చేతులు కడుక్కునేందుకు మెట్ల నుంచి దిగాడు. చేతులు కడుక్కునే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. స్థానికులు గమనించి అతడ్ని కాపాడేందుకు తాడు వేసినా సమయానికి అందుకోకపోవడంతో పాటు కాలువలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కొట్టుకుపోయాడు. మల్లయ్య కరీంనగర్ భగత్‌నగర్‌లో నివాసం ఉంటూ హెడ్ కానిస్టేబుల్‌గా పెద్దపల్లి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. గతంలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి ఈటల రాజేందర్, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ వద్ద గన్‌మెన్‌గా పని చేశాడు.

ఈత వచ్చినా..

దుండే మల్లయ్యకు 50 ఏళ్ల వయసు ఉన్నా యువకుడిలా యాక్టీవ్‌గా ఉండేవాడు. మృదుస్వభావి, మంచికి మారుపేరుగా ఉండడంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టుబట్టి అతడ్ని గన్‌మెన్‌గా పెట్టుకున్నారు. అతడికి ఈత వచ్చినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. గల్లంతు అయ్యే సమయంలో మత్స్యకారులు తాళ్లు విసిరివేసే క్రమంలో మల్లయ్య కొద్దిదూరం ఈత కొట్టినట్లు సమాచారం. ఈదుకుంటూ కట్టవైపు రాకపోవడంతో అక్కడున్న వారు ఆందోళనకు గురయ్యారు. కొద్ది దూరం ఈదుకుంటూ వెళుతూ మునిగిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కెనాల్‌లో నీటిని నిలిపివేసినా మల్లయ్య ఆచూకీ దొరక్కపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనపై మల్లయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో యువకుడి అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్సైలు ప్రమోద్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి

తిమ్మాపూర్(మానకొండూర్): చోరీ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన గోపాలకృష్ణను ఎల్‌ఎండీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి వివరాల ప్రకారం.. గోపాలకృష్ణ ఆర్మీ ఉద్యోగ నిమిత్తం కోచింగ్ తీసుకునేందుకు కొన్ని నెలల క్రితం తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీకి వచ్చాడు. ఓ శిక్షణ కేంద్రంలో తర్ఫీదు తీసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో విలాసాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. తిమ్మాపూర్‌లోని మహాత్మానగర్‌లో ఈనెల 17న ఓ ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని నగదు, బంగారు ఆభరణాలు, ఆధార్, పాన్, ఏటీఎం కార్డులు, లైసెన్సులు చోరీ చేశాడు. కరీంనగర్ వెళ్లే సమయంలో ఆధార్, ఏటీఎం, ఇతర కార్డులను కాకతీయ కెనాల్‌లో పడేశాడు. కరీంనగర్ నుంచి గుంటూరుకు బస్సులో వెళ్లాడు. దొంగిలించిన సొమ్ములో రూ.20 వేల నగదును అతడి మామయ్యకు ఇచ్చాడు. బంగారు ఆభరణాలను ఓ బ్యాంకులో కుదవపెట్టి వచ్చిన డబ్బుతో పాటు చోరీ చేసిన డబ్బుల నుంచి రూ.20 వేలు విలాసాలకు ఖర్చు చేశాడు. తిరిగి కరీంనగర్ వస్తున్న క్రమంలో అలుగునూర్ వద్ద ఎల్‌ఎండీ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు. నిందితున్ని పట్టుకోవడంలో సీసీఎస్ ఎస్సై, సిబ్బంది, ఎల్‌ఎండీ పోలీసులు కీలక పాత్ర పోషించారు. సమావేశంలో ఎస్‌ఐ ప్రమోద్‌రెడ్డి, సీసీఎస్ ఎస్సై మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో అలరించిన ప్రొఫెషనల్ ప్రోగ్రాం



సమూనా హాస్పిటల్‌ను తిలకిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో శనివారం నిర్వహించిన 'అల్ఫోర్స్ ప్రొఫెషనల్ ' ప్రోగ్రాం ఆకట్టుకుంది. ఇందులో భాగంగా పాఠశాలలో టీచర్, దుకాణంలో కార్పెంటర్, వాహనంలో డ్రైవర్, హాస్పిటల్‌లో డాక్టర్, నిర్మాణాల్లో ఇంజినీర్, ఇంటి నిర్మాణాల్లో ప్లంబర్, మేస్త్రీ, వ్యవసాయంలో తోటమాలి, వెజిటేబుల్ వెండర్, పోస్టాఫీస్‌లో పోస్టుమ్యాన్, పోలీస్ స్టేషన్‌లో పోలీస్, జైలులో జైలర్ వంటి తదితర వృత్తులపై విద్యార్థులు ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతి వ్యక్తికి వారు చేపట్టే వృత్తితోనే గుర్తింపు లభిస్తుందన్నారు. వృత్తిలో రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదలతో బాధ్యతాయుతంగా మెలగాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో వివిధ వృత్తుల జీవన విధానాన్ని విద్యార్థులకు వివరించడంతో పాటు అవగాహన కల్పించేందుకే ఈ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'హగ్స్ అండ్ హార్ట్స్'లో ఆకట్టుకున్న ఫుడ్‌ఫెస్ట్



తల్లిదండ్రులు, విద్యార్థులతో అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ శ్రీనగర్‌కాలనీలోని హగ్స్ అండ్ హార్ట్స్ ఇంటర్నేషనల్ కిడ్స్ ప్లేస్కూల్‌లో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు హాజరై పౌష్టికాహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. సాండ్‌విచ్, బర్గర్, ఫ్రూట్స్ సలాడ్, పిండి పదార్థాలతో తయారు చేసిన ఆహారాన్ని పిల్లలకు పంచారు. అంతకుముందు కార్యకమాన్ని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు చిన్నవయస్సులోనే అన్ని విషయాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



కలెక్టరేట్ ఎదుట స్కూల్ స్వీపర్స్

కరీంనగర్‌కల్చరల్: తమ జీతం పెంచాలని జిల్లా, మండల పరిషత్తు స్కూళ్లలో పని చేస్తున్న స్వీపర్స్ శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట బోనం చేసి సీఎం కేసీఆర్‌కు సమర్పించి వేడుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ స్కూల్ స్వీపర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, 40 ఏళ్ల నుంచి పని చేస్తుంటే ప్రస్తుతం రూ.5,200 జీతం ఇస్తున్నారని, అనేక ప్రభుత్వాలు రెగ్యులర్ చేస్తామని మోసం చేస్తూ వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా స్వీపర్స్ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. ఏపీఎస్ రెడ్డి కమిటీ సిఫారసులను అమలు చేయాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అర్హత బట్టి వీరికి కూడా పదోన్నతి కలిపించాలన్నారు. ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేస్తూ 10వ పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రమేష్, కనకవ్వ, అలీం, శంకరయ్య, మొండయ్య, కొమరయ్య తదితరులున్నారు.

ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

జమ్మికుంట(హుజూరాబాద్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన హుజూరాబాద్ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ కార్పొరేట్లు, సామ్రాజ్యవాదులకు కొమ్ముకాస్తుందని, బడుగు, బలహీన వర్గాలను విస్మరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కేజీటు పీజీ ఉచిత విద్య, నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరు అందలేదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శిక్షణ తరగతుల ప్రిన్సిపాల్ బాసిర సంపత్‌రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, జమ్మికుంట, హుజూరాబాద్ జోన్ కార్యదర్శులు శీలం అశోక్, వెల్మారెడ్డి రాజిరెడ్డి, జోన్ కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, దండిగారి సతీష్, తిప్పారబోయిన శ్రీకాంత్, జక్కుల రమేష్, గండేటి వాసుదేవ్, వడ్ల రాజు, యుగంధర్, ఓదెలు, మొగిలి, శ్రీకాంత్, తిరపతి, రవి, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సమైక్య సాహితీ పురస్కారాలకు ఎంపిక

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ సమైక్య సాహితీ ఆధ్వర్యంలో ఏటా ఇచ్చే విశిష్ట పురస్కారాలకు పలువురిని ఎంపిక చేసినట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి గోపాల్, అనంతచార్య ప్రకటనలో తెలిపారు. మాడిశెట్టి మల్లయ్య స్మారక ఉపాధ్యాయ పురస్కారాన్ని ప్రముఖ రచయిత, ఉపాధ్యాయుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్యకు, నాట్యరత్న ఆచార్య రజనిశ్రీ స్మారక పురస్కారాన్ని ప్రముఖ నృత్య కళాకారుడు కళా కృష్ణ, రావికంటి రామయ్య గుప్త స్మారక సాహితీ పురస్కారాన్ని కొల్లారపు ప్రకాశ్‌రావు, కలకుంట్ల సంపత్ కుమారాచార్య స్మారక సంగీత పురస్కారానికి ప్రముఖ సంగీత కళాకారుడు కె.బి.శర్మను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అలాగే సెప్టెంబర్ నెల మొదటి వారంలో ఎంపికైనవారికి పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థుల్లో సైన్స్ నైపుణ్యాన్ని పెంచండి



సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రస్తుతకాలంలో విద్యార్థుల్లో సైన్స్ నైపుణ్యాలు పెంచితే మంచి ప్రాజెక్టులు మంచి ప్రాజెక్టులు రూపొందిస్తారని జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కోఆర్డినేటర్, సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి అన్నారు. కరీంనగర్ ఫిలింభవన్‌లో శనివారం 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహణలో భాగంగా సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 ఏడాదికిగానూ ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణం అర్థం చేసుకోవడం అనే ప్రధానఅంశాలతో పాటు ఐదు సంబంధిత అంశాలల్లో సైన్స్ ప్రాజెక్టు రూపొందించవచ్చని తెలిపారు. ఈనెల 31లోగా ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ప్రాజెక్టుల ప్రతిపాదనలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సౌత్ ఇండియా డ్రామా ఫెస్టివల్ సెప్టెంబర్ చివరివారంలో ఉంటుందని, అన్నిసైన్స్ కార్యక్రమాలకు విద్యార్థులు పాల్గొనేలా సంసిద్ధం చేయాలని అన్నారు. ఆర్పీలు ఎం.శ్రీనివాస్, ఆంజనేయులు, మనోహర్‌రెడ్డి, అనంతచార్య పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయడంలో నిర్లక్ష్యం

కరీంనగర్‌కల్చరల్: రాష్ట్రవ్యాప్తంగా ఏఎంఎంల సమస్యలు పరిష్కరించాలని కొద్దిరోజులుగా సమ్మె చేస్తుంటే కేసీఆర్ సర్కారు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య మండిపడ్డారు. శనివారం రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలోని గాంధీవిగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. సెకండ్ ఏఎన్ఎంల విషయంలో ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతూ, శ్రమ దోపిడీకి పాల్పడుతోందని అన్నారు. 16ఏళ్లుగా కష్టపడుతున్న వీరి విషయంలో కఠినంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. జిల్లా అధ్యక్షురాలు మెరుగు రజిత, ప్రధాన కార్యదర్శి శోభారాణి, అరుణ, రేణుక, డీప్, వనిత, మాధవి, శైలజ, కనుకలక్ష్మి, జయశ్రీ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీపీ ఎల్.సుబ్బారాయుడు



ఉత్తమ పోలీసులకు చెక్కులు అందిస్తున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, నేరం జరిగిన వెంటనే కేసు నమోదు చేస్తే తస్కరించబడిన డబ్బులు త్వరగా రికవరీ చేసే అవకాశం ఉందని సీపీ సుబ్బారాయుడు సూచించారు. శనివారం కమిషనరేట్ కేంద్రంలో నెలవారీ సమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. వివిధ రకాల నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయాలని తెలిపారు. పనిచేయని సీసీ కెమెరాలకు వెంటనే మరమ్మతు చేయించాలని, ప్రతి 15రోజులకు ఒకసారి సీసీ కెమెరాలు పనితీరును సమీక్షించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రతిరోజు పనిచేసే విధంగా చూసుకోవాలని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెలలో కమిషనరేట్‌వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన సిబ్బంది గొర్రె తిరుపతి, టి.కనకరాజు, దరిపెల్లి సారయ్య, అంజనేయులు, గయాసొద్దీన్, హరికేశవ్‌కు రివార్డు అందించారు. ఈ సమీక్షలో డీసీపీలు ఏ.లక్ష్మినారాయణ, సి.రాజు, శిక్షణ ఐపీఎస్ గీత్ మహేష్‌బాబాసాహెబ్, ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, విజయ్‌కుమార్, సర్వర్, శ్రీనివాస్, సి.ప్రతాప్, కాశయ్య, జీవన్‌రెడ్డి, మాధవి, ఎస్‌బీఐ వెంకటేశ్ పాల్గొన్నారు.

వానాకాలంలో తాగునీటికి గోస

- తిరుమల్‌నగర్‌లో కొన్ని నెలలుగా నల్లానీళ్లు బంద్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ అధికారుల తీరుతో తిరుమల్‌నగర్ వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా తిరుమల్‌నగర్ రోడ్ నంబర్ ఒకటి నుంచి రోడ్ నంబర్ ఏడువరకు గతంలో డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టారు. ఎనిమిది నెలల క్రితం ఈ పనులు మొదలుపెట్టగా, మూడు నెలల క్రితం పూర్తయ్యాయి. డ్రైనేజీ పనులు కొనసాగుతున్న సమయంలో కాలనీలో తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయాయి. దీంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పనులు పూర్తి అయిన తరువాత నల్లా కనెక్షన్‌లు పునరుద్ధరిస్తారని కాలనీవాసులు ఎదురుచూశారు. మూడు నెలల క్రితం పనులు పూర్తయినా, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పటివరకు నల్లా నీళ్లు రావడం లేదు. ఈ విషయమై పలుమార్లు నగరపాలకసంస్థ అధికారులకు విన్నవించినప్పటికీ, తాగునీటిని సరఫరా చేయడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. క్యాన్‌ల ద్వారా తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

క్లుప్తంగా

ఎన్నికలపై అవగాహన



ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: నో బ్యాగ్ డే పురస్కరించుకుని కరీంనగర్ మండలం నగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించడంతో పాటు బాలమంత్రి మండలిని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు మమత, మల్లేశం ఆధ్వర్యంలో విద్యార్థులు ఓటర్లుగా మారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన ఓట్ల లెక్కింపులో పోలైన 265 ఓట్లలో 107 ఓట్లు సాధించిన తువ్వ ప్రశాంత్ పాఠశాల ప్రధానమంత్రిగా ఎన్నికయ్యాడు. హరితహారం, మధ్యాహ్న భోజనం, క్రీడలు తదితర 10 శాఖలకు మంత్రిమండలిని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు ప్రదానం



సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ సప్తగిరికాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10 మంది విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్ట్ ప్రదీప్‌రెడ్డి తొమ్మిదేళ్లుగా స్కాలర్‌షిప్‌లు అందిస్తుండగా శనివారం కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, మురళీధరస్వామి, నాగరాజు, ప్రసాద్, ఉమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



కరీంనగర్‌కల్చరల్: మదర్ థెరిస్సా 113వ పుట్టిన రోజు పురస్కరించుకుని నగరంలోని వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చీరలు, దోతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అని ప్రార్థించే పెదాల కంటే సాయం చేసే చేతులే మిన్న అని ప్రపంచానికి చాటి చెప్పిన మానవతా మూర్తి మదర్ థెరిస్సా జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ సభ్యులు వేణుగోపాల్‌శర్మ, రమణ, తిరుపతి, శ్రీనివాస్, మునిగోపాల్ పాల్గొన్నారు.

రాఖీ వేడుకలు



విద్యానగర్(కరీంనగర్): ఎల్ఎండీ కాలనీలో స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలలో శనివారం అలయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, మహిళా మహాశక్తి, గ్రామభారతి సేంద్రియ వ్యవసాయ శిక్షణ సంస్థల ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు నిర్వహించారు. వినూత్నంగా కూరగాయలు, పండ్ల విత్తనాలతో తయారు చేసిన రాఖీలను విద్యార్థులకు కట్టారు. ఈ రాఖీలు భూమిలో నాటితే అవి మొలకెత్తి కూరగాయలు, పండ్లు అందిస్తాయనే ఉద్దేశ్యంతో రాఖీలను రూపొందించినట్లు పాఠశాల ట్రస్టీ సముద్రాల జనార్దన్‌రావు అన్నారు. అలయన్స్ జిల్లా గవర్నర్, గ్రామ భారతి జిల్లా అధ్యక్షుడు గాలిపల్లి నాగేశ్వర్, అలయన్స్ మహాశక్తి అధ్యక్షురాలు రేణుక, కార్యదర్శి సంజన, కోశాధికారి నాజీయా, పాఠశాల ప్రిన్సిపాల్ రోజా పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ నగర శాఖ ఆధ్వర్యంలో శనివారం 56వ డివిజన్‌లో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కలిసిన ప్రతిఒక్కరూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని చెబుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. నాయకులు దండి రవీందర్, గడ్డం విలాస్‌రెడ్డి, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, చర్ల పద్మ, మెతుకు కాంతయ్య, దన్న సింగ్, పోరండ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ శనివారం సందడి





కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వర ఆలయంలో శ్రావణమాస రెండో శనివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు ఇంటిల్లిపాది వెంకన్న ఆలయాలను సందర్శించి అభిషేక, అర్చనలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉపవాసాలు పాటించారు. స్వామి ఉత్సవ మూర్తులు శేషవాహనంపై కనువిందు చేశారు. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో ఉడుతల వెంకన్న భక్తులు పాల్గొన్నారు. మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి విశేషాలంకరణ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, ఈఓ నాగారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత.. ఓటు బాట

- ఓటరుగా నమోదుకు ఆసక్తి
- ఉన్నత విద్యావంతుల విస్తృత ప్రచారం



ప్రత్యేక క్యాంపెయిన్‌లో నూతన ఓటర్లు

కరీంనగర్ అర్బన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు పాత్ర కీలకం. దేశ భవితను నిర్దేశించేది.. సుపరిపాలనకు బీజం వేసేది ఓటరే. ఒక్క ఓటుతో ప్రభుత్వాలే కూలిపోయాయి. వ్యవస్థలే మారిపోయాయి. ఓటు హక్కు ఉంటేనే ఎన్నికల్లో పాల్గొనే అవకాశముండగా ఓటరుగా నమోదు చేసుకోవడం తప్పనిసరి. ఈ క్రమంలో నగర యువత ఓటరుగా నమోదు చేసుకునేందుకు అమితాసక్తి చూపారు. టవర్ సర్కిల్, రాజీవ్‌చౌక్, మార్కెట్ ఏరియా, సెవెన్ హిల్స్, సాలేహ్‌నగర్, ఎస్సారార్ కళాశాల ప్రాంతంలో కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తులు అధికంగా వచ్చాయి. శనివారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించగా అత్యధికంగా ఉన్నత విద్యావంతులే అర్జీలు అందజేశారు.

కొత్త ఓటరు అర్జీలే అధికం

అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువ ఉన్నత విద్యావంతులు ఓటరుగా దరఖాస్తు చేసుకున్నారు. ఓటరుగా దరఖాస్తులు ఇవ్వడంతో పాటు పలువురిని ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించారు. వృత్తి విద్యా, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపారు. ఆదివారం కూడా క్యాంపెయిన్ కొనసాగనుండగా మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశముంది. కరీంనగర్ నియోజకవర్గంలో పద్దెనిమిదేళ్లు నిండిన వారు 25వేల వరకు ఉంటారని అధికారుల అంచనా. అత్యధికంగా కరీంనగర్ అర్బన్‌లో ఉండగా తదుపరి కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో ఉన్నారు.

ఓటు కోసం దరఖాస్తు చేశా



ఓటరు జాబితాలో నా పేరుండాలి. ఎన్నికల్లో ఓటు వేయాలనే ఉద్దేశంతో ఓటు కోసం దరఖాస్తు చేశా. వాస్తవానికి శుక్రవారం హైదరాబాద్ వెళ్లాలి కానీ శనివారం క్యాంపెయిన్ ఉందని తెలియడంతో పోస్ట్‌పోన్ చేసుకున్నా. ఓటు హక్కు కోసం బీఎల్వోకు దరఖాస్తు అందజేశా.

– మంచాల సామిత్, మెడిసిన్ విద్యార్థి

మంచి నిర్ణయం



నేను రెండు సార్లు ఓటు హక్కు వినియోగించుకున్నా. కానీ ఈ జాబితాలో నా పేరు లేదు. పత్రికల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఉందని చదివా. ఓటరుగా నమోదు చేసుకుందామని వచ్చా. ఫారం–6 తీసుకుని దరఖాస్తు చేశా. ఓటరు జాబితాను ప్రతిఒక్కరూ చూసుకోవాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది.

– సంబోజి సందీప్, కశ్మీర్‌గడ్డ

విస్తృత ప్రచారంతోనే దరఖాస్తులు



ఓటు కోసం దరఖాస్తు చేశా. అధికారులు మరింత ప్రచారం చేయాలి. పట్టణాల్లో యువతకు అసలు సమాచారం లేదు. పట్టణ కూడళ్లు, ప్రధాన ప్రాంతాల్లో ఫ్లెక్సీలతో ప్రచారం చేయాలి. ఓటరు నమోదు ఆవశ్యకతను వివరించాలి. ప్రత్యేక క్యాంపెయిన్‌పై బ్యానర్లు ఏర్పాటు చేయాలి. – ఎం.సాహితి, మెడిసిన్ విద్యార్థి

ఓటు.. మన హక్కు



ఓటు మనందరి హక్కు. ఓటుంటేనే వ్యవస్థను మార్చగలం. అందుకే ఓటరుగా నమోదు చేసుకున్నా. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటా. మంచి నాయకునికి ఓటు వేస్తా. రాజ్యాంగం మనకిచ్చిన వరం ఓటు హక్కు.

– కసిరెడ్డి రాకేశ్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

సంతోషంగా ఉంది



రెండేళ్ల క్రితమే ఓటరుగా నమోదు చేసుకోవాలనుకున్న. కానీ వయసు తక్కువగా ఉండటంతో మిస్సయ్యాను. ఇప్పుడు 18 ఏళ్లు నిండటంతో ప్రత్యేక క్యాంపెయిన్‌లో ఫారం–6 తీసుకుని దరఖాస్తు చేశా. సంతోషంగా ఉంది.

– అమూల్య, ఇంజినీరింగ్ విద్యార్థి

నవజాత శిశువుల కోసం 108 వాహనాలు

- మంత్రి గంగుల కమలాకర్



108 వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గంగుల

కరీంనగర్‌టౌన్: జిల్లాలో నవజాత శిశువులను సంరక్షించి, వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక 108 వాహనాలను ఏర్పాటు చేసిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం వద్ద అత్యాధునిక సాంకేతిక సదుపాయాలు కలిగిన 108 వాహనాన్ని ప్రారంభించి మాట్లాడారు. నవజాత శిశువులకు వ్యాధుల సంక్రమణ అవకాశాలు అధికంగా ఉంటాయని, అలాంటి పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు, ఇతర ఆస్పత్రులకు తరలించే క్రమంలో ఇబ్బందులకు గురికాకుండా అధునాతన వెంటిలేటర్ మరియు పర్యవేక్షణ సామర్థ్యాలతో పిడియాట్రిక్ ఐఎఫ్‌టి అనే ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి, ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు పెన్షన్లు

కరీంనగర్: దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా దివ్యాంగులకు పింఛన్లు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణా ఒక్కటేనని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గంలోని బీడీ టేకేదారులకు నూతన పెన్షన్లు, వికలాంగుల, ఆసరా పెన్షన్ల పెంపు పంపిణీలో మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మేయర్ సునీల్‌రావు, డీఆర్డీవో శ్రీలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మదు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ఎంపీపీ లక్ష్మయ్య, జెడ్పీటీసీలు, సర్పంచులు, కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చెట్లు దోహదం



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు



మంత్రితో అల్ఫోర్స్ విద్యార్థులు

కొత్తపల్లి: పర్యావరణ పరిరక్షణకు చెట్లు దోహదపడతాయని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు తెలిపారు. స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల ముగింపు, హరితహారంలో భాగంగా సీఎం కేసీఆర్ తలపెట్టిన కోటి వృక్షార్చన సందర్భంగా శనివారం కొత్తపల్లి పురపాలక సంఘం పరిధిలో మొక్కలు నాటారు. సీఎం తలపెట్టిన కోటి వృక్షార్చన (ఒక రోజు ఒక కోటి మొక్కలు నాటడం) సంకల్పం విజయవంతమైందని చైర్మన్ సంతోషం వ్యక్తం చేశారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, కౌన్సిలర్లు వాసాల రమేశ్, గండు రాంబాబు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రమేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతకుంటలో..

కొత్తపల్లి మండలం చింతకుంటలోని సాంఘీక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ మొక్కలు నాటారు. మండలంలోని ప్రతీ గ్రామానికి 750 మొక్కల చొప్పున మొత్తం 6వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, ఎంపీటీసీలు బి.తిరుపతినాయక్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింగరావు, ప్రిన్సిపాల్ థెరిస్సా, ఏపీవో స్పందన, టీఏ దేవేంద్రజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హరితహారంలో అల్ఫోర్స్ విద్యార్థులు

తెలంగాణకు హరితహారంలో భాగంగా కరీంనగర్ శివారులో శనివారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు తదితరులతో కలిసి అల్ఫోర్స్ విద్యార్థులు పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో అల్ఫోర్స్ విద్యా సంస్థలు ముందుంటాయని నరేందర్‌రెడ్డి తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ మండలంలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. చామనపల్లిలో ఎంపీపీ లక్ష్మయ్య, సర్పంచ్ బోగొండ లక్ష్మిఐలయ్య, గోపాల్‌పూర్‌లో వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, సర్పంచ్ ఊరడి మంజుల, చేగుర్తిలో సర్పంచ్ అరుణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మండలానికి 12,500 మొక్కలు లక్ష్యం కాగా 12,215 నాటినట్లు ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. చెర్లభూత్కూర్‌లోని ఎల్లమ్మ ఆలయ ఆవరణలో మహాదేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటగా సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి సభ్యులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిట్కూరి శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్, ఫౌండేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, సుమంత్, కోశాధికారి శ్రీనివాస్, బుర్ర నారాయణగౌడ్, శ్రీధర్, రమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ స్పోర్ట్స్‌కిట్లు అందజేత



స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు ప్రభుత్వం మంజూరు చేసిన కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను శనివారం ప్రజాప్రతినిధులకు ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య అందించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లు మంజూరు చేసిందని ఎంపీపీ తెలిపారు. రూ.50 వేల విలువైన ఒక్కో కిట్‌లో వాలీబాల్, క్రికెట్, డంబెల్స్, 75 టీషర్టులు ఉన్నాయని వివరించారు. యువకులు సద్వినియోగం చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ బుర్ర తిరుపతిగౌడ్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అంకమల్ల శ్రీనివాస్, సర్పంచ్ కటకం నందయ్య, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, ఏఎంసీ డైరెక్టర్ రంగారెడ్డి, దుర్శేడ్ సింగిల్‌విండో డైరెక్టర్ కందుల రమేశ్, అంజిరెడ్డి, లింగారెడ్డి, మల్లారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

కరీంనగర్‌రూరల్: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయాలని తహసీల్దార్ నవీన్ అన్నారు. శనివారం కరీంనగర్ మండలం జూబ్లీనగర్, ఫకీర్‌పేట గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆర్ఐ రజనీకాంత్‌తో కలిసి పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, సవరణపై బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం పోలింగ్‌స్టేషన్లలో బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. చెర్లభూత్కూర్‌లో ఓటరు నమోదు ప్రక్రియను సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి పరిశీలించారు. కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను బీఎల్‌వోలు భాగ్య, పద్మను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరినీ ఓటర్లుగా చేర్పించాలని కోరారు.

నట్టల నివారణ మందులు ఇవ్వాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): సీజన్ మొదలై మూడు నెలలు గడుస్తున్నా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఇవ్వలేదని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి కాల్వ సురేశ్ అన్నారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఇప్పించాలని కోరుతూ శనివారం జిల్లా పశు వైద్య అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని అవసరమున్న చోటా ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సతీష్ కురుమ, చిట్కూరి రాజమల్లు, కొమురయ్య, ఇరుమళ్ల రాము, కదారి రమేశ్ పాల్గొన్నారు.

'భగవతి'లో మై ఫేవరెట్ ఫ్రూట్



సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని భగవతి పాఠశాలలో శనివారం మై ఫేవరెట్ ఫ్రూట్ పేరిట నిర్వహించిన సంబురాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వివిధ రకాల పండ్ల వేషధారణతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాల చైర్మన్ రమణారావు మాట్లాడుతూ చిన్నారులకు పండ్ల రకాల గురించి తెలియజేయడమే కాకుండా వాటిని తినడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను శనివారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు జంపాల సంపత్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నాలుగోసారి టికెట్ వచ్చినందుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ఎర్రబొజ్జు నరయ్య, కంది వెంకటేష్, జనగామ రాజయ్య, కొండూరు అంబదాస్, సూరంపెల్లి సంజీవ్, జనగామ వెంకటేష్, అందుర్తి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఓనం వేడుక



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని మెహర్‌నగర్‌లో గల వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో శనివారం ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పూలతో ఏర్పాటు చేసిన దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఓనం సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



విద్యానగర్(కరీంనగర్): మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా కరోనా సమయంలో ఉచితంగా భోజనాలు అందించిన మేమున్నాం మీకోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు నగునూరి రాజేందర్‌ను శనివారం కరీంనగర్ శాతవాహన లయన్స్ క్లబ్ బాధ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, లయన్స్ క్లబ్ బాధ్యులు మేచినేని సత్యనారాయణ, ఎల్లాల లక్ష్మారెడ్డి, కోట సత్యం తదితరులు పాల్గొన్నారు.

స్వీట్లు పంపిణీ



విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ ఆర్టీసీ జోనల్ వర్క్ షాప్ వద్ద ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకు ప్రారంభించి సంవత్సర కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం వినియోగదారులకు, బంకు సిబ్బందికి ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్. సుచరిత, కరీంనగర్–2 డిపో మేనేజర్ వి.మల్లయ్య స్వీట్లు పంపిణీ చేశారు. కరీంనగర్ జోన్ విజిలెన్స్ అధికారి భావ్‌రావు, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సెక్యూరిటీ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మున్నూరు కాపు ప్లీనరీని విజయవంతం చేయాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లో గల జలవిహార్‌లో ఆదివారం నిర్వహిస్తున్న మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని సంఘం జిల్లా సమన్వయకర్త సత్తినేని శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందేందుకు మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ.5వేల కోట్లు నిధులు కేటాయించాలని, ప్రతీ జిల్లా కేంద్రంలో విద్యార్థులకు హాస్టల్ భవనాల నిర్మాణానికి ఎకరం భూమి, రూ.2 కోట్లు నిధులు కేటాయించాలని తదితర విషయాలు ప్లీనరీలో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మున్నూరు కాపులు అందరూ రాజకీయాలకతీతంగా హాజరు కావాలని పేర్కొన్నారు.

కూలిన ఇంకుడుగుంత



కరీంనగర్ మండలం తాహెర్‌కొండాపూర్‌లో ఇటీవల నిర్మించిన డ్రైనేజీ ఇంకుడుగుంత వర్షానికి కూలిపోయింది. గ్రామపంచాయతీ నుంచి చెరువులోకి డ్రైనేజీ నీరు వెళ్లేందుకు అండర్‌గ్రౌండ్ పైపులైన్ వేశారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉపాధిహామీ నిధులు రూ.80వేలతో కట్ట సమీపంలో డ్రైనేజీ ఇంకుడుగుంత నిర్మించారు. మూడురోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి వచ్చిన వరదనీటి ఉధృతికి ఇంకుడుగుంత గోడలు కూలిపోయాయి. ఇంకా బిల్లు చెల్లించలేదని, ఇంకుడుగుంత కూలిపోయిన విషయం తెలియదని ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. – కరీంనగర్‌రూరల్



మేము సైతం

హరితహారంలో భాగంగా శనివారం మానేరు తీరాన కోటి మొక్కల నాటే కార్యక్రమంలో వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వారికి తోచిన విధంగా ఇది నా మొక్క అంటూ ఉత్సాహంగా మొక్కలు నాటడంలో నిమగ్నమయ్యారు. వారు నాటిన మొక్కకు వెంట తెచ్చుకున్న వాటర్ బాటిల్‌లోని నీరు పోస్తూ సంబరపడ్డారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా...

యూఏఈలో ఉచిత నియామకాలు

- ఏడీఎన్‌హెచ్ కంపాస్ కంపెనీ వీసాలు
- ముంబైలో ఇంటర్వ్యూలకు ఉచిత బస్సు సౌకర్యం

మోర్తాడ్ (బాల్కొండ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ప్రముఖ క్యాటరింగ్ సపోర్ట్ సర్వీసెస్ సంస్థగా పేరొందిన ఏడీఎన్‌హెచ్ కంపాస్ సంస్థ ఉచిత నియామకాల ప్రక్రియను చేపట్టింది. తెలంగాణలోని జీటీఎం ఇంటర్నేషనల్ రిక్రూటింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ముంబైలో ఈనెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో ఇంటర్వ్యూలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ముంబైలో రెండ్రోజులు జరిగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే నిరుద్యోగులను ఇక్కడి నుంచి తీసుకెళ్లి.. మళ్లీ ఇంటికి పంపించడానికి ఉచిత బస్సు సౌకర్యం కూడా జీటీఎం సంస్థ కల్పించింది. ఈసీఎన్‌ఆర్ పాస్‌పోర్టు కలిగిన 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వారు ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అభ్యర్థులు కాస్త ఆంగ్ల పరిజ్ఞానం కలిగి ఉండాలని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ వివరాలను జీటీఎం సంస్థ మొబైల్ నంబర్లు 8332013999, 8332016999, 8332052299లో ఒకదానికి వాట్సాప్ చేయాలని జీటీఎం సంస్థ ఎండీ చీటీ సతీశ్‌రావు 'సాక్షి'కి తెలిపారు. ఉచిత నియామకాల ప్రక్రియను వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని, ఎవరూ నయాపైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఓయూ మాజీ వీసీ నవనీతరావు కన్నుమూత



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మాజీ వీసీ ప్రొ.నవనీతరావు (95) శుక్రవారం రాత్రి బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన ఆయన ఓయూ కెమిస్ట్రీ విభాగంలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేసి 1970లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. బోధన, పరిశోధనలో ప్రతిభను చాటుతూ 220 పరిశోధన వ్యాసాలను, 5 పుస్తకాలు రాశారు. ఆయన పర్యవేక్షణలో 24 మంది పరిశోధన విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 160 పరిశోధన వ్యాసాలను సమర్పించారు. ఓయూ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులుగా వివిధ పాలన పదవులు చేపట్టిన ప్రొ.నవనీతరావు.. యంగ్ సైంటిస్ట్ అవార్డులతో పాటు ఇతర అనేక అవార్డులను అందుకున్నారు.

ఢిల్లీ తరువాత మనమే..

- 'అద్దె ఇళ్ల డిమాండ్'లో షహర్ హైదరాబాద్‌కు రెండోస్థానం
- డబుల్ బెడ్రూంవైపే అత్యధికుల మొగ్గు
- 'మ్యాజిక్ బ్రిక్స్' అధ్యయనంలో వివిధ అంశాలు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో అద్దె ఇళ్ల మార్కెట్ (రెంటల్ మార్కెట్) అంతకంతకూ వృద్ధి చెందుతోంది. సింగిల్, డబుల్ బెడ్‌రూం అద్దె ఇళ్లకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అద్దె ఇళ్ల కోసం వెతుకుతున్న వారిలో అత్యధికశాతం (80 శాతం) మంది సౌకర్యవంతమైన చిన్న అపార్ట్‌మెంట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. అద్దె ఇళ్ల డిమాండ్‌లో దేశరాజధాని ఢిల్లీ 27.25 శాతంతో ప్రథమ స్థానంలో, హైదరాబాద్ నగరం 22 శాతంతో ద్వితీయ స్థానంలో నిలుస్తోంది. పుణే (19.3 శాతం), ముంబై (18.35 శాతం), బెంగళూరు (12.8 శాతం) తర్వాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. గతంతో పోల్చితే గత మూడునెలల్లో (ఏప్రిల్–జూన్ మధ్యకాలంలో) రెంటల్ డిమాండ్ 18.1 శాతం పెరగగా, అదే సమయంలో రెంటల్ సప్లయ్‌లు కూడా 9.6 శాతం, అద్దెలు 4.9 శాతం పెరిగాయి. ఆ మూడునెలల కాలంలో సగటు అద్దెల పెరుగుదలలో బెంగళూరు (8.1 శాతం). నవీ ముంబై (7.3 శాతం), గురుగ్రామ్ (5.1 శాతం) ముందువరసలో నిలుస్తున్నాయి. అదేసమయంలో కొన్ని నగరాల్లో అద్దెల్లో స్వల్ప శాతం పెరుగుదల నమోదైంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'మ్యాజిక్ బ్రిక్స్'గత ఏప్రిల్–జూన్ నెలలకు సంబంధించి దేశంలోని 13 ప్రధాన నగరాల్లో అద్దె ఇళ్లకున్న డిమాండ్‌ను పరిశీలించి విడుదల చేసిన రెంటల్ ఇండెక్స్‌లో అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి.



'డబుల్'కు లేదు సాటి...

మరీ విలాసవంతంగా కాకపోయినా ఉన్నంతలో సౌకర్యవంతంగా ఉండేలా డబుల్ బెడ్‌రూం ఇళ్లను అద్దెకోసం అత్యధికులు కోరుకుంటున్నారు. అద్దె ఇళ్ల డిమాండ్, సప్లయ్ శాతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు 57 శాతం, వన్ బీహెచ్‌కే ఇళ్లకు 27 శాతం, ట్రిపుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం 18 శాతం డిమాండ్ ఉన్నట్టుగా ఈ నివేదిక ద్వారా తెలుస్తోంది. అంతకు ముందు నెలలతో (జనవరి–మార్చి మధ్యలో) పోల్చితే గత ఏప్రిల్–జూన్‌ల మధ్య త్రీ బీహెచ్‌కేల డిమాండ్ 36 శాతం నుంచి 18 శాతానికి (సగానికి) పడిపోయినట్టు తెలిపింది. అదే సింగిల్ బెడ్‌రూంల డిమాండ్ 17 శాతం నుంచి 27 శాతానికి పెరిగింది. సామాన్య, దిగువ, ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా అద్దెలు ఉండటమే ఆయా ప్రధాన నగరాల్లో సింగిల్, డబుల్ బెడ్‌రూం ఇళ్ల డిమాండ్ పెరగడానికి ముఖ్య కారణంగా మ్యాజిక్ బ్రిక్స్ అంచనా వేస్తోంది. నెలకు రూ.10 నుంచి 20 వేలలోపు అద్దె ఉన్న ఇళ్లకు కిరాయిదారులు అత్యధికంగా మొగ్గుచూపుతున్నారు. వీరిలో ఎక్కువమంది 500 చదరపు అడుగుల నుంచి వెయ్యి చదరపు అడుగుల కవర్డ్ ఏరియా ఉన్న అద్దె ఇళ్లు తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకంగా హైదరాబాద్ విషయానికొస్తే... (గత ఏప్రిల్–జూన్ మధ్యకాలంలో)

- హైదరాబాద్‌లో అద్దె ఇళ్ల డిమాండ్ 22 శాతం పెరుగుదల (ఆన్‌లైన్, ఇతరత్రా రూపాల్లో వెతకడం–యాక్టివ్ లిస్టింగ్స్‌లో)
- ఏప్రిల్–జూన్‌ల మధ్య అద్దెలు 4.5 శాతం వృద్ధి
- ఓఆర్‌ఆర్‌కు దగ్గరలో ఉండడంతో పాటు ప్రధాన ఐటీ, ఇతర ఉద్యోగ కేంద్రాలకు సమీపంగా ఉన్న కారణంగా మైక్రో మార్కెట్స్‌లో అద్దె ఇళ్ల కోసం అత్యధికంగా సెర్చ్ చేస్తున్న ప్రాంతాల్లో గచ్చిబౌలి, కొండాపూర్ అగ్రభాగాన నిలుస్తున్నాయి
- నగరంలోని ఆయా ప్రాంతాల్లో రూ.20 వేలు–32 వేలలోపున్న టూ బీహెచ్‌కేల కోసం ఎక్కువ మంది ప్రాధాన్యతనిస్తున్నారు

దేశంలోని ప్రధాననగరాలకు గత ఏడాది కాలంగా ఉద్యోగులు, విద్యార్థులు తిరిగి చేరుకుంటుండడంతో అద్దె ఇళ్లకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ఉద్యోగుల్లో అత్యధిక శాతం ఆఫీసుల నుంచి పనిచేస్తుండటంతో వాటికి దగ్గరగా ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నారు.
– సుధీర్ పాయ్, సీఈవో, మ్యాజిక్ బ్రిక్స్

హైదరాబాద్‌లో అద్దెలిలా...

లోకాలిటీ	2 బీహెచ్‌కే	3 బీహెచ్‌కే
గచ్చిబౌలి	24,000	35,000
కొండాపూర్	21,000	30,000
హైటెక్ సిటీ	32,000	47,000
మాదాపూర్	21,000	30,000
కోకాపేట్	23,000	33,000
నార్సింగి	22,000	32,000
కూకట్‌పల్లి	16,000	23,000
బంజారాహిల్స్	20,000	30,000
నల్లగండ్ల	22,000	32,000
జూబ్లీహిల్స్	23,000	33,000
మణికొండ	17,000	24,000

టెట్‌పై పట్టు ఏదీ?

- పరీక్ష రాసే వారిలో సగం మందికంటే తక్కువే పాస్..
- ఏడేళ్లుగా ఇదే తరహాలో ఫలితాలు
- కనీస అర్హత మార్కులు ఎక్కువ..
- ఇంగ్లిష్‌పై పట్టులేక ఇబ్బంది
- టీచర్ల నియామకాలు లేకపోవడం కూడా కారణమంటున్న అభ్యర్థులు
- సీరియస్‌గా సిద్ధం కాలేకపోతున్నామని ఆవేదన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ శిక్షణ తీసుకుంటున్నా.. ఆ తర్వాత ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో మాత్రం చాలా మంది ఫెయిలవుతున్నారు. బీఎడ్ విద్యార్హతతో రాసే పేపర్–2లో 2011 నుంచి ఇప్పటివరకు ప్రతిసారీ ఉత్తీర్ణత శాతం సగం కూడా దాటలేదు. తెలంగాణ ఏర్పాటయ్యాక ఒక్క 2022లో తప్ప ఎప్పుడూ ఉత్తీర్ణత 30% కూడా దాటకపోవడం గమనార్హం. ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ ఇస్తామని గతేడాది ప్రకటించడంతో.. ప్రైవేటు బడుల్లో పనిచేస్తున్నవారు సహా పెద్ద సంఖ్యలో అభ్యర్థులు కోచింగ్ కేంద్రాలకు వెళ్లి మరీ టెట్ కోసం సిద్ధమయ్యారు. అయినా పాస్ శాతం తక్కువే నమోదైంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామక నోటిఫికేషన్‌తోపాటు టెట్ నోటిఫికేషన్ ఇచ్చేవారని.. టీచర్ పోస్టుల భర్తీపై నమ్మకం ఉండేదని అభ్యర్థులు చెప్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక 2017లో మినహా ఇంతవరకు టీచర్ పోస్టుల భర్తీ జరగలేదు. దీంతో టెట్‌పై అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదని, సీరియస్‌గా ప్రిపేర్ కాకుండానే పరీక్షలు రాస్తున్నారని నిపుణులు అంటున్నారు.

అందని అర్హత గీటురాయి: టెట్ ప్రశ్నపత్రం 150 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత పొందాలంటే ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 90 మార్కులు, బీసీలు 75 మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 60 మార్కులు సాధించాలి. పేపర్–1 (డీఎడ్ అర్హతతో రాసేది)తో పోలిస్తే, పేపర్–2 (బీఎడ్ అర్హతతో రాసేది) కష్టంగా ఉంటోందని పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు చెప్తున్నారు. మేథ్స్, ఇంగ్లిష్ పై పట్టు ఉంటే తప్ప కనీసం 90 మార్కులు సాధించడం కష్టమేనని.. ముఖ్యంగా మేథ్స్‌లో సరైన సమాధానం రాబట్టేందుకు ఎక్కువ సమయం పడుతోందని అంటున్నారు. కనీసం 6 నెలల పాటు మోడల్ ప్రశ్నలు చేసి ఉంటేనే ఇది సాధ్యమవుతుందని వివరిస్తున్నారు. ఇక ఇంగ్లిష్‌లో ప్రధానంగా జాతీయాలు, మోడ్రన్, అడ్వాన్స్‌డ్ లాంగ్వేజ్ నుంచి ప్రశ్నలు ఇస్తున్నారని.. వీటికి తగ్గ ప్రిపరేషన్ ఉండటం లేదని స్పష్టం చేస్తున్నారు. అదే పేపర్–1 ఇంటర్మీడియట్ స్థాయిలో ఉంటోందని.. బోధన మెళకువలు, మోడ్రన్ టీచింగ్ మెథడ్స్‌పై దృష్టి పెడితే తేలికగా గట్టెక్కగలుగుతున్నారని నిపుణులు అంటున్నారు.

నాలుగున్నర లక్షల మందిలో..

రాష్ట్రంలో 1.5 లక్షల మంది డీఎడ్ ఉత్తీర్ణులు, 4.5 లక్షల మంది బీఎడ్ ఉత్తీర్ణులు కలిపి ఆరు లక్షల మందికిపైగా ఉపాధ్యాయ అభ్యర్థులు ఉన్నారు. వీరిలో సుమారు 4 లక్షల మంది మాత్రమే ఇప్పటివరకు టెట్ ఉత్తీర్ణత సాధించగలిగారు. టెట్‌లో పేపర్–1 పాసైతే.. 1–5 వరకూ బోధించే 'సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)' పోస్టులకు.. పేపర్–2 పాసైతే పదో తరగతి వరకు బోధించే 'స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)' పోస్టులకు పోటీపడే వీలు ఉంటుంది. డీఎడ్ పూర్తిచేసినవారు పేపర్–1 మాత్రమే రాసే వీలుండగా.. బీఎడ్ వారు పేపర్–1, పేపర్–2 రెండూ రాయవచ్చు. అయితే పేపర్–1 కాస్త సులువుగా ఉంటుండటంతో.. చాలా మంది బీఎడ్ వారు పేపర్–1పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని, ఇదికూడా పేపర్–2లో అర్హత శాతం తగ్గడానికి కారణమవుతోందని నిపుణులు చెప్తున్నారు.

ఇంగ్లిష్, మేథ్స్‌కు కష్టపడాలి

కేవలం 45 రోజుల్లోనే టెట్‌కు ప్రిపేర్ అవ్వాలంటే చాలా కష్టపడాలి. ఇంగ్లిష్, మేథ్స్‌లో మంచి మార్కులు సాధిస్తేనే అర్హత సాధించవచ్చు. దీనికి ప్రత్యేక సన్నద్ధత అవసరం. టీచర్ పోస్టులు వస్తాయనే ఆశతో కోచింగ్ కేంద్రాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నాం. కానీ టీచర్ నోటిఫికేషన్ రాకపోవడం నిరాశగా ఉంది.
– స్వాతి, టెట్ అభ్యర్థి, భూపాలపల్లి

నియామకాలుంటేనే ఉత్సాహం

టెట్ ఉత్తీర్ణులు లక్షల్లో ఉన్నారు. టీచర్ పోస్టులు వస్తాయని ఆశతో ఉన్నాం. కానీ ఏటా నిరాశే ఎదురవుతోంది. నియామక నోటిఫికేషన్ వస్తేనే మాకూ ఉత్సాహంగా ఉంటుంది. ఈసారైనా రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తారని ఆశిస్తున్నాం.
– ఇర్ఫాన్ పాషా, టెట్ అభ్యర్థి, ములుగు జిల్లా

2011 నుంచి టెట్ ఉత్తీర్ణత శాతం

ఏడాది	పేపర్–1	పేపర్–2
2011	44.27	49.68
2012	44.53	47.02
2014	61.86	28.56
2016	54.45	25.04
2017	57.37	19.51
2022	32.68	49.64

కొడుకును బావిలో పడేసి.. ఆపై పురుగు మందు తాగి..

- బాలుడి మృతి.. చికిత్స పొందుతున్న తండ్రి
- కుటుంబంలో ఆస్తి గొడవలే కారణమా?


దేవాన్ష్ (ఫైల్)


చికిత్స పొందుతున్న తిరుపతిరెడ్డి

ఎలిగేడు: కుటుంబంలో ఆస్తి గొడవలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి కొడుకు(17 నెలలు)ను బావిలో పడేసి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనలో బాలుడు మృతిచెందాడు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం రాములపల్లికి చెందిన కల్వల తిరుపతిరెడ్డి, మానస దంపతులు. వీరికి దేవాన్ష్ (17 నెలలు) సంతానం. తిరుపతిరెడ్డి, అతడి సోదరుడు రత్నాకర్‌రెడ్డి మధ్య కొంతకాలంగా ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. మూడునెలల క్రితం పంచాయితీ పెట్టి పెద్దల సమక్షంలో ఆస్తి పంచుకున్నారు. అప్పటి నుంచి తిరుపతిరెడ్డి భార్య, కుమారుడితో కలిసి సుల్తానాబాద్‌లోని ఓ అద్దింట్లో నివాసం ఉంటున్నాడు. ఆస్తి పంపకాల విషయమై చంపుతామని తరచూ కొందరు బెదిరిస్తున్నారని భార్యతో చెప్పుకుని తిరుపతిరెడ్డి బాధపడేవాడు. ఈ క్రమంలో రాములపల్లిలో ఉంటున్న తల్లిదండ్రులకు తన కుమారుడిని చూపించి తీసుకొస్తానని భార్యతో చెప్పి బయల్దేరాడు. అయితే ఎంతకూ తిరిగి రాకపోవడంతో భర్తకు మానస ఫోన్ చేయగా సమాధానం రాలేదు. వెంటనే అత్తామామలకు ఫోన్ చేయగా రాములపల్లికి రాలేదని వారు చెప్పారు. అనుమానంతో పొలం వద్దకు వెళ్లి చూడగా తిరుపతిరెడ్డి అపస్మారకస్థితిలో కనిపించాడు. బావిలో బాలుడి చెప్పులు కన్పించాయి. తిరుపతిరెడ్డిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. కాస్త తేరుకున్నాక దేవాన్ష్ గురించి అడుగగా తానే బావిలో పడేసి గడ్డిమందు తాగానని చెప్పాడు. విషయం తెలుసుకున్న సుల్తానాబాద్ సీఐ జగదీశ్, జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ బావి వద్దకు చేరుకుని గ్రామస్తుల సహకారంతో దేవాన్ష్ మృతదేహాన్ని బయటకు తీయించారు. మానస ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

మళ్లీ పులి హల్‌చల్

- కాటేపల్లి అడవిలో ఆవుపై దాడి

వేమనపల్లి: మంచిర్యాల జిల్లా అడవుల్లో మళ్లీ పులి కదలికలు మొదలయ్యాయి. గత మూడు రోజులుగా నీల్వాయి అటవీ రేంజ్ కాటేపల్లి, నీల్వాయి, గొర్లపల్లి బీట్ అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు నిర్ధారణకు వచ్చారు. గత రెండు రోజుల క్రితం కాటేపల్లి బీట్ పెద్దవాగు పరిసరాల్లోని చింతమడుగు ప్రాంతంలో ఆవుపై పులి దాడి చేసింది. ఆవు ఏ గ్రామానికి చెందిన రైతుదో అధికారులు గుర్తించలేకపోతున్నారు. గత 20 రోజులు బెల్లంపల్లి అటవీ డివిజన్ కుశ్నపల్లి, చెన్నూర్ సబ్ డివిజన్ నీల్వాయి, కుశ్నపల్లి అటవీ రేంజ్‌లలో పులి కలియ తిరుగుతోంది. కాళేశ్వరం జోన్ ఎఫ్‌డీపీటీ, కన్జర్వేటర్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో పులి కదలికలపై అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. ఎన్‌టీసీఏ మార్గదర్శకాల ప్రకారం పులి కదలికలను బహిర్గతం చేయకూడదనే ఉద్దేశంతో అటవీ అధికారులు ఎంతో గోప్యంగా విషయాన్ని ఉంచుతున్నారు. నీల్వాయి, కుశ్నపల్లి, కోటపల్లి రేంజ్ పరిధిల్లో సుమారు 62 సీసీ కెమెరాలు పులి ఆవాస ప్రాంతాల్లో అమర్చి సమాచారం తీసుకుంటున్నారు. ఆవు కళేబరం ఉన్న ప్రాంతంలోకి మళ్లీ పులి వచ్చే అవకాశం ఉన్నందున ఆ ప్రాంతంపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అటవీ అధికారులతో ఎనిమల్ ట్రాకర్స్, బేస్‌క్యాంపు, హిటికోస్ సిబ్బంది నిరంతరం నిఘా కొనసాగుతోంది.


పులి పాదముద్రలు

అడవి జంతువులపైనే దాడి

ఈ ప్రాంతంలో తిరుగుతున్న పులి పశువుల మందలపై దాడికి దిగడం లేదు. అటవీ ప్రాంతంలో ఉండే వన్యజీవులనే ఆహారంగా తీసుకుంటోంది. వర్షాకాలం కావడంతో అడవి చిగురు తొడిగింది. పొదలు చెట్లతో గుబురుగా ఉండడంతో పులి ఆవాసానికి అనుకూలంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. దుప్పులు, జింకలు, కొండగొర్రెలను చంపి తింటున్నట్లు అటవీ అధికారుల పర్యవేక్షణలో తేలింది. పశువులు, గేదెలు అడవి ప్రాంతానికి వెళ్లిన మందలకు దూరంగా పులి వెళ్లిపోతున్నట్లు పశువుల కాపరులు తెలుపుతున్నారు. పులి కదలికలు ఉన్న సమీప గ్రామాల ప్రజలు అటవీ ప్రాంతానికి వెళ్లకూడదని అటవీ అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

కే–12 పులిగా అనుమానం

కుశ్నపల్లి, నీల్వాయి రేంజ్‌లలో తిరుగుతున్న పులి కే–12 పులిగా అటవీ సిబ్బంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆడపులి కాగా 12, 13 సెంటీమీటర్ల పాదముద్ర కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. పాల్గుణ పులికి రెండో ఈతలో పుట్టిన కే–8 పులి సంతతిగా తెలుస్తోంది. కే–8 పులికి మూడు పులి పిల్లలు కాగా సుమారు 22 నెలల వయస్సు ఉందని తెలుస్తోంది. తల్లి కే–8తో రెండు పులి పిల్లలు కుమురంభీం జిల్లా లోహగుట్ట, అగర్‌గూడ అడవుల్లో మకాం పెట్టాయి. కే–12 పులి మాత్రమే చెన్నూర్, బెల్లంపల్లి డివిజన్‌లలో తిరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒడ్డుగూడెం సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో అడవి కుక్కలు ఉన్నందున పులి అటువైపు వెళ్లడానికి జంకుతోంది. శనివారం గొర్లపల్లి, దస్నాపూర్ బీట్ పరిధిలో పులి సంచారం ఉండవచ్చని అధికారులు అన్వేషణ కొనసాగించారు.

భారతీయ సంస్కృతి గొప్పది

- ట్రిపుల్ ఐటీ తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి రాములు

తానూరు: భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని బాసర ట్రిపుల్ ఐటీ తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ రాములు కొత్తపల్లి అన్నారు. విద్యార్థులకు వారం రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శనివారం మన సంస్కృతి, సంప్రదాయాలు, పురాణాలు, ఇతిహాసాలపై అవగాహన కల్పించారు. పురాణాల్లో లేనిది సృష్టిలో లేదని, ఈ సృష్టిలో ఉన్నది పురాణాల్లో ఉందని వివరించారు. నాటి భారతీయ రుషులు ఎన్నో విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను రచించారని, ఆనాటి గ్రంథాల్లో రాసిన విషయాలే నేటి వైజ్ఞానిక సాంకేతిక ఆలోచనలకు మూల ఆధారాలుగా నిలుస్తున్నాయన్నారు. క్రీ.పూ, 400 వందల ఏళ్ల క్రితమే కాశీలో నక్షత్రశాల ఉండేదని బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుడు సర్ రాబర్ట్ భార్కర్ తన వ్యాసంలో రాశాడని తెలిపారు. నాటి బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుడు 1777లోనే కాశీలో నక్షత్రశాలను సందర్శించినట్లు వెల్లడించారని వివరించారు. నేటి విద్యార్థులు అనాటి గ్రంథాలయాలను ఎప్పటికీ మర్చిపోకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్, పవన్, అరిఫ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాములు



లారెక్కిన రైలు

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం రైలు బోగీలు దర్శనమిచ్చాయి. రోడ్డుపైన రైలు వచ్చిందా అని పలువురు ఆశ్చర్యంగా వీక్షించారు. నాగపూర్ వైపు కంటైనర్‌లో తీసుకెళ్తుండగా కనిపించిన దృశ్యమిది. – నేరడిగొండ

ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు పేదలకు ఉపయోగపడాలి

- పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు నుంచి విడుదలయ్యే సీఎస్సార్ నిధులు పేదలకు ఉపయోగపడాలని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత అన్నారు. శనివారం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌కు రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పూస్కూరి రామ్మోహన్‌రావుతో కలిసి రాగా.. ప్రాజెక్టు ఏజీఎం హెచ్‌ఆర్ బిజయ్‌కుమార్ సిగ్దర్ పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సీఎస్సార్ నిధులతో చేపట్టిన పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న సీఎస్సార్ నిధుల విడుదలకు సంబంధించిన వివరాలపై చర్చించారు. నిధులు విడుదల చేసి పార్లమెంట్ పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలలోని పేద ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎన్టీపీసీ అధికారులు పాల్గొన్నారు.


ఎంపీతో సమావేశమైన ఎన్టీపీసీ అధికారులు

బీఆర్‌ఎస్, బీజేపీని ఓడించడమే లక్ష్యం

- కలిసొచ్చే పార్టీలతో ముందుకు వెళ్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

గోదావరిఖని: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ ఓడించడమే లక్ష్యంగా కలిసివచ్చే పార్టీలతో ముందుకు సాగుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. గోదావరిఖనిలో జరుగుతున్న ఏఐటీయూసీ మహాసభలకు వచ్చిన ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మొదటి నుంచి తాము వ్యతిరేకిస్తున్న పార్టీ బీజేపీ అన్నారు. బీఆర్‌ఎస్‌తో పొత్తుకు కలిసేది లేదన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలతో రాబోయే ఎన్నికల్లో ముందుకు సాగుతామన్నారు. సీపీఎం, కాంగ్రెస్, బీఎస్పీ, కోదండరాం పార్టీలతో కలిసి వెళ్లే దిశగా ఆలోచిస్తున్నామన్నారు. బీజేపీ ప్రమాదాన్ని తప్పించేందుకే మునుగోడు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకున్నామన్నారు. అప్పటికే దేశంలో 9చోట్ల రాష్ట్ర ప్రభుత్వాలు బీజేపీ వల్ల కూలిపోయాయని, ఆ పరిస్థితి తెలంగాణకు రావద్దనే వ్యూహాత్మకంగా వ్యవహరించామన్నారు. లేకుంటే కూలిపోయే పదో ప్రభుత్వం బీఆర్‌ఎస్ అయ్యేదన్నారు. ఈ క్రమంలో మునుగోడు, దుబ్బాక, హైదరాబాద్ ఉప ఎన్నికల్లో మద్దతు ప్రకటించామన్నారు. ఇటీవల కాలంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల వైఖరిలో మార్పు వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ వైఖరితో తమకు వచ్చిన నష్టమేమీ లేదని, వందేళ్ల చరిత్ర కలిగిన తమ పార్టీ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తుందన్నారు. మునుగోడు ఎన్నికల తర్వాత తనపై ప్రభుత్వం నాలుగు కేసులు పెట్టిందన్నారు. సెప్టెంబర్–17తర్వాత ప్రభుత్వంపై ఉద్యమాలు పెద్ద ఎత్తున్న చేపడుతామన్నారు. వేలాది మందితో కలిసి మిలియన్ మార్చ్ తరహాలో హైదరాబాద్‌లో మహా ఉద్యమాన్ని నిర్వహిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో పొత్తులేకుంటే కనీసం 40స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. ఆయన వెంట నాయకులు సీతారామయ్య, జోసఫ్, సదానందం తదితరులున్నారు.


మాట్లాడుతున్న సాంబశివరావు

జాతీయ జూడోపోటీల్లో సత్తాచాటాలి


ట్రాక్‌షూట్లు అందిస్తున్న అనంతరెడ్డి, సృజన్‌రావు

- రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి, మైత్రి గ్రూప్ ఎండీ సృజన్‌రావు
- తెలంగాణ జట్లకు ట్రాక్‌సూట్ల ప్రదానం

కరీంనగర్‌స్పోర్ట్స్: ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి జూనియర్స్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్ల క్రీడాకారులు బంగారు పతకాలు సాధించాలని మానేరు విద్యాసంస్థల అధినేత, రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, మైత్రి గ్రూప్ ఎండీ సృజనరావు ఆకాంక్షించారు. మంకమ్మతోటలోని సాయిమానేరు పాఠశాలలో శనివారం తెలంగాణ జూడోజట్లకు మైత్రిగ్రూప్ ఆధ్వర్యంలో ట్రాక్‌షూట్లు అందించారు. రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 28నుంచి సెప్టెంబర్ 1వరకు ఢిల్లీలోని కేడీజాదవ్ ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి జూనియర్స్ జూడోపోటీలు జరుగనున్నట్లు తెలిపారు. జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, జిమ్నాస్టిక్స్, యోగా, జూడో సంఘాల ప్రతినిధులు డి.నిరంజనాచారి, నాగిరెడ్డి సిధారెడ్డి, సిలివేరి మహేందర్ పాల్గొన్నారు.

పేదల భూములు ఎవరూ కొనొద్దు

- సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు డివిజన్ కార్యదర్శి వెంకటేశ్

సాక్షి, పెద్దపల్లి: పేద ప్రజలు పోరాడి సాధించుకున్న భూములను ఎవరూ కొనుగోలు చేయవద్దని సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు డివిజన్ కార్యదర్శి వెంకటేశ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లాలోని పలు గ్రామాల్లో భూముల కొనుగోలుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మాజీలు మధ్యవర్తులుగా వ్యవహరించడం సరికాదని, 1978–79 కాలంలో పోరాడి వందలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని సాగుచేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, ఆ ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎర్రజెండాలు పాతి భూములను ఆక్రమించారని, ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకొని, వాటిని పంచుకొని భూములు దున్నుకుంటున్నారని, ఎవరైనా ఆ భూమిని కొనుగోలు చేసినా వదిలేయాలని తెలిపారు. లేని పక్షంలో ప్రజాభిప్రాయం మేరకు చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

వైరల్





ఇద్దరు మిత్రులు

బాలీవుడ్ నటి రవీనా టాండన్ కూతురు రషా తండానీ భావుకురాలు. ప్రకృతి ప్రేమికురాలు. పద్దెనిమిది సంవత్సరాల రషా మంచి ఫొటోగ్రాఫర్ కూడా. తల్లితో పాటు ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలను చూసి వచ్చింది రషా. తాజాగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ పర్యటనకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది.

'హూ ఎల్స్ టు ట్రావెల్ ద వరల్డ్ విత్?' కాప్షన్‌తో తల్లితో దిగిన ఫొటోలను షేర్ చేసింది. 'తల్లీకూతుళ్లు క్లోజ్‌ఫ్రెండ్స్‌లా కనిపిస్తున్నారు' అన్నారు ఒక నెటిజన్.



● దివ్య మిట్టల్
ఐఏఎస్ అధికారి

మన ఇల్లే... ఒక పాఠశాల ప్రయోగశాల



ఒక వైపు వృత్తి నిర్వహణలో బిజీగా ఉన్నప్పటికీ స్కూల్ పిల్లలకు అవసరమైన సలహాలు, టిప్స్‌ను సోషల్ మీడియా ద్వారా అందిస్తోంది ఐఏఎస్ అధికారి దివ్య మిట్టల్. తాజాగా ఫన్ అండ్ ఇంటరాక్టివ్ మార్గంలో సైన్స్ సూత్రాలను అర్థం చేయించే టిప్స్‌ను షేర్ చేసింది. పిల్లలకు భూభ్రమణం గురించి వివరించడానికి హ్యూమన్ సన్‌డయల్ ఎలా తయారు చేయాలి, 'సింక్ అండ్ ఫ్లోట్ ఎక్స్‌పెరిమెంట్'ను వివరించడానికి నారింజలు, నీళ్లను ఎలా ఉపయోగించాలి... అనేవి ఇందులో ఉన్నాయి.

'ఐఐటీ దిల్లీలో ఇంజినీరింగ్ చదువుకున్నాను. డిగ్రీ కంటే శాస్త్రీయ దృష్టి, విశ్లేషణ ముఖ్యం' అంటుంది దివ్య మిట్టల్. 'సూపర్ కలెక్షన్. ఫన్-టు-డూ. మీ పిల్లలు అదృష్టవంతులు. మీరు ఇచ్చిన టిప్స్‌ను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలి' అని ఒక యూజర్ స్పందించాడు.



నాన్న ముద్ద

పిల్లలు స్కూలుకెళ్లే హడావుడిలో ఉంటే అమ్మలు అన్నం ముద్ద కలిపి పెడతారు.
ఇక్కడ కూతురు ఎయిర్‌హోస్టెస్‌గా డ్యూటీకి వెళ్లే హడావుడిలో ఉంటే నాన్న బతిమాలి అన్నం తినిపిస్తున్నాడు.
ఇండిగో ఎయిర్‌హోస్టెస్ పూజా బిహాని పెట్టిన ఈ పోస్టు క్షణాల్లో వైరల్‌గా మారి అందరి చేతా తల్లినో, తండ్రినో గుర్తుకు తెప్పిస్తోంది.

'తల్లి బిడ్డ కడుపు చూస్తుంది' అంటారు. తండ్రికి మాత్రం బిడ్డ ఆకలి పట్టదా?

తల్లి కష్టపడ్డా, తండ్రి కష్టపడ్డా బిడ్డల కోసమే. జీవులకు లోకంలో అన్నింటి కంటే తృప్తినిచ్చేది తమ సంతానానికి ఆహారం అందించడమేనట. పిల్లలు తింటూ ఉంటే తల్లిదండ్రులకు ఆనందం. వారు ఖాళీ కడుపులతో ఉంటే బాధ. ముద్దుకోసమో మురిపెం కోసమో పిల్లలకు ఎన్నేళ్లొచ్చినా గోరుముద్దలు తినిపించే తల్లులు ఉంటారు. అయితే ఇక్కడ తండ్రి మార్కులు కొట్టేశాడు. ఇండిగోలో ఎయిర్ హోస్టెస్‌గా పని చేస్తున్న పూజా బిహాని డ్యూటీకి టైమయ్యి మేకప్ వేసుకుంటూ ఉంటే ఎక్కడ ఖాళీ కడుపుతో క్యాబ్ ఎక్కి తుర్రుమంటుందోనని ఆమె తండ్రి అన్నం తినిపించాడు. ఆ వీడియోను పూజా ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే క్షణాల్లో 8.6 లక్షల వ్యూస్ వచ్చాయి. 'నాకు చిన్నప్పటి రోజులు గుర్తుకొచ్చాయి' అని ఒకరంటే 'తల్లిదండ్రులు మాత్రమే పిల్లల బాగోగుల గురించి పట్టించుకుంటారు' అని మరొకరు అన్నారు. 'నాన్న గుర్తొస్తున్నారు' అని ఒకరంటే 'ఆ రోజులు మళ్లీ రావు' అని మరొకరు బాధ పడ్డారు. చిన్న చిన్న ఆనందాల జీవితం అంటే ఇదేనని అందరూ అన్నారు.



గిన్నిస్ భర్ సింగ్

పంజాబ్‌కు చెందిన అమృత్ భర్‌సింగ్ పేరు వినబడగానే అదేదో ఆయన ఇంటి పేరులాగా 'గిన్నిస్ బుక్' అనే సౌండ్ తకీమని ప్రతిధ్వనిస్తుంది. గతంలో ఎన్నో రికార్డ్‌లను క్రియేట్ చేసిన అమృత్‌భర్‌సింగ్ తాజాగా మరో రికార్డ్ సృష్టించాడు. ఒక నిమిషంలో ఫింగర్ టిప్స్‌పై 86 పుషప్‌లు చేసి గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కాడు.

గుర్‌దాస్‌పూర్ జిల్లా ఉమర్‌వాలా గ్రామానికి చెందిన సింగ్ పాశ్చాత్య పద్ధతుల్లో కాకుండా సంప్రదాయ పద్ధతుల్లో ప్రాక్టీస్ చేస్తుంటాడు.

మోడ్రన్ జిమ్‌లకు వెళ్లకుండా ఇంటి పరిసరాలలో ఉన్న పశువుల కొట్టాన్ని జిమ్‌గా మార్చుకున్నాడు. ఇటుకలు, ఇసుక బస్తాలు, ప్లాస్టిక్ క్యాన్‌లు తన ప్రాక్టీసింగ్ సాధనాలు. సప్లిమెంట్స్‌కు దూరంగా ఉండే సింగ్ నేచురల్ డైట్స్ మాత్రమే తీసుకుంటాడు. 'గతనెల ఫిబ్రవరి నెలలో సెట్ చేసిన రికార్డ్‌ను నేనే బ్రేక్ చేయాలనుకున్నాను. ప్రాక్టీస్ కోసం ఎన్నోనెలలు చెమటలు చిందించాను. ఫలితం వృథా పోలేదు' అంటున్నాడు అమృత్‌భర్ సింగ్.



ఇచ్చట తల వెంట్రుకలు ఖండించ బడును

సొంతంగా హెయిర్ కటింగ్ చేసుకోవాలనుకోవడం తేలికేగానీ, ప్రాక్టికల్ విషయానికి వస్తేగానీ కష్టమేమిటో తెలియదు. బోలెడు ఓపిక ఉండాలి. దానికి నైపుణ్యం తోడు కావాలి.

'ఇదంతా ఎందుకండీ... నా రోబోను చూడండి' అంటున్నాడు షేన్ వైటన్.

అమెరికన్ ఇంజినీర్ షేన్ వైటన్ హెయిర్ కట్ చేసే రోబోను తయారు చేశాడు. రోబో ఒక కుర్రాడికి హెయిర్ కట్ చేసే వీడియోను 'గెట్టింగ్ ఏ రోబో టు కట్ యువర్ హెయిర్' కాప్షన్‌తో తన యూ ట్యూబ్ చానల్‌లో పోస్ట్ చేశాడు. ఈ వీడియో వైరల్ అయింది.

'వీడియోను జాగ్రత్తగా గమనిస్తే అతడి కళ్లలో అంతులేని భయం కనిపిస్తుంది. అంతవసరమంటారా?' అంటూ ఒక యూజర్ స్పందించాడు.



దిగేదే ల్యా పుష్ప-3

చంద్రయాన్-3 విజయవంతమైన ఆనందంలో ఉండగానే 'పుష్ప' చిత్రం జాతీయస్థాయిలో అవార్డ్‌లు సొంతం చేసుకుంది. ఒకవైపు 'పుష్ప-2' షూటింగ్‌లో ఉండగానే మరోవైపు నెటిజనులు చంద్రయాన్, పుష్ప ఆనందాన్ని మిక్స్ చేస్తూ ఎవరికి వారు 'పుష్ప-3' స్టోరీ లైన్ రెడీ చేశారు. అందులో ఒకటి... ఆంగ్లపత్రికలో వచ్చిన 'వై ది గ్లోబల్ రేస్ ఫర్ ది లునార్ సౌత్ పోల్' అనే వ్యాసాన్ని అనువాదం చేయించి తెలుగులో వింటాడు పుష్ప. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఉన్న విలువైన ఖనిజాల గురించి విన్న తరువాత గంధపు చెట్లపై పుష్పకు ఆసక్తిపోయింది. 'కొడితే సౌత్ పోల్ కొట్టాలి. విలువైన ఖనిజాలు కొట్టేయాలి' అని గట్టిగా డిసైడై పోయాడు. చిత్తూరు జిల్లాకు చెందిన పుష్పరాజ్ చంద్రుడి దక్షిణ ధ్రువం పైకి చేరుతాడా? అక్కడి ఖనిజాలను సొంతం చేసుకుంటాడా? ఒకవేళ చేసుకుంటే విలన్ భన్వర్ సింగ్ షెకావత్ ఎలా అడ్డు పడుతాడు... అనేది నెటిజనుల ఊహాల్లో పుట్టిన పుష్ప-3 స్థూల కథ.

అమ్మ కుట్టీ అమ్మ కుట్టీ... వెళ్దాం ఛలో ఎలి.కుట్టీ

అవసరమే కాదు ఆసక్తి కూడా కొత్త భాషను దగ్గర చేస్తుందని మలయాళ భాషను గడగడా మాట్లాడే ఎలిజబెత్ కీటోన్‌ను చూస్తే అర్థమవుతుంది. జార్జియా (యూఎస్)కు చెందిన ఎలిజబెత్ ఇంగ్లీష్ టీచర్. కొత్త భాషలు నేర్చుకోవడం అంటే ఇష్టం. సౌత్‌కొరియా ఆ తరువాత యూఏఈలో ఇంగ్లీష్ పాఠాలు చెప్పింది.

దుబాయ్‌లో ఉన్నప్పుడు మలయాళీ కుర్రాడు అర్జున్‌తో ఎలిజబెత్‌కు పరిచయం అయింది, ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్లయింది. ఇక అప్పటి నుంచి శ్రీవారి మాతృభాషను నేర్చుకోవాలని డిసైడై పోయింది ఎలిజబెత్.

'30 రోజుల్లో మలయాళం'లాంటి ఔట్‌డేటెడ్ పుస్తకాలు, మార్గాలు తప్ప కొత్తవి కనిపించలేదు. దీంతో కోళికోడ్‌లో ఉన్న ఒక టీచర్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో మలయాళం భాష నేర్చుకోవడం మొదలుపెట్టింది. అయితే సాంకేతిక కారణాల వల్ల అది మధ్యలోనే ఆగిపోయింది. దీంతో తనదైన స్టైల్లో సొంతంగా నోట్స్ రాసుకొని, డూడుల్స్ తయారు చేసుకొని మలయాళ భాషపై పట్టు సంపాదించింది.

'ఎలి.కుట్టీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆసక్తి ఉన్నవారికి మలయాళం నేర్పుతోంది.



హెల్త్

● తుంటి ఎముక కీలు మార్పిడి

యాంటీరియర్ పద్ధతితో నిర్వహిస్తే లాభాలేమిటంటే?

మనిషి నిటారుగా నిలబడటానికి, కూర్చోడానికి, పరుగెత్తడానికి... ఒక్కమాటలో చెప్పాలంటే రోజులో చేయాల్సిన చాలా పనులకు తోడ్పడేది తుంటి ఎముక కీలు. తుంటి ఎముకలో సాకెట్ లాంటి గుండ్రటి ఖాళీ స్థలం ఉంటుంది. సరిగ్గా ఆ ఖాళీలో అమరిపోయేలా తొడ ఎముక చివరన బంతిలాంటి భాగం ఉండి, ఈ రెండింటి కలయితో కీలు (జాయింట్) ఏర్పడుతుంది. ఈ కీలు వల్లనే రోజువారీ చేసే అనేక పనులు సాధ్యమవుతాయి. ఇటీవల అనేక కారణాలతో... అంటే... వయసు పెరగడం వల్ల వచ్చే ఆర్థ్రైటిస్‌తో, తుంటి ఎముకలో అరుగుదల వల్ల, యాంకలైజింగ్ ఆర్థ్రైటిస్‌తో, మరీ ముఖ్యంగా ఇటీవల కరోనా తర్వాత పాతికేళ్ల లోపు యువతలో సైతం అవాస్క్యులార్ నెక్రోసిస్ కారణంగా తుంటి ఎముక అరగడం, విరగడం చాలా సాధారణమయ్యింది. ఇలాంటప్పుడు తుంటి ఎముక మార్పిడి సర్జరీ చేయడం అవసరమవుతుంది. అయితే ఇదే శస్త్రచికిత్సను 'యాంటీరియర్ హిప్ రీప్లేస్‌మెంట్' పద్ధతిలో కాస్త వైవిధ్యంగా నిర్వహిస్తున్నారు డాక్టర్ నితీశ్ భాన్. ఈ పద్ధతి అంటే ఏమిటో, దాని వల్ల ప్రయోజనాలేమిటో ఆయన మాటల్లోనే...

ప్రశ్న : యాంటీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్ అంటే ఏమిటి, దాని వల్ల ప్రయోజనాలేమిటి?

నితీశ్ భాన్ : 'యాంటీరియర్ హిప్ రీప్లేస్‌మెంట్' అంటే ఏమిటో తెలుసుకునే ముందర, అసలు సంప్రదాయబద్ధంగా (కన్వెన్షనల్‌గా) చేసే 'పోస్టీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్' అంటే ఏమిటో తెలియాలి. అప్పుడు దానికీ దీనికీ తేడాలేమిటి అనేవి తెలుస్తాయి. నిజానికి హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీని మూడు రకాలుగా చేస్తారు. అవి... మొదటిది పిరుదు వెనకభాగం నుంచీ, రెండోది కాస్త పక్కగా చేసేవి. వీటినే పోస్టీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్‌గా చెప్పవచ్చు. ఇందులో మూడోది... మనం యాంటీరియర్‌గా చెప్పే... కాలి ముందు వైపు నుంచి చేసే శస్త్రచికిత్స.

సాధారణంగా 'పోస్టీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్'లో పిరుదు దగ్గర ఉండే మూడు కండరాల సముదాయంలో పెద్దదైన 'గ్లుటియస్ మాక్సిమస్' అనే పెద్ద కండరాన్నీ, మరి కొన్ని కీలకమైన కండరాల్ని కట్ చేయాల్సి వస్తుంది. ఇలా కండరాలను కట్ చేసి, తుంటి కీలు వరకు వెళ్లాక కీలు మార్పిడి ప్రక్రియ అంతా ఒకేలా ఉంటుంది. కానీ... అతి పెద్దవీ, కీలకమైన కండరాలను కట్ చేయడం వల్ల గాయం తగ్గి, అంతా నయం కావడానికి కనీసం ఐదారు నెలలు పట్టవచ్చు. అయితే 'యాంటీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్'లో ఇలా కీలకమైన కండరాల కోత అవసరముండదు కాబట్టి ఇది తగ్గడానికి 12 రోజులు చాలు.

ప్రశ్న : శస్త్రచికిత్స ఏదైనప్పటికీ... ఆర్నెల్ల తర్వాతైనా అంతా మునపటిలా ఉంటుందా?

నితీశ్ భాన్ : అదే చెప్పబోతున్నా. గ్లుటియస్ మాక్సిమస్ లాంటి అతి పెద్ద కండరం కట్ చేయడం వల్ల 'పోస్టీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్స తర్వాత అనేక ప్రతిబంధకాలూ, ప్రతికూలతలు ఉంటాయి. మనం నిలబడటానికి, కూర్చోడానికి, కూర్చున్న తర్వాత లేవడానికి, కదలడానికి, నడవడానికి, పరుగెత్తడానికి... ఇలా చాలా కదలికలకు తోడ్పడే కండరం కావడంతో... హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్ తర్వాత అనేక ఆంక్షల్ని పాటించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒకవైపు ఒరిగి పడుకున్నప్పుడు కాళ్లు రెండూ దగ్గరగా తీసుకురాకూడదు. కూర్చున్నప్పుడు పాదాలు లోపలివైపునకు ఉండేలా కాళ్లు దగ్గరగా పెట్టుకోకూడదు. కూర్చుని ముందుకు వంగకూడదు. కూర్చుని కాళ్లు ముడిచినప్పుడు 90 డిగ్రీల నుంచి 100 డిగ్రీలు లోపలికి ముడవలేం. కూర్చుని ముందుకు వంగి సాక్స్ తొడగలేము, షూలేసులు కట్టుకోలేం. అంతెందుకు... సోఫాలో నిర్భయంగా, నిశ్చింతగా, సౌకర్యంగా కూర్చోడానికీ జాగ్రత్త పాటించాలి. ఎందుకంటే పోస్టీరియర్ పద్ధతిలో కీలు మార్పిడి తర్వాత... ప్రతి కదలికలోనూ కీలు తన స్థానం నుంచి తొలగి పోయేందుకు (డిస్‌లొకేషన్‌కు) అవకాశం ఉంటుంది. పోస్టీరియర్‌లో గాయం తగ్గేందుకు ఆర్నెల్లు పట్టడం, ప్రతి కదలికలోనూ జాగ్రత్త వహించాల్సిరావడం, డిస్‌లొకేషన్ రిస్క్ ఉండటంతో చికిత్స తర్వాతా నిశ్చింతగా ఉండటం సాధ్యం కాదు. ఇది క్వాలిటీ ఆఫ్ లైఫ్‌పై ప్రభావం చూపుతుంది.





ప్రశ్న : మరి యాంటీరియర్‌తో ప్రయోజనం ఏమిటి?

నితీశ్ భాన్ : ఇంతకుమునుపు చెప్పుకున్న ప్రతి బంధకాలేమీ ఉండవు. పాటించాల్సిన ఆంక్షలు ఒక్కటి కూడా ఉండవు. అంటే జీరో రిస్ట్రిక్షన్స్ అన్నమాట. ఎందుకంటే.... యాంటీరియర్ శస్త్రచికిత్సలో చిన్న గాటు తప్ప పెద్ద లేదా కీలకమైన కండరాలు వేటినీ కోయనక్కర్లేదు. దీంతో కండరాలు దెబ్బతినడం చాలా చాలా తక్కువ (లెస్ టిష్యూ డ్యామేజ్); కోలుకునే వేగమూ చాలా ఎక్కువ. అక్కడ కోత గాయం మానడానికి ఆర్నెల్లు పడితే, ఇక్కడ కేవలం 10, 12 రోజులు చాలు. నేను చేసిన కొన్ని శస్త్రచికిత్సల్లో రెండో రోజే పరుగెత్తడం, కొన్ని రోజుల వ్యవధిలోనే వాహనాలు నడపడం జరిగింది. వైద్య గణాంకాల ప్రకారం... యాంటీరియర్‌లో ఇలాంటి డిస్‌లొకేషన్‌కు అవకాశాలు కేవలం 1 శాతం లోపే. ఆస్ట్రేలియన్ జాయింట్ రిజిస్ట్రీ ప్రకారం పోస్టీరియర్ పద్ధతిలో డిస్‌లొకేషన్ రిస్క్ 21.1 శాతం కాగా... యాంటీరియర్‌లో ఇది కేవలం ఒక శాతం కంటే కూడా తక్కువే. ఇవి ప్రపంచవ్యాప్తంగా ఉన్న గణాంకాలైతే, ఇప్పటివరకు నేను నిర్వహించిన దాదాపు 450 పైగా సర్జరీల్లో హిప్ డిస్‌లొకేషన్ అయిన కేసు, ఫెయిలైన కేసు ఒక్కటి కూడా లేనే లేదు.

ప్రశ్న : ఈ యాంటీరియర్ హిప్ రీ-ప్లేస్‌మెంట్ సర్జరీకి ఫీజులెలా ఉంటాయి?

నితీశ్ భాన్ : హిప్ రీప్లేస్‌మెంట్‌లో ఏ రకమైనా ఒకేలాంటి ఫీజు ఉంటుంది. అయితే శస్త్రచికిత్స తర్వాత రీప్లేస్‌మెంట్ కోసం ఉపయోగించే కృత్రిమ కీలు (ప్రోస్థటిక్ జాయింట్)కే వేర్వేరు ధరలుంటాయి.



డాక్టర్ నితీశ్ భాన్
సీనియర్ ఆర్థోపెడిక్ అండ్ నీ & హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్

ప్రశ్న : మరి అందరూ యాంటీరియర్ పద్ధతిలోనే చేయవచ్చుగా?

నితీశ్ భాన్ : ఇది సాంకేతికంగా, సునిశితత్వం పరంగా చాలా ఎక్కువ నైపుణ్యాలు అవసరమైన శస్త్రచికిత్స. దీనికి చాలా నేర్పు కావాలి. సర్జరీ నిర్వహణను ఒక గ్రాఫ్‌లా గీస్తే సునిశితత్వం, నేర్పూ, నైపుణ్యాలూ ఇవన్నీ ఒక నిటారైన గీతలా ఉంటాయి. అంటే... యాంటీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో అంత సంక్లిష్టత ఉంటుందన్నమాట. అందుకే దాదాపు ఈ పద్ధతిలో శస్త్రచికిత్స చేసేవారిలో పన్నెండేళ్ల కిందట దేశంలో ఆరేడుగురి కంటే ఎక్కువ లేరు. ఇప్పటికీ నా అంచనా ప్రకారం మహా అయితే తొమ్మిది మది ఉండి ఉంటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నేనే సీనియర్. అంతెందుకు విదేశాల నుంచి కూడా వచ్చి... ముంబైలో కుదరకపోవడంతో... అక్కడున్నవారితో వాకబు చేసుకుని... అక్కడ్నుంచి ఇక్కడికి వస్తుంటారు.



మెడి టిప్

తల వెంట్రుకల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే...

ఒక వయసు దాటాక తెల్లబడ్డ వెంట్రుకలకు రంగువేయడం చూస్తుంటాం. ఇక యువతులూ, కొందరు మహిళలు కూడా స్ట్రెయిటెన్, బ్లీచింగ్ చేసుకోవడం వంటివి చేస్తున్నారు. ఈ ప్రక్రియల్లో జుట్టు (హెయిర్ స్ట్రాండ్స్) దెబ్బ తినకుండా సంరక్షించుకోడానికి చేయాల్సిన పనులివి...

- మాటిమాటికీ దువ్వడం, దువ్వుతున్నప్పుడు చిక్కులున్నచోట మృదువుగా కాకుండా బలంగా దువ్వడం, జుట్టు తడిగా ఉన్నప్పుడే దువ్వడం వల్ల వెంట్రుకలు దెబ్బతింటాయి. ఇలా దెబ్బతిన్నప్పుడు వెంట్రుక సాఫీగా లేకుండా కొన్నిచోట్ల ఉబ్బుగానూ, మరోచోట పలచగానూ కనిపించవచ్చు. ఇలా కనిపించే వెంట్రుకల్ని 'బబుల్డ్ హెయిర్' అంటారు. కాబట్టి వెంట్రుకలపై బలం ఉపయోగించకుండా, మృదువుగా దువ్వేలా జాగ్రత్త వహించాలి
- షాంపూ వాడే సమయంలో దాన్ని నేరుగా వాడకుండా... అరచేతిలో వేసుకుని, కొన్ని నీళ్లు కలిపి, దాని సాంద్రతను కాస్త తగ్గించాలి. దీంతో వెంట్రుకల మీద షాంపూలోని రసాయనాల తాకిడి, ప్రభావం తగ్గుతాయి
- తలస్నానం తర్వాత డ్రైయర్ వాడేటప్పుడు వెంట్రుకలకు వేడి గాలి మరీ నేరుగా తగలకుండా జాగ్రత్త వహించాలి
- రంగువేయడం, బ్లీచింగ్‌లతో జుట్టు రసాయనాలకు ఎక్స్‌పోజ్ అవుతుంది. దాంతో వెంట్రుక పైపొర అయిన 'క్యూటికిల్' దెబ్బతినే అవకాశముంది. క్యూటికిల్ దెబ్బతినగానే కాస్త లోపల ఉండే కార్టెక్స్ అనే భాగం బయటపడుతుంది. ఇది క్యూటికిల్‌లా నునుపుగా కాకుండా కాస్తంత గరుకుగా ఉంటుంది. ఫలితంగా జుట్టు నిర్జీవంగా, గజిబిజిగా కనిపిస్తుంటుంది. అందుకే రంగువేసే సమయంలో నాణ్యమైన హెయిర్-డై వాడుకోవాలి. ఒకసారి తమకు సరిపడుతుందా లేదా అన్నదీ చూసుకోవాలి.

హుక్ వార్మ్ ఇన్ఫెక్షన్‌తో ముప్పు ఇది..!

హుక్ వార్మ్ అనే పరాన్నజీవి ప్రధానంగా చిన్నపేగుల్లో ఉంటుంది. మనం తీసుకునే ఆహారాన్ని అది సంగ్రహిస్తూ ఉండటం వల్ల నీరసం, నిస్సత్తువ, పోషకాల లోపంతో పాటు ప్రధానంగా ఐరన్ లోపం కనిపిస్తుంది. చాలామందిలో ఇది ప్రధానంగా చిన్నపేగులనే ఆశ్రయించినా కొందరిలో మాత్రం ఊపిరితిత్తులు, చర్మం వంటి ఇతర అవయవాలపైనా ప్రభావం చూపవచ్చు. పొలాలకు వెళ్లే పెద్దలూ, మట్టిలో ఆడుకునే పిల్లల్లో ఇది ఎక్కువ. ఈ ఇన్ఫెక్షన్ గురించి అవగాహన కోసం ఈ కథనం.

హుక్‌వార్మ్ ఇన్ఫెక్షన్ అనేది పొలాల్లో నడిచేవారిలో... అది కూడా చెప్పులు, పాదరక్షలు లేకుండా నడిచేవారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇప్పటికీ కొన్ని మారుమూల పల్లెల్లో ఆరుబయలు మలవిసర్జన చేసే అలవాటు ఉంటుంది. మలంతో పాటు విసర్జితమైన హుక్‌వార్మ్ గుడ్లు ఏదో రూపంలో మనుషుల నోటి ద్వారా మళ్లీ లోనికి ప్రవేశించడం అన్నది దీని జీవితచక్రం (లైఫ్‌సైకిల్)లో భాగం. నేల /మట్టి ద్వారా ఇన్ఫెక్షన్ వస్తుంటుంది కాబట్టి దీన్ని 'సాయిల్ ట్రాన్స్‌మిటెడ్ హెల్మింథిస్' అంటారు. మనుషులు నేల మీద నడవక తప్పదు కాబట్టి దీని విస్తృతి ఎంతంటే... ప్రపంచవ్యాప్త జనాభాలో దాదాపు 10% మందిలో ఈ ఇన్ఫెక్షన్ ఏదో ఒక దశలో వచ్చే ఉంటుందనేది ఒక అంచనా.



డాక్టర్ కె. శివరాజు
సీనియర్ ఫిజీషియన్

లక్షణాలు: ● కొద్దిపాటి నుంచి ఓ మోస్తరు జ్వరం ● పొట్టలో నొప్పి ● ఆకలి మందగించడం ● నీళ్ల విరేచనాలు ● బరువు తగ్గడం ● రక్తహీనత ● కొందరిలో దగ్గు / పిల్లికూతలు (ఊపిరితిత్తులు ప్రభావితమైనప్పుడు) ● చర్మంపై ర్యాష్ (చర్మం ప్రభావితమైనప్పుడు).

ఇదీ ముప్పు... తీసుకున్న ఆహారం, దాంతో సమకూరే శక్తి, సారం అంతా హుక్‌వార్మ్స్ గ్రహించడంతో తీవ్రమైన రక్తహీనత, పోషకాల లోపం, ప్రోటీన్స్ లోపం వంటి పరిణామాలతో తలతిరగడం, తీవ్రమైన అలసట, కండరాలు పట్టేయడం, ఊపిరి అందకపోవడం, ఛాతీలో నొప్పి వంటి అనేక పరిణామాలు తరచూ చోటు చేసుకుంటూ ఉంటాయి. దాంతో క్రమంగా భౌతికంగా, మానసికంగా బలహీనమయ్యే అవకాశం ఉంది.

నిర్ధారణ: మల, రక్త (సీబీపీ) పరీక్షలతో నిర్ధారణ చేయవచ్చు. రక్తపరీక్షలో ఈసినోఫిలియా (తెల్లరక్తకణాల్లో ఒక రకం) కౌంట్ నార్మల్ కంటే ఎక్కువగా ఉంటుంది. అలాగే మల పరీక్షలో హుక్‌వార్మ్ గుడ్లు కనిపిస్తాయి.

నివారణ: ● కాచివడబోసిన నీళ్లు తాగాలి. వేడిగా ఉన్నప్పుడే ఆహారం తినేయాలి ● తినేముందు చేతులు కడుక్కవాలి ● ఆరుబయట మలవిసర్జనను పూర్తిగా నిలిపివేయాలి. (పల్లెల్లో సైతం ఇది జరగాలి) ● మల విసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి ● పెద్దలు పొలాల్లో తిరిగి వచ్చాక, పిల్లలు మట్టిలో ఆడుకున్న తర్వాత చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కోవాలి ● పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా డీ-వార్మింగ్ చేయిస్తుండాలి.



చికిత్స: కాళ్లకు లేదా ఒంటి మీద ఎక్కడైనా ర్యాష్ కనిపించినా, లేదా ఆకలి /బరువు తగ్గినట్లుగా ఉన్నా, తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ ఉన్నా డాక్టర్‌ను సంప్రదించాలి. అవసరమైన పరీక్షల తర్వాత వ్యాధి నిర్ధారణ జరిపాక వారు మిబెండిజోల్, ఆల్బెండిజోల్ వంటి మందుల్ని సూచిస్తారు.

స్పోర్ట్స్



మూడో వన్డేలోను పాకిస్తాన్‌దే విజయం

అఫ్గనిస్తాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్తాన్ 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం కొలంబోలో జరిగిన చివరి మ్యాచ్‌లో పాక్ 59 పరుగుల తేడాతో అఫ్గనిస్తాన్‌ను ఓడించింది. ముందుగా పాకిస్తాన్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ రిజ్వాన్ (67), కెప్టెన్ బాబర్ ఆజమ్ (60) అర్ధ సెంచరీలు సాధించగా, ఆగా సల్మాన్ (38 నాటౌట్), నవాజ్ (30) రాణించారు. నైబ్, ఫరీద్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం అఫ్గన్ జట్టు 48.4 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. ముజీబ్ ఉర్ రహమాన్ (64) హాఫ్ సెంచరీ చేయగా, షాహిదుల్లా (37), రియాజ్ హసన్ (34) మాత్రమే కొద్దిగా పోరాడారు. పాక్ బౌలర్లలో షాదాబ్ ఖాన్ 3 వికెట్లు పడగొట్టాడు.

నోవా లైల్స్ 'డబుల్'



- 200 మీటర్ల పరుగులో స్వర్ణం సాధించిన అమెరికా అథ్లెట్
- మహిళల విజేత షెరికా జాక్సన్
- ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

బుడాపెస్ట్ (హంగేరీ): అమెరికా అథ్లెట్ నోవా లైల్స్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 'డబుల్' సాధించాడు. ఈ మెగా ఈవెంట్‌లో ఇప్పటికే 100 మీటర్ల స్ప్రింట్‌లో విజేతగా నిలిచిన అతను ఇప్పుడు 200 మీటర్ల పరుగులో కూడా అగ్రస్థానాన్ని అందుకున్నాడు. అంచనాలకు తగినట్లుగానే సత్తా చాటిన లైల్స్ 19.52 సెకన్లలో పరుగు పూర్తి చేసి పసిడి పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ ఈవెంట్‌లో ఎరియోన్ నైటాన్ (అమెరికా – 19.75 సెకన్లు) రజతం సాధించగా, లెట్సిలో టెబొగో (బోట్స్‌వానా – 19.81 సెకన్లు) కాంస్యం గెలుచుకున్నాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ 200 మీటర్ల పరుగులో లైల్స్‌కు ఇది వరుసగా మూడో స్వర్ణం కావడం విశేషం. గత ఏడాది ఒరెగాన్‌లో జరిగిన పోటీల్లోనూ అతను బంగారు పతకం సాధించాడు. తద్వారా బోల్ట్ తర్వాత ఒకే ఈవెంట్‌లో వరుసగా కనీసం మూడు స్వర్ణాలు గెలిచిన రెండో అథ్లెట్‌గా లైల్స్ నిలిచాడు. 4x100 మీటర్ల రిలేలో అమెరికా జట్టు ఫైనల్ చేరింది. ఇందులో కూడా భాగంగా నిలిచి విజయం సాధిస్తే లైల్స్ ఖాతాలో మూడో స్వర్ణం చేరుతుంది.

ప్రపంచ రికార్డుకు చేరువై...

100 మీటర్ల స్ప్రింట్‌లో రజతం సాధించిన షెరికా 200 మీటర్ల ఈవెంట్‌లో తన పరుగుకు మరింత పదును పెట్టింది. ఈ జమైకా అథ్లెట్ 200 మీటర్ల పరుగులో రెండో అత్యుత్తమ టైమింగ్‌ను నమోదు చేస్తూ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. 21.41 సెకన్లలో షెరికా పరుగులు పూర్తి చేసింది. గాబ్రియెల్ థామస్ (అమెరికా – 21.18 సెకన్లు), షకారి రిచర్డ్సన్ (అమెరికా – 21.92 సెకన్లు)లకు వరుసగా రజత, కాంస్యాలు దక్కాయి. ప్రపంచ రికార్డు ఇప్పటికీ అమెరికాకు చెందిన ఫ్లోరెన్స్ గ్రిఫిత్ జాయ్‌నర్ (21.34 సెకన్లు) పేరిటే ఉంది. 1988లో ఆమె ఈ టైమింగ్‌ను నమోదు చేసింది. గత ఏడాది కూడా ఈ ఈవెంట్‌లో షెరికా స్వర్ణం సాధించింది.



ఆసియా రికార్డుతో ఫైనల్లోకి

భారత 4x400 రిలే బృందం ప్రదర్శన



ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత 4x400 మీటర్ల రిలే బృందం అద్భుత ప్రదర్శనతో సత్తా చాటింది. ఆసియా రికార్డుతో ఫైనల్‌కు అర్హత సాధించింది. తొలి హీట్‌లో మన జట్టు రెండో స్థానంలో నిలిచింది. మొహమ్మద్ అనస్ యాహియా, అమోజ్ జాకబ్, మొహమ్మద్ అజ్మల్ వరియత్తోడి, రాజేశ్ రమేశ్ భాగంగా ఉన్న భారత్ ఈ రేసును 2 నిమిషాల 59.05 సెకన్లలో పూర్తి చేసింది. ఇది కొత్త ఆసియా రికార్డు కావడం విశేషం. ఈ హీట్స్‌లో అమెరికా జట్టు మొదటి స్థానంలో నిలవగా, గ్రేట్ బ్రిటన్ టీమ్‌కు మూడో స్థానం దక్కింది. నేడు ఫైనల్ రేస్ జరుగుతుంది.

పాకిస్తాన్‌కు బీసీసీఐ అధ్యక్షుడు

ఆసియా కప్ కోసం పీసీబీ ఆహ్వానం

న్యూఢిల్లీ: క్రికెట్‌కు రెండు వైరి దేశాల బోర్డులకు సంబంధించి కీలక పరిణామం! ఆతిథ్య హోదాలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) లాహోర్‌లో ఏర్పాటు చేస్తున్న అధికారిక డిన్నర్‌కు హాజరయ్యేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అంగీకరించింది. భారత బోర్డు తరఫున అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ కార్యక్రమానికి హాజరవుతారు. ఆసియా కప్ కార్యక్రమంలో టోర్నీలో పాల్గొంటున్న అన్ని జట్ల బోర్డులకు ఆహ్వానం పంపారు. ఇందులో భాగంగా పీసీబీ అధ్యక్షుడు జకా అష్రఫ్ బీసీసీఐని కూడా ఇందులో భాగం కావాలని కోరారు. సెప్టెంబర్ 2న పల్లెకెలెలో భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన తర్వాత బోర్డు ప్రతినిధులు పాకిస్తాన్‌కు వెళతారు. బిన్నీ, శుక్లా వాఘా బోర్డర్ ద్వారా పాక్‌లోకి అడుగు పెడతారని సమాచారం. ఆసియా కప్‌కు పేరుకే పాకిస్తాన్ ఆతిథ్యం ఇస్తున్నా...ఇరు జట్ల ప్రస్తుతం నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్ ఆ దేశంలో ఆడేందుకు నిరాకరించింది. దాంతో హైబ్రీడ్ మోడల్‌లో టీమిండియా తమ మ్యాచ్‌లకు శ్రీలంక వేదికగా ఆడుతోంది. నిజానికి బీసీసీఐ కార్యదర్శి జై షా వెళ్లడంపై కూడా చర్చ జరిగినా...జై షా బోర్డు కార్యదర్శి మాత్రమే కాకుండా భారత హోం మంత్రి కుమారుడు కూడా కావడంతో ఈ ఆలోచనను పక్కన పెట్టినట్లు సమాచారం. అయితే ఆసియా సభ్యుల గౌరవార్థం ఇస్తున్న విందుకే ఈ పర్యటన పరిమితమని... ఇరు దేశాల బోర్డు మధ్య ఎలాంటి చర్చలు ఉండవని, ద్వైపాక్షిక సిరీస్‌ల విషయంలో యథాతథ స్థితి కొనసాగుతుందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.



ఫైనల్లో రాయలసీమ కింగ్స్

ఆంధ్ర ప్రీమియర్ లీగ్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో రాయలసీమ కింగ్స్ ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో కింగ్స్ 3 పరుగుల తేడాతో గోదావరి టైటాన్స్‌పై విజయం సాధించింది. ముందుగా రాయలసీమ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 218 పరుగుల భారీ స్కోరు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోగటం రెడ్డి (47 బంతుల్లో 92; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, గిరినాథ్ రెడ్డి (20 బంతుల్లో 43; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), వంశీ కృష్ణ (34 బంతుల్లో 43; 3 ఫోర్లు, 1 సిక్స్) అండగా నిలిచారు. అనంతరం గోదావరి టీమ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 215 పరుగులు చేసి పోరాడి ఓడింది. భూపతి రాజు వర్మ (40 బంతుల్లో 89; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటిచేత్తో జట్టును గెలిపించే ప్రయత్నం చేయగా, ఇతర ఆటగాళ్లనుంచి సహకారం లభించలేదు. నేడు జరిగే ఫైనల్లో కోస్టల్ రైడర్స్‌తో రాయలసీమ కింగ్స్ తలపడుతుంది. ముగింపు కార్యక్రమానికి బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, మాజీ కెప్టెన్ కె.శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

కాంస్యంతో సరి

- సెమీస్‌లో పోరాడి ఓడిన ప్రణయ్
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

కోపెన్‌హాగెన్ (డెన్మార్క్): అసాధారణ ఆటగాడు అక్సెల్‌సన్‌కు సొంతగడ్డపైనే చుక్కలు చూపించిన భారత షట్లర్ హెచ్‌.ఎస్‌.ప్రణయ్ పోరు సెమీ ఫైనల్లో ముగిసింది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఈ కేరళ స్టార్ కాంస్యంతోనే సరిపెట్టుకున్నాడు. క్వార్టర్స్‌లో తొలి గేమ్ కోల్పోయినప్పటికీ వరుస గేమ్‌లను గెలిచి పతకం ఖాయం చేసుకున్న భారత ఆటగాడు చిత్రంగా సెమీస్‌లో తొలి గేమ్ గెలిచి జోరు మీదుండి తర్వాత రెండు గేమ్‌లను గెలువలేక మ్యాచ్ ఓడిపోయాడు. శనివారం 76 నిమిషాల పాటు సాగిన పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్లో హెచ్‌.ఎస్‌. ప్రణయ్ 21–18, 13–21, 14–21తో కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం చవిచూశాడు. తొలి గేమ్‌లో తెలివైన షాట్లతో ప్రత్యర్థిని కోర్టులో పరుగు పెట్టిస్తూ స్కోరు సాధించాడు. నెట్‌వద్ద చురుగ్గా పాయింట్లు సాధించిన ప్రణయ్ స్మాష్‌లతో చెలరేగి... తొలి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. తర్వాత రెండో గేమ్ కూడా ప్రణయ్ ఆధిపత్యంతోనే మొదలైంది. వరుసగా 4–0తో పైచేయి సాధించాడు. ఈ దశలో చేసిన అనవసర తప్పిదాలతో భారత షట్లర్ పాయింట్లను కోల్పోయాడు. పదే పదే ఇవే తప్పిదాలు కొనసాగించడంతో ఆధిక్యాన్ని, ఆపై గేమ్‌నే కోల్పోయాడు. నిర్ణాయక మూడో గేమ్‌లోనూ ప్రణయ్ తప్పిదాలనే ఆసరాగా చేసుకొని పుంజుకున్న థాయ్ ప్రత్యర్థి చివరిదాకా ఆధిపత్యాన్ని కొనసాగించాడు.



భారత మహిళలకు స్వర్ణం



బర్మింగ్‌హామ్: అంధుల క్రికెట్‌లో భారత మహిళల జట్టు సత్తా చాటి విజేతగా నిలిచింది. ఇంటర్నేషనల్ బ్లైండ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐబీఎస్‌ఏ) నిర్వహిస్తున్న వరల్డ్ గేమ్స్ క్రికెట్‌లో భారత్ స్వర్ణం సొంతం చేసుకుంది. ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్లో భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 8 వికెట్లకు 114 పరుగులు చేయగా...వర్షం కారణంగా లక్ష్యాన్ని 9 ఓవర్లలో 42 పరుగులకు కుదించగా భారత్ 3.3 ఓవర్లలో విజయాన్ని అందుకుంది.

అంకిత పరాజయం



న్యూయార్క్: భారత టాప్ టెన్నిస్ క్రీడాకారిణి అంకితా రైనా ఈ ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించడంలో విఫలమైంది. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లలో తొలి రెండు నెగ్గిన అంకిత మూడో క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో అంకిత వరుస సెట్లలో 2–6, 2–6 స్కోరుతో మిర్జమ్ జొర్క్లండ్ (స్వీడన్) చేతిలో పరాజయంపాలైంది. 1 గంటా 37 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 154వ ర్యాంకర్ అంకిత తన ప్రత్యర్థి ముందు నిలవలేకపోయింది. జొర్క్లండ్ 3 ఏస్‌లు సంధించగా, అంకిత ఒకే ఒక ఏస్ కొట్టింది.

జీపీ బ్యాడ్మింటన్ లీగ్ వాయిదా

బెంగళూరు: గ్రాండ్‌ప్రి బ్యాడ్మింటన్ లీగ్ (జీపీబీఎల్) రెండో సీజన్ నిరవధికంగా వాయిదా పడింది. గతేడాది విజయవంతమైన ఈ లీగ్‌కు ఈసారి భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) నుంచి అభ్యంతరం వ్యక్తమవడం, కోర్టు వివాదాలతో పలువురు షట్లర్లు తప్పుకోవడంతో వాయిదా వేస్తున్నట్లు లీగ్ కమిషనర్ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. కర్ణాటక హైకోర్టు నుంచి లీగ్ నిర్వహణకు అనుకూల తీర్పే వచ్చినప్పటికీ... తమ గుర్తింపులేని లీగ్, టోర్నీల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని 'బాయ్' హెచ్చరించడంతో స్టార్ షట్లర్లు భమిడిపాటి సాయిప్రణీత్, మిథున్ మంజునాథ్ తదితరులు వేలం తర్వాత తప్పుకున్నారు. దీంతో నిర్వాహకులు నిరవధిక వాయిదా వేయక తప్పలేదు. తొలి సీజన్‌లో కేజీఎఫ్ వోల్వ్స్ విజేతగా నిలిచింది.

వెర్‌స్టాపెన్‌కే పోల్



జండ్‌పూర్ట్ (నెదర్లాండ్స్): ఈ ఎఫ్1 సీజన్‌లో జోరు మీదున్న రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్‌కే మరో పోల్ పొజిషన్ దక్కింది. శనివారం జరిగిన డచ్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ రేసులో ల్యాపును అందరికంటే ముందుగా 1 నిమిషం 10.567 సెకన్లలో పూర్తి చేసిన వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్ లభించింది. ఈ సర్క్యూట్‌పై అతనికిది వరుసగా మూడో పోల్ పొజిషన్ కావడం విశేషం. ఆదివారం ప్రధాన రేసు జరుగుతుంది. డిఫెండింగ్ ఫార్ములావన్ చాంపియన్ వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో 11వ టైటిల్‌పై కన్నేశాడు. మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ (1ని.11.104 సెకన్లు) రెండో స్థానంలో నిలిచాడు.

సినిమా



తగ్గేదే లే.. ఆపేదేలే.. అనుకున్నా..!

- అల్లు అర్జున్

"ఒకరు అదే పనిగా మనల్ని విమర్శిస్తున్నారంటే మనం ఎదిగినట్లే... బయటకు చెప్పలేం... చాలా అవమానాలుంటాయి.. నాది అత్యాస.. నాకు అన్నీ కావాలి... నేషనల్ బెస్ట్ హీరో అని ఊరికే ఇచ్చేయరు"... ఇంకా ఇలాంటి ఆసక్తికరమైన విషయాలను 'సాక్షి'తో ప్రత్యేకంగా పంచుకున్నారు అల్లు అర్జున్. 'జాతీయ ఉత్తమ నటుడు' అవార్డు దక్కించుకున్న ఆనందంలో ఉన్న అల్లు అర్జున్‌తో శనివారం జరిపిన ఇంటర్వ్యూలోని విశేషాలు ఈ విధంగా...

జాతీయ ఉత్తమ నటుడి ప్రకటన రాగానే మీ రియాక్షన్?

అల్లు అర్జున్: ఇంగ్లీష్‌లో ఎలైటెడ్ (ఉక్కిరి బిక్కిరి.. పట్టరానంత ఆనందం...) అంటారు. నా ఫీలింగ్ అదే. అయితే ఈ అవార్డు నాకు వచ్చింది నా వల్ల కాదు. సుకుమార్ వల్ల వచ్చిందన్నది నా ఫస్ట్ ఫీలింగ్. అవార్డు ప్రకటన రాగానే నేను, సుకుమార్ ఆప్యాయంగా హత్తుకుని, ఆ ఉద్విగ్న క్షణాల్లో అలా ఓ నిమిషానికి పైగా ఉండిపోయాం. మైత్రీ మూవీ మేకర్స్ కాకుండా 'పుష్ప'ని ఎవరు తీసినా ఈ సినిమా ఇంత బాగా వచ్చి ఉండేది కాదు. నాతో 'పుష్ప' తీశారని అలా అనడంలేదు. 'రంగస్థలం' చూసినప్పుడే 'మైత్రీ సపోర్ట్ చేసింది కాబట్టే నువ్వు అనుకున్న సినిమా తీయగలిగావు. ఈ సినిమాని వేరే ఏ బేనర్‌తో చేసినా తీయలేకపోయేవాడివి' అని సుకుమార్‌తో అన్నాను. 'పుష్ప'కి కూడా ఇదే వర్తిస్తుంది.

ఈ తరంలో తెలుగులో ఉన్న 'బెస్ట్ యాక్టర్స్'లో మీరు ఒకరు. ముందు తరాల్లో ఎందరో 'బెస్ట్ యాక్టర్స్' ఉన్నారు. వారికి ఉత్తమ జాతీయ నటుడు అవార్డు లభించలేదు. ఈ విషయంపై మీ అభిప్రాయం..

నాకు అవార్డు వచ్చినందుకు ఎంత హ్యాపీగా ఉందో.. ముందు తరాల వారికీ, నా సమకాలీన నటులకు అవార్డు రాలేదన్నది అంతే బాధాకరమైన విషయం. వారంతా అర్హులే. జాతీయ అవార్డు దక్కించుకునే స్థాయి నటనను అందరూ ప్రదర్శించారు. కానీ ఎందుకో వారికి రాలేదు. సామర్థ్యం లేక వారికి అవార్డులు రాలేదనుకుంటే అది మన తెలివితక్కువతనమే. మన పరిశ్రమలో ఎప్పుడూ గొప్ప నటులు ఉంటూనే ఉన్నారు. కానీ ఎందుకో కుదర్లేదు.. ఈసారి కుదిరింది.

అంటే.. కాస్త అదృష్టం కూడా కలిసి రావాలంటారా?

అదృష్టాన్ని నమ్మును. మన కృషి మనం చేస్తూ ఉంటే సరైన చాన్స్, టైమ్ వచ్చినప్పుడు కొడితే ఆ పాయింట్‌ను అదృష్టం అంటా. మంచి పెర్ఫార్మెన్స్ ఇచ్చే విషయంలో నేను ఎప్పుడూ కృషి చేస్తూనే ఉన్నాను. ఇక ఇప్పుడు తెలుగు సినిమాలకు దేశవ్యాప్త గుర్తింపు దక్కడం, తెలుగు సినిమాలపై అందరి దృష్టి పడటం అనేది అవకాశం. సో... నా కృషికి చాన్స్, టైమ్ కలిసి స్ట్రైక్ అయ్యాయి. ఇది లక్ అంటాను.

మీ 20 ఏళ్ల సక్సెస్‌ఫుల్ కెరీర్‌లో మీ కుటుంబం, అభిమానుల, ఇండస్ట్రీ భాగస్వామ్యం ఎంత..

నా సక్సెస్‌లో అందరి సపోర్ట్ ఉంది. ఏ సపోర్ట్ లేదని అనలేను. నా ఫ్యామిలీ, ఇండస్ట్రీ సపోర్ట్ ఉంది. ఎక్కువ శాతం ఉన్న నా సొంత ఫ్యాన్స్ సపోర్ట్‌తో పాటు మెగా ఫ్యాన్స్, ఇతర హీరోల ఫ్యాన్స్ ప్రోత్సాహం కూడా ఉంది.

మీ కెరీర్ ఫస్ట్ మొదలైంది మెగా ఫ్యాన్స్ సపోర్ట్‌తోనే. ఆ తర్వాత మీకు సొంత ఆర్మీ (అభిమానులు) ఏర్పాటైంది. ఇలా ఓన్ ఫ్యాన్ బేస్ డెవలప్ అయ్యాక పాజిటివిటీతో పాటు నెగటివిటీ కూడా వచ్చింది. ఈ విషయాన్ని ఎలా చూస్తారు..

నేనే కాదు.. ప్రపంచంలో ఉన్న ఏ వ్యక్తి అయినా ఒక చోటు నుంచి మొదలై, జీవితంలో ఎదిగే క్రమంలో కొంత టైమ్ గడిచాక తనకంటూ ఓ డెవలప్‌మెంట్ జరుగుతుంది. అది సహజం.. ఇందుకు ఉదాహరణగా చాలామంది ఉన్నారు. కొన్నిసార్లు పిల్లలు తమ తల్లిదండ్రుల కన్నా ఉన్నత స్థాయికి చేరుకుంటారు. ఇదొక సహజమైన ప్రయాణం.

కానీ ఎక్కడ మొదలయ్యారో ఆ నీడలో ఉండాలని వేరేవాళ్లు అనుకోవడం సహజంగా జరుగుతుంటుంది..

నేనేమనుకుంటానంటే.. ఒకరు విశేషంగా ఎదుగుతూ, ఓ లెవల్‌కి వచ్చాక.. వారు మన దగ్గర ఉండలేరని వారికే అర్థం అయిపోతుంది.. వాళ్లు ఇక్కడ సరిపోరని. అది పేరెంట్స్ అయినా కావొచ్చు.. ఫ్యామిలీలో ఎవరైనా కావొచ్చు. అయితే వాళ్లు ఎప్పుడు కోరుకుంటారంటే.. వాళ్లకంటే తక్కువగా ఉన్నప్పుడో.. ఇప్పుడు వాళ్లు ఎంత ఉన్నారో.. మనం అంతే ఉన్నప్పుడు ఎందుకు బయటకు వెళ్లాలని కోరుకుంటారు. అదే మనం 'టెన్ ఎక్స్' ఎదిగాం అనుకుంటే అప్పుడు వాళ్లు కోరుకోరు. ఇదంతా సైజ్ డిఫరెన్స్‌పై ఆధారపడి ఉంటుంది.

'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' సినిమా తర్వాత మీరు కొంత గ్యాప్ తీసుకున్నారు. ఆ తర్వాత మీరు చేసిన 'అల.. వైకుంఠపురములో..., పుష్ప' హిట్. ఆ గ్యాప్‌లో మిమ్మల్ని మీరు తెలుసుకోవడమే ఈ హిట్స్‌కి కారణమా..

నా గురించి నేను వంద శాతం తెలుసుకోవడానికి ఆ సమయం నాకు దొరికినట్లయింది. నేను ఏం తప్పులు చేశాను? ఎటు వెళ్తున్నాను అని ఆలోచించుకున్నాను. కొందరు సలహాలు ఇచ్చారు. చెప్పాలంటే నన్ను నేను సరిద్దుకున్న సమయం అది. అలా నన్ను నేను సరిదిద్దుకుని ఇకనుంచి తగ్గేదే లే... ఆపేదేలే అనుకున్నాను.

చిరంజీవిగారి ఇంటికి వెళ్లారు కదా. ఆయన స్పందన..

చిరంజీవిగారు చాలా మంచి మాట అన్నారు. ఓ జాతీయ అవార్డు రావడానికి ఓ నటుడికి కావాల్సిన కారణాలు ఇరవై ఉంటే.. అన్ని కారణాల్లోనూ నువ్వు వంద మార్కులు కొడతావ్ అన్నారు. బాడీ లాంగ్వేజ్.. మేకప్ కావొచ్చు... సంభాషణల ఉచ్చారణ కావొచ్చు.. ఇలా కొన్ని చెప్పుకుంటూ వచ్చారు. చిరంజీవిగారికి ఉన్న అనుభవంతో ఓ విషయాన్ని ఆయన మనకన్నా బాగా చూడగలరు. బాగా పెర్ఫార్మ్ చేశావ్. చెప్పాలంటే.. నీకు ఇవ్వకపోతే తప్పయిపోయేది అనే స్థాయిలో పెర్ఫార్మ్ చేశావన్నారు.

మీ నాన్నగారు (నిర్మాత అల్లు అరవింద్) చాలా సంతోషపడి ఉంటారు. అలాగే మీ కుటుంబ సభ్యులు ఎలా స్పందించారు...

అవార్డు సాధించిన నాకన్నా.. మా నాన్నగారికి ఎక్కువ శుభాకాంక్షలు వచ్చాయి (నవ్వుతూ). మా అమ్మ అయితే ఆనందంతో మాట్లాడలేకపోయారు. అమ్మ హగ్‌లోనే ఆమె సంతోషం అర్థమైపోయింది. అలాగే నా సినిమా గురించి మా ఆవిడ (స్నేహ) ఎప్పుడూ భావోద్వేగానికి లోనవ్వదు. కానీ తొలిసారి ఎమోషన్‌కి గురై, నన్ను హత్తుకుంది.



తల్లి నిర్మలతో...

ఏదైనా మనకు దక్కినప్పుడు అందుకు మనం నిజంగా అర్హులమేనా? అనే ఓ ఆలోచన కలగడం సహజం. నేషనల్ అవార్డు ప్రకటించినప్పుడు అలాంటి ఆలోచన మీకేమైనా కలిగిందా?

జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు సాధించారు. ఇక వాట్ నెక్స్ట్ అనే ప్రెజర్ ఏమైనా?

దేశవ్యాప్తంగా సినిమా పెరుగుతోంది. తెలుగు సినిమా మరింతగా ప్రగతి పథంలో ముందుకు వెళుతోంది. ఇప్పుడు మనం ఏ ప్రయోగాలు చేసినా రిసీవ్ చేసుకోవడానికి ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారు. ఇది ప్రెజర్ కాదు.. పెద్ద అడ్వాంటేజ్ అని చెప్పవచ్చు. చెప్పాలంటే ఎవరికైనా ప్రెజర్ లేదూ అంటే అది మనకే. తెలుగు పరిశ్రమతో పోటీపడాలని ఇతర ఇండస్ట్రీలు ఒత్తిడికి గురవుతున్నాయి.

నేనూ సుకుమార్‌గారు ఎప్పుడూ నిజం అనేది ఒకటి ఉంటుందని మాట్లాడుకుంటుంటాం. మేం నిజాయితీగా కష్టపడ్డాం. ఆ కష్టం ప్రజలకు కనెక్ట్ అయ్యింది. ఇది నిజం. ఒక సినిమా బాగుందా? లేదా అనేది నిజం మాట్లాడుతుంది. బాగోలేని సినిమాను నేను ఎంత ప్రమోట్ చేసినా వర్కౌట్ కాదు. కానీ మనం నిజాయితీగా కష్టపడ్డప్పుడు ఆ కష్టమే మాట్లాడుతుంది. అది నిజం. అప్పుడు నిజం దానంతట అదే మాట్లాడుతుంది. ఒకవేళ నేను సినిమాలో బాగా యాక్ట్ చేసి, నేనే బాగోలేదని చెప్పినా కూడా నా మాట ఎవరూ నమ్మరు. ఎందుకంటే నిజం నాకంటే గొప్పది.. నన్ను మించినది అనేది నా అభిప్రాయం.

తెలుగు సినిమాకు ఈ ఏడాది ఎక్కువగా జాతీయ అవార్డులు వచ్చాయి... ఈ విషయం గురించి ఏమంటారు?

ఈ గౌరవం దక్కడానికి 'ఆర్ఆర్ఆర్' సినిమాను ముఖ్య కారణంగా చెప్పుకోవాలి.. 'పుష్ప' కూడా. 'ఆర్ఆర్ఆర్'కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. దీంతో జాతీయ స్థాయిలో 'ఆర్ఆర్ఆర్'ను గౌరవించుకోకపోతే అది తప్పవుతుందనే ఓ ప్రత్యేక ఫీలింగ్ ఆ సినిమాపై ఉంది. ఏదో ఆస్కార్స్‌కు వెళ్లింది కదా అని కాకుండా నిజంగా ఆ సినిమాకు సంబంధించి ఎవరెవరికి రావాలో వారికి ఇచ్చారు. తెలుగు సినిమాకు ప్రాముఖ్యత చేకూర్చారు. అందుకు తగ్గ కష్టం కూడా ఆ సినిమాలు పడ్డాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా తెలుగు ఇండస్ట్రీ ప్రామిసింగ్‌గా ఉంది. ఈ ఇంపాక్ట్ వారిపై (జ్యూరీని ఉద్దేశిస్తూ..) కూడా ఉంటుంది.

ఈ సమయంలో మీ తాత (ప్రముఖ నటుడు అల్లు రామలింగయ్య)గారు ఉండి ఉంటే సంతోషించేవారు..

ఆయన జీవించి ఉన్నట్లయితే.. ఇన్నేళ్ల చరిత్రలో నా మనవడు కొట్టాడు. తన జీవితానికి ఇది చాలని ఆయన ఫీలయ్యే సందర్భం కచ్చితంగా అయ్యుండేది. ఆ విషయం పక్కన పెడితే... నేను నేషనల్ అవార్డుని సాధించడం మా నాన్నగారు చూడగలిగారు. నాకు అదే చాలా అదృష్టం.

'పుష్ప'లో నటనపరంగా తగ్గేదే లే అన్నట్లు నటించారు. 'ఆర్ఆర్ఆర్'లో ఎన్టీఆర్, రామ్‌చరణ్ అద్భుత నటనతో పాటు ఆ సినిమా ఆస్కార్‌తో గ్లోబల్‌గా రీచ్ అయింది. తమిళ 'జై భీమ్'లో సూర్య నటన అద్భుతం.. ఈ పెద్ద పోటీలో జాతీయ అవార్డు ఎవరికి దక్కుతుందనే కోణంలో ఆలోచించారా?

మనం సౌత్‌లో ఉన్నాం కాబట్టి ఈ రెండు సినిమాల గురించే మాట్లాడటం సహజం. అయితే పోటీలో హిందీ నుంచి 'షేర్షా, సర్దార్ ఉద్దమ్' వంటి చిత్రాలు ఉన్నాయి. ఇంకా వేరే భాషల నుంచి వేరే చిత్రాల్లో నటించిన హీరోలు ఉన్నారు. పోటీలో 20 మందికి పైగా ఉన్నారు. కానీ ఫైనల్‌గా నేషనల్ హీరో ఒక్కడే. ఈ ప్రాసెస్‌లో 'పుష్ప' హీరోకి అవార్డు దక్కే అర్హత పూర్తిగా ఉంది. ఎందుకంటే నేషనల్ హీరోని సెలక్ట్ చేసేటప్పుడు అతని నటన చూస్తారు.. సినిమాని కాదు. అయినా బెస్ట్ ఫిలిం కింద నేషనల్ అవార్డుకి 'పుష్ప'ని తీసుకోరు. ఎందుకంటే స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్ కాబట్టి. అందుకే ఉత్తమ చిత్రం కేటగిరీకి మేం 'పుష్ప'ని పంపించలేదు. బెస్ట్ యాక్టర్ కేటగిరీ అనేది పూర్తిగా నటనని బేస్ చేసుకునే ఇస్తారు. ఆ విధంగా పుష్పరాజ్.. బెస్ట్ అనుకుని, నామినేషన్‌కి పంపించాం. మా నమ్మకం నిజమైంది.

20 ఏళ్ల కెరీర్.. 20 మందికి పైగా హీరోలతో పోటీ పడి నేషనల్ అవార్డు తెచ్చుకున్న ఈ ఆనందంలో మీ కెరీర్‌ని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తోంది?

యాక్చువల్‌గా ఇలా ఆనందంగా ఉన్నప్పుడు కాదు.. 'సాడ్ మూమెంట్స్' అప్పుడే ఎక్కువ ఎనలైజ్ చేసుకుంటాం. హ్యాపీ అప్పుడు హాయిగా అలా వెళ్లిపోతాం. 20 ఏళ్ల లైఫ్ టైమ్‌లో ఏ మనిషికైనా హ్యాపీ.. సాడ్ ఈ రెండూ ఉంటాయి. బయట చూసేవాళ్లకు అంతా స్మూత్‌గా ఉన్నట్లు కనిపిస్తుంది కానీ ఏ మనిషి జీవితం కూడా ఈ రెండూ లేకుండా ఫ్రిజ్‌లో పెట్టిన మటన్‌లా ఫ్రీజ్ అయిపోవడం జరగదు (నవ్వుతూ). ఏ చెట్టుకి ఆ గాలి. బయటకు చెప్పలేకపోవచ్చు కానీ.. చాలా అవమానాలు ఉంటాయి. ఆ చెప్పలేనివి జరిగినప్పుడు విశ్లేషణ అనేది మొదలవుతుంది. అందులోంచే నేర్చుకోవడం, నడుచుకోవడం కూడా తెలుస్తుంది.

మీరన్నట్లు అవమానాలు సహజం. పైగా ఇప్పుడీ డిజిటల్ వరల్డ్‌లో ట్రోల్స్ ఎక్కువ.. వీటిని పట్టించుకుంటారా?

హండ్రెడ్ పర్సంట్ అన్నీ పట్టించుకుంటాను. కాకపోతే 'ఫన్'గా తీసుకుంటాను. మన కోసం ఒకళ్లు పని గట్టుకుని టైమ్ కేటాయించి, అదే పనిగా విమర్శిస్తున్నారంటే మనం ఎదిగినట్లే కదా (నవ్వుతూ). మా స్టాఫ్‌లో ఒకరు.. 'చూడండి సార్.. మీ గురించి ఇలా అనుకుంటున్నారు' అంటే, 'మంచిదే కదా.. మనం ఎదిగినట్లు అర్థం' అన్నాను. ఏమీ లేకుండా మిగిలిపోయినవాళ్లను ఎవరూ పట్టించుకోరు. సో.. మనల్ని పట్టించుకున్నారంటేనే మనం సాధిస్తున్నాం అని అర్థం.

మరి.. 'మెగా ఫ్యాన్స్', 'అల్లు అర్జున్ ఆర్మీ' అంటూ ఫ్యాన్ వార్ జరుగుతుంటుంది కదా.. ఆ వార్‌ని కూడా పట్టించుకుంటారా?

నేను ఏదైనా ఒకటి పట్టించుకోనంటే ఆ ఫ్యాన్ వార్‌ని మాత్రమే. నేనస్సలు పట్టించుకోను. ఎందుకు పట్టించుకునేంత టైమ్ లేదు. ఫ్యాన్స్ పని ఫ్యాన్స్ చూసుకుంటారు. నా పని నేను చూసుకుంటాను.

వసూళ్లు, అవార్డుల గురించి పట్టించుకుంటారా..?

వీటి గురించి అయితే పక్కాగా ఆలోచిస్తాను. వేరే వాటి గురించి ఆలోచించను. నా ఫోకస్ అంతా వాటిపైనే ఉంటుంది. మిగతావారి గురించి నాకు తెలియదు కానీ నాకు మాత్రం అన్నీ కావాలి. అవార్డులు కావాలి... కలెక్షన్స్ కావాలి. ప్రజల్లో పేరు, నా సినిమా నిర్మాతలకు డబ్బులు రావాలి. జనాలకు పిచ్చెక్కిపోయే సినిమాలు ఇవ్వాలి.. ఇలా నాకు అన్నీ కావాలి. ఆ క్లారిటీ నాకు ఉంది. నాది అత్యాశ.. నాకు అన్నీ కావాలి. అందుకే తగ్గేదే లే అంటూ హార్డ్ వర్క్ చేస్తాను. ఆగేదే లే అంటూ సినిమాలు చేసుకుంటూ వెళతాను..

'పుష్ప 2' తర్వాత మీ ప్రాజెక్ట్?

ప్రస్తుతం 'పుష్ప 2' కోసం దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. వాళ్లకు న్యాయం చేయాలనే ఆలోచనే ప్రజెంట్ నా మైండ్‌లో ఉంది. 'పుష్ప 2' తర్వాత నా తర్వాతి సినిమాపై మరింత క్లారిటీ ఇస్తాను.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కుమ్మరి/కుల ప్రసక్తి లేదు/2వ పెళ్లి/పిల్లలు లేరు/31/5'7"/B.Tech/బ్యాంక్ మేనేజర్/80,000/-PM/వరునికి తగిన AP/TS వధువు కావలెను. Ph: 9441039962 [HA-13698]

బ్రాహ్మణ/2వ పెళ్లి/గుడ్ లుకింగ్/43/5'10"/MBA, BE/SWE/4 Lakhs. PM/ కోట్ల ఆస్తి గల వరునికి 1st మ్యారేజ్ వధువు కావలెను. Ph: 8367619529, 9515349877 [HA-13698]

SC మాల/ఏకైక కుమారుడు/ B.Tech/Govt. ఇన్స్‌పెక్టర్/రెవెన్యూ Dept/80,000/-PM/6'ఎత్తు/32 సం॥ల వరునికి అందమైన వధువు కావలెను. Ph: 8897389698 [HA-13698]

1వ పెళ్లి/30, 1L.PM & 2వ పెళ్లి/36Y/కుల పట్టింపు లేదు/2L.PM, బాగా స్థిరపడిన వరునికి వధువు కావలెను. పిల్లలున్నా OK. సంప్ర: 7386429819, 8520829819 [HA-13700]

రజక/B.Tech/ Govt.Digital Asst./ పంచాయితీరాజ్ Dept/ Vizag/35000/-PM/5'9"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9515942275 [HA-14703]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/M.Tech, NIT/Govt.A.E.E./ఇరిగేషన్ Dept/85000/-PM/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-14703]

SC మాదిగ & క్రిస్టియన్/కట్నం ప్రసక్తి లేదు/M.Tech, NIT/C.Govt. A.E.E/ ONGC/ 14 Lakhs. P.A/5'9" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-14703]

రెడ్డి/36y/5'9"/ Business/ 1 Lakh p/m / 50 Cr గల వరుడికి వధువు కావలెను. Ph: 8897213126, 7995853094 [H-789388]

కమ్మ/40y/5'8"/Job/ 30 Cr, Late మ్యారేజ్ వరుడికి వధువు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8897213126, 7995853094 [H-789388]

SC మాదిగ : 30 సం॥/5'9"/B.Tech (EEE)/MBA/ గ్రూప్ A Job, 12L P/A, Own House వరునికి తగిన వధువు కావలెను. Ph: 6281925716 [H-94750]

యాదవ: 30సం॥/ 5'9"/M.Tech/ SWE/ Job Sal: 20L P/A బాగా స్థిరపడిన వరుడికి, తగిన వధువు కావలెను. (డిగ్రీ Also ok) Ph: 8897091964 [H-94750]

రెడ్డి/29y/B.Tech * కమ్మ/37y/MA.B.Ed బ్రాహ్మణ 49yPG కట్నాలు ఆశించని వరులకు వధువులు కావలెను (కుల పట్టింపు లేదు) 1వ 2వ లేట్ మ్యారేజ్ OK సంప్ర: 7993666235 [H-788666]

36 సం.ల/బిజినెస్ చేస్తున్న ప్రాపర్టీ ఉన్న వరుడుకి రెండోవ/విడో పిల్లలు ఉన్న వారు అయినా సంప్రదించండి. డౌరీ, కుల ప్రసక్తి లేదు. ఫోన్: 8885582668, 7396730091 [H-788666]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

వధువు కావలెను

Reddy/BBA/LLB/Advocate/1997/5'11"/50Cr. *B.Tech/Business/1997/5'11"/100Cr. *1994/5'10"/100Cr. * Cont: K.C. Reddy - Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Business/ B.Tech/1993/ 5'7"/50Cr *1993/5'10"/200Cr *1995/5'9"/500Cr *1993/6'/50Cr. *1991/6'/80Cr *1994/ 5'11"/ 100Cr. * Cont : K.C. Reddy-Hyd. Ph:9849321309

Reddy/Business/ B.Tech/ 1995/5'10"/80Cr *1994/5'9"/350 Cr *1997/6'/100Cr *1995/6'/100Cr* 1995/6'/50Cr. *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph: 98493213099347807015

Reddy/Business/MBA/1992/5'10"/300Cr *1990/6'/1000Cr *1989/5'11"/400Cr *1995/6'/150Cr *1988/5'11"/100Cr. * Cont: K.C. Reddy - Hyd. Ph: 9849321309

Reddy/MBBS/PG * 1995/5'10"/400Cr *1994/5'10"/75Cr *1993/5'10"/50Cr *1993/5'10"/20Cr *1990/5'10/500Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech / MS/ H1/USA/ 1995/ 5'11"/ 400Cr/140K *1991/5'10"/130K/ 200Cr *1994 / 5'11"/120K/100Cr *1994/5'9"/120K/ 150 Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/(Divorcee) B.Tech/ MS/ MBA/(Industrialist)1981/5'8"/250Cr/Hyd.*Cont : K.C. Reddy -Mar-Bureau-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/(Divorcee)B.Tech/MS/H1/USA/1986/5'11"/350K/40Cr *Doctor USA/ 1982/5'8"/20Cr *IIT/MS/ H1/1992/ 6'/ 200K/ * Cont : K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/IIT/BITS(India)/1992/5'9"/185L/yr. 1996/5'7"/46L/yr/20Cr *1988/5'7"/90L/yr *1992/5'8"/42L/yr. * Cont: K.C. Reddy-Hyd Ph: 9849321309/9347807015

Reddy/IIT/BITS(ARROAD) 1995 5'7"/ 300K/10Cr *1994/5'7"/200K/50Cr *1991/ 5'10"/ 200K/20Cr *1992/49.5K/5'11"/10Cr. * Cont: K.C. Reddy-Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/MBBS/MS (Gen Sur) Most Beautiful Rich Family Hyd/ 1998/ 5'6"/ *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/SWE Hyd/ 70L/ yr/ 1998/5'3"/Rich Family/Most Beautiful *B.Sc/MBA/1999/5'2"/5Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/2001/5'3"/Most Beautiful/20Cr *B.Sc/1998/5'7"/30Cr *1995/ 5'4"/SWE/Hyd/20L/yr/Rich. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/BBA/MBA/Most Beautiful/1995/5'5"/70Cr *1998/5'4"/25Cr *1997/5'4"/150Cr *1997/5'5"/25Cr/M.Tech. * Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

Reddy/Divorcee/B.Tech/ 1985/5'5"/400Cr *1991/5'4"10Cr *MBBS/MD/1994/5'5"/50Cr *1986/5'4"/30Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/(Divorcee) USA/ B.Tech/ MS/ 1993/5'7"/20Cr *1985/5'6"/15Cr *1986/ 5'6"/30Cr *1995/5'5"/8Cr *1992/5'6"/110K. * Cont: K.C. Reddy. Ph: 9347807015

Reddy/Rich/ M.Sc/ 1994/5'3"/200Cr *1993 /5'3"/ 500Cr *1988/5'3"/200Cr *1995/5'8"/100Cr *1994/5'6"/100Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *Rich/ 1994/ 5'4"/10Cr *1996/5'7" *1997 /5'5"/10Cr *1990/5'8"/30Cr *1998/5'4"/30Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/MBBS/USA-Doc *1992/5'7"/50Cr *1992/5'4"/50Cr *1997/5'5"/*1996/5'2"/20Cr *1992/5'5" *1996/5'8"/40Cr. *Cont:K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/MBBS/ PG/ *1994/ 5'6"/100Cr *1995/5'5"/100Cr *1995/5'3"/50Cr *1993/5'3"/ 50Cr *1990/5'6"/100Cr *1996/5'6"/80Cr *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

[D-526]

దాసి/రెండవపెళ్ళి/ 45 సం॥లు/ప్రైవేట్ జాబ్ నెలకు 40వేలు జీతం. కుల పట్టింపు లేని డైవర్స్ విడో / పిల్లలు ఉన్నా OK, వధువు కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్ కాంటాక్ట్. సెల్: 9676685764. [J-1153012]

2nd Match; OC/36/5'10"/BE, MS, USA/ SWE, Rich *32/6'/ME, MNC, 30L *34/5'9"/ MBBS, MD, Seeks only OC, Reddy/ Kapu/ Kamma/Brahmin/Vyshya. Ph: 9347517877 [HA-14703]

★

రెడ్డి: లేట్ మ్యారేజ్ / 34y/ నెలకు లక్ష రూపాయల ఆదాయం Hydలో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఏపీ తెలంగాణ వధువు కావలెను. డైవర్స్/విడో OK కుల, కట్నం ప్రసక్తి లేదు డైరెక్ట్ Ph: 7989079290 [H-189373]

వరుడు కావలెను



No Caste bar/1, 2వ 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం Ok. త్వరగా చేసుకునే వారి కోసం మాత్రమే. Ph: 7794960803 [HA-29865]

రజక/B.Tech/C.Govt. ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్/60,000/-PM/5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-13698]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 27, 6' 1", Engineer, 200 K, 80 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIIT), 30, 5' 8", SWE, 40 L P/A, 10 Crores. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE (BITS), 29, 5' 7", 40 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి M Tech (IIT), MS, 28, 5' 7", Engineer, 300 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MBA, 26, 5' 3", Analyst, 12 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MS, 27, 5' 5", 10 L P/M, 50 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 24, 5' 4", Sr SWE, 105 K, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 28, 5' 4", SWE, 180 K, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 28, 6', SWE, 200 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 11", 22 L P/A, 100 Crores, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, MBA, 30, 5' 11", Consultant, 130 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 11", Doctor, Rich Family, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MHA, 28, 5' 4", Doctor, 5 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 24, 5' 4", Manager, 8 L P/A, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 26, 5' 8", SWE, 120 K, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BDS, MPH (USA), 36, 5' 6", 8.5 L P/A, 5 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

వడ్డెర/B.Tech/Govt. Asst.ఇంజనీర్/ ట్రాన్స్‌కో/60,000/-PM/5'4"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618579861 [HA-13698]

1వ పెళ్లి/26, 1L.PM & 2వ పెళ్లి/32Y/కుల పట్టింపులేదు/2.5L.PM, బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. పిల్లలున్నా OK. సంప్ర:8520829819, 7386429819 [HA-13699]

కుల పట్టింపు లేదు/ 2వ పెళ్లి / 52Yrs/ Govt. ఎంప్లాయి /60,000/-PM వధువుకు వరుడు కావలెను. ఇల్లరికం అయినా OK. Ph: 7569259489 [HA-14703]

క్రిస్టియన్/ 2వ పెళ్లి /కుల ప్రసక్తిలేదు/ B.Tech/ C.Govt.బ్యాంక్ P.O/SBI/ 55000/-PM/5'4"ఎత్తు/33 సం॥ల పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550650024 [HA-14703]

రెడ్డి/2nd మ్యారేజ్/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/వయస్సు : 32, Qly: డిగ్రీ/బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. ఇల్లరికం అయినా OK. Ph: 8143011223 [HA-14703]

SC మాల & క్రిస్టియన్/M.Tech, (EEE)/ C.Govt.డిప్యూటీ మేనేజర్/SBI85000/-PM/5'4"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-14703]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc * 27/5'4"/MBA *28/5'3"/ఇంటర్ *25/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. పురోహితులు & కట్నం ప్రసక్తి లేనివారు సంప్ర: 7207634758 [HA-14703]

రెడ్డి/విడో/58y/5'5"/ Very Fair/ Govt. Teacher/ Own House/ 25 ఎకరాల మాగాణి, పిల్లలులేని ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 7287079096 [H-788943]

కమ్మ/28y/5'4"/ Health Informatics Job (U.S.A)/ 20 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 7382055839 [H-788943]

రెడ్డి/విడో/60y/5'4"/ Fair/ Retd. Pensioner/ సొంత ఇల్లు & రెంట్స్/ సాంప్రదాయ కుటుంబానికి చెందిన వెల్‌సెటిల్డ్ ఒంటరి వధువుకు స్నేహభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 7386734478 [H-788943]

పద్మశాలి/55y/విడో /5'4" /మార్బుల్ గ్రానైట్ బిజినెస్/1 L pm/ సొంత ఇల్లు/ పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8885428274 [H-788943]

కులప్రసక్తిలేదు/విడో/55y/ విజయవాడ/ Hydలో OwnHouse Rents/Lands Well Settled పిల్లలులేని ఏ బాదరాబందీలేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. (సపోర్ట్ ఉండును). Ph: 8519803423 [H-788530]

రెడ్డి/26/5'4"/Fair/ B.Tech/ SWE/ 20L P/A కోట్ల ప్రాపర్టీ గల ఏకైక వధువుకు వరుడు కావలెను. Ph: 9848226983 [H-788530]

కమ్మ/డైవర్సీ/ 30y/5'5"/ MBA/ Business/ 25L P/A కోట్ల ప్రాపర్టీ కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9640667754 [H-788530]

కాపు/25y/5'6"/ V.Fair/ M.S/ Working in AUS (BANK)/ 35 Lakhs P/A, కోట్ల ప్రాపర్టీ కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9553652167 [H-788530]

రెడ్డి/36y/5'6"/Job/ 2 Lakhs p/m / 50 Cr గల వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8897213126, 7995853094 [H-789388]

రెడ్డి/34y/5'5"/Job/ 1 Lakh p/m / 40 Cr గల వధువుకి వరుడు కావలెను. Ph: 8897213126, 7995853094 [H-789388]

SC మాల హిందూ/B.Tech/ 25y/5'4"/ సాఫ్ట్‌వేర్ ఇన్ఫోసిస్ (Hyd) 60K per month/ చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9705960270 [H-788408]

రెడ్డి/Age:28, Height:5.4, Colour: Fair/ సొంత వ్యాపారం కలిగిన వధువుకి మంచి వరుడు కావలెను 1st (or) 2nd అయినా పర్వాలేదు. Ph: 9121300377 [H-788408]

బ్రాహ్మణ/33yrs/5'2"/ఇంటర్/29 yrs/ 5'4"/ డిగ్రీ అందమైన వధువులకు వరులు కావలెను. రిక్రూట్‌మెంట్/Pvt., Govt. జాబ్ & పురోహితం అయినా Ok. Ph: 9110723130 [H-788408]

ఆర్యవైశ్య/22y&23y&24y&25y&26y&27y&28y&29y&30y&32y&34y&36y&38y&40y&42y&44y&46y&47y&49y&51y&53y&55y&57y&59y/ జి. సుధాకర గుప్తా "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [H-788408]

గౌడ: 27సం॥/ 5'4"/ M.Tech/Govt, Job/ 15L P/A /Well Settled family అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6281925716 [H-94750]

కాపు: 25 సం॥/ 5'4"/ B.Tech/ IIT/SWE 10L P/A Only Daughter Well Settled Family అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9391646037 [H-94750]

మాల: 26 సం॥/ 5'4"/ Govt Job(AE)/ B.Tech/ MBA, 12L P/A Sal: అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7702195227 [H-94750]

MBBS MD: 2వ పెళ్ళి/ 38yr/ 4,00,000/-(pm) కుల పట్టింపు లేని కోట్ల ప్రాపర్టీ కలిగి బాగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. సంప్ర: 9133715309 [H-788665]

కుల పట్టింపులేదు: 2వ పెళ్ళి Govt ఎంప్లాయ్ 3,00,000/- (pm) 36yearsకోట్ల ప్రాపర్టీ కలిగి బాగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 7386550413 [H-788665]

యాదవ: ఎర్రగొల్ల, అప్పర్ మిడిల్/ 36y/ 5'4" ఎత్తు / M. ఫార్మసీ వధువుకి Hyd లో జాబ్ కల్గి లక్ష రూ. PM అపై ఆదాయం కల్గిన యాదవ్ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ ఫాదర్. Ph: 9989597799 [H-788665]

2వ పెళ్ళి: Govt ఎంప్లాయ్ 3,50,000/- (pm) 40years కుల పట్టింపు లేని, కోట్ల ప్రాపర్టీ కలిగి బాగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం Ok & పిల్లలున్న Ok) సంప్ర: 9133715309 [H-788665]

రెడ్డి: విడో/39y/ ప్రొఫెసర్ గుంటూరు సొంత అపార్టుమెంట్స్/ సొంత హాస్టల్స్/ రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (నో బ్రోకర్స్) (ఇల్లరికం Ok) 7799083580, 7386660643 [H-788665]

రెడ్డి/విడో/కుల పట్టింపు లేదు/ 50yr/ M.Com/ Govt.ఆఫీసర్ బ్యాంక్ చైర్మన్ 3 లక్షలు (PM), 50 కోట్ల ఆస్తిగల వెల్ సెటిల్ వరుడికి వధువు కావలెను. సంప్ర: 7396213324 [H-788666]

కాపు/40yr/5'5"/కుల పట్టింపు లేదు/ పెయిర్/ MA.B.Ed/Govt.ఎంప్లాయ్ 80K (PM) వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర: 8008474869 [H-788666]

2వ పెళ్లి/కుల పట్టింపులేదు 40yr M.Sc, SBI బ్యాంకు మేనేజర్ 1,25,000/- (PM) సొంత ఇల్లు+కార్ పిల్లలు లేని తెల్లని అందమైన వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (పిల్లలున్నాOK & ఇల్లరికం OK) సంప్ర: 7396213324 [H-788666]

29, 5.3", MNC Job, 50K ముస్లిం సున్నీ వధువునకు Hydలో జాబ్ చేస్తున్న 30-33 సం॥లలోపు SW / MNC (ముస్లిం/దూదేకుల) వరుడు కావలెను. © 86396 56798 [B-66]

2nd Match; OC/31/5'6"/MS, H1 $120K *34/5'4", BE, MBA, SWE 25L *32, 5'5", MBBS, PG, Seeks Only OC, Kapu/ Reddy/ Kamma/ Brahmin/Vyshya. Ph: 9347517877 [HA-14703]

వేదికలు



గౌడ్ మ్యారేజ్ బ్యూరో, HYD. 20 సం॥ అనుభవం. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ కులస్థులకు ఇంజనీర్స్/డాక్టర్స్/NRI/బిజినెస్ 1వ, 2వ, దేశ/ విదేశ పెళ్లిళ్లకై. 9440454842 [H-788943]

మైత్రి మ్యారేజ్ బ్యూరో Free Registration. అన్ని కులముల వారికి సంబంధాలు చూడబడును. L.B. Nagar. Ph: 8897213126 [H-789388]

నిఖిల్ గౌడ్స్ మ్యారేజ్ బ్యూరో. Spl. గౌడ్స్/శెట్టిబలిజ/దేశ/విదేశ/1వ/2వ/Engg./డా॥/PG/డిగ్రీ గౌడ వధూవరులకై, బోడుప్పల్, Hyd. Ph: 9848371924, 8008075925 [H-788408]

గంగపుత్రుల పెళ్లి సంబంధాలకై బెస్త, గూండ్ల, అగ్నికుల క్షత్రియ, వాడబలిజ, జాలరి & ఇతరత్రా. శ్రీ గంగాభవాని గంగపుత్రుల వివాహ పరిచయాలు. అంబర్‌పేట్, Hyd. Ph: 9000541008 [H-189411]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14707]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14707]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14707]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14707]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14707]

కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్స్. అన్ని కులాలవారికి త్వరగా కుదుర్చబడును స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-788530]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est: 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-788938]

మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-10225]

శ్రావణమాసం-పెళ్లిళ్ల సీజన్. అబ్రాడ్, సాఫ్ట్‌వేర్స్, రిచ్, IAS, IPS, IRS వారికి ఫాస్ట్ సెటిల్మెంట్. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, సంప్రదించండి: 7093722724. [T-1918]

15000॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com, Cont © 94418 29644, 9849058673, 9440785888 W [B-945]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి. Ph: 9704656103, 9533608887 (Whatsapp) [H-370]



ఉనికి కోల్పోతున్న బొౌక్కు సొర చేప

సాక్షిప్రతినిధి, కాకినాడ: సముద్ర కాలుష్య నివారణలో కీలకపాత్ర పోషించే బొౌక్కు సొర చేప కాలక్రమేణా ఉనికిని కోల్పోతోంది. వేల్ షార్క్‌గా పిలిచే ఈ చేప 'రిన్ కో డాంటిడే' జాతికి చెందింది. ఏళ్ల సంవత్సరాల కిందట డైనోసార్‌లతో సముద్ర జలాల్లో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన అతి ప్రాచీన సముద్ర జీవిగా ప్రసిద్ధి. 65 కోట్ల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ సాదు జీవి మనుగడ కోసం ప్రస్తుతం పోరాడుతోంది. ఈ జీవి ప్రపంచవ్యాప్తంగా 20వేల వరకు ఉండగా ప్రస్తుతం 10 వేలకు తగ్గిపోయినట్టు 'ఐయూసీఎన్(ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) తన నివేదికలో పేర్కొంది. అలాగే తన నివేదికలో ఇది అంతరించిపోతున్న జాతుల్లో ఒకటిగా రెడ్‌బుక్‌లో పేర్కొంది.

నిశ్శబ్ద జలాల్లోనే నివాసం..

ఈ చేపలు నిశ్శబ్దంగా ఉండే సముద్ర జలాల్లోనే ఉండటానికి ఇష్టపడతాయి. ఎప్పుడైన ఓడలు, బోట్లు ఫ్యాన్‌లు తగిలితే తప్ప బయటకు వచ్చే అవకాశం లేదు. చూస్తే భయంతో వణికిపోయేలా భారీ ఆకారంతో తిమింగలానికి నాలుగు రెట్లు అధికంగా ఉండే వేల్ షార్క్(బొౌక్కు సొర) ఎవరికీ ఏ హాని తలపెట్టదు. ఈ చేపలు 13 మీటర్లు(42 అడుగులు) పొడవు, 20 నుంచి 25 మెట్రిక్ టన్నుల బరువుతో భారీ ఆకారంతో ఉంటాయి. ప్రపంచంలోనే అతి పెద్ద చేపగా వేల్‌షార్క్‌కు పేరుంది. తీరం నుంచి 50 నుంచి 60 కిలో మీటర్లు (డీప్‌సీ)దూరంలో సముద్రంలో సుమారు ఐదు కిలోమీటర్ల లోతులో ఇవి ఉంటాయి. సముద్ర ఉపరితలంపై ఎక్కడా కనిపించవు. లోతు జలాల్లో ఉండే అరుదైన జలచరం ఇది.

రెండేళ్ల కిందట విశాఖలో ప్రత్యక్షం

ఈ చేప చమురు, మాంసం, రెక్కలు, అంతర్జాతీయంగా వాణిజ్య విలువలతో మంచి డిమాండ్ ఉంది. ఉష్ణ మండలం, సమశీతోష్ణ సముద్ర జలాల్లో కనిపిస్తుంటాయి. సేనిగల్ నుంచి గునియా, న్యూయార్క్ నుంచి కరేబియన్, మెక్సికో నుంచి టోంగా, తూర్పు ఆఫ్రికా నుంచి థాయిలాండ్, ఎర్ర సముద్రం, యూఎస్‌ఏ, అరేబియన్, గల్ఫ్, జపాన్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, పిలిపీన్స్ సముద్ర జలాల్లో ఇవి విస్తరించి ఉన్నాయి. దేశంలో గుజరాత్, తమిళనాడు, ఒడిశాతో పాటు మన రాష్ట్రంలోని విశాఖ, నెల్లూరు, ఉప్పాడ, కోనపాపపేట, కాకినాడ కుంభాభిషేకం, భైరవపాలెం తదితర తీరప్రాంతాల్లో వేట సమయంలో సముద్రంలో మత్స్యకారులకు కనిపిస్తుంటాయి. రెండేళ్ల కిందట విశాఖబీచ్‌కు వచ్చిన బొౌక్కు సొరను రక్షించి తిరిగి సముద్రంలో విడిచి పెట్టారు.

వేల్‌షార్క్ సంరక్షణపై అవగాహన..

గతంలో ఈ చేపలను చూసి భయంతో వేటకు వెళ్లే మత్స్యకారులు చంపేసేవారు. అటవీశాఖ వన్యప్రాణి విభాగం కల్పిస్తోన్న అవగాహనతో తీర ప్రాంతంలో కొంతవరకు సత్ఫలితాలనిస్తున్నాయి. తూర్పు తీరంలో పరిరక్షణ కోసం వన్యప్రాణి సంరక్షణ విభాగం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. వేల్‌షార్క్ సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా తూర్పు తీరంలోని మత్స్యకార గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం, అవగాహన కార్యక్రమాలు ప్రారంభించి ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తోంది.


నేరుగా పిల్లలను పెట్టే ఒకే ఒక చేప..

దక్షిణాఫ్రికా తీరంలో మొట్టమొదటిసారి ఈ తిమింగలం సొరను డాక్టర్ ఆండ్రూ స్మిత్ గుర్తించాడు. 70 నుంచి 100 సంవత్సరాల జీవితకాలం కలిగిన ఈ చేపలు లైంగిక పరిపక్వతకు రావడానికి 30 సంవత్సరాలు పడుతుంది. సహజంగా చేపలన్నీ గుడ్లు పెట్టి చేప పిల్లలుగా రూపాంతరం చెందుతాయి. కానీ బొౌక్కు సొర మాత్రం నేరుగా పిల్లలను పెడుతుంది. అదీ కూడా రెండు, మూడు చేప పిల్లలను మాత్రమే పెట్టడం ప్రత్యేకం. ఇది గుడ్లు పెట్టినా బయటకు రిలీజ్ చేయదు. తన అంతర్భాగంలోనే దాచుకుంటుంది. ఒకేసారి 200-300 గుడ్లు వరకు పెడుతుంది. 2-3 ఏళ్ల అనంతరం నేరుగా పిల్లల రూపంలో బయటకు వదులుతుంది.

ఫైటో ప్లాంటాన్స్ అనే మొక్కలే ఆహారం..

సముద్ర కాలుష్యాన్ని తగ్గించడంలో ఈ చేపలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. ఫైటో ప్లాంటాన్స్(సృష్టిలో మొదటిగా వచ్చాయి) అనే మొక్కలను పోలిన జీవులను ఆహారంగా తీసుకుంటాయి. ఫైటో ప్లాంటాన్స్ ఎక్కువగా పెరిగితే సముద్రంలో పైకి తెట్టులా పెరిగిపోయి ఆక్సిజన్ తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ బొౌక్కు సొర దానిని తినడం వల్ల సముద్రంలో ఫైటో ప్లాంటాన్స్ పెరగకుండా సముద్ర కాలుష్యాన్ని తగ్గిస్తోంది. సముద్రంలోని సూక్ష్మ మృత జీవరాశులు, సముద్రకాలుష్యాన్ని శుద్ధి చేయడంలో ముఖ్య భూమిక పోషిస్తుంటుంది.

పులులతో సమాన హోదా...



వన్యప్రాణి పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బొౌక్కు సొర చేపను పరిరక్షిస్తున్నాం. గత కొన్నేళ్లుగా తీర ప్రాంత ప్రజల్లో, మత్స్యకారుల్లో అవగాహన కల్పిస్తున్నాం. అడవుల్లో ఉండే పులులకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో అంతే ప్రాధాన్యం బొౌక్కు సొరకు ఇస్తున్నాం. బొౌక్కు సొరను చంపినా, శరీర భాగాలను విక్రయించినా వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 సెక్షన్ 50, 51 ప్రకారం ఏడేళ్ల జైలు శిక్ష, అధిక మొత్తంలో జరిమానా విధిస్తాం.

– ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వన్యప్రాణి విభాగం

శ్రీవారి దయతో సమృద్ధిగా వర్షాలు కురవాలి

టీటీడీ చైర్మన్ భూమన • తిరుమలలో ముగిసిన కారీరిష్టి యాగం



యాగం నిర్వహిస్తున్న పండితులు, చిత్రంలో టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి

తిరుమల: ప్రపంచ మానవాళి సంక్షేమం, శ్రీవారి దయతో సమృద్ధిగా వర్షాలు కురవాలని కారీరిష్టి-వరుణ జపం-పర్జన్యశాంతి హోమం నిర్వహించామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో ఐదు రోజుల పాటు జరిగిన యాగాలు శనివారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి టీటీడీ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ భూమన మీడియాతో మాట్లాడుతూ వరుణదేవుని ఆశీస్సులు కోరుతూ 32 మంది రుత్వికులు ధర్మగిరిలో నిష్ఠగా యాగాలు నిర్వహించారని తెలిపారు. అనంతరం ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్.అవధాని కారీరిష్టి-వరుణజప-పర్జన్యశాంతి మంత్రాలను పఠించి అందరితో పలికించారు. కాగా, తిరుమలలోని ఎంబీసీ సమీపంలో ఎంఆర్కేఆర్ సమస్త ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన అతిథి గృహానికి భూమన కరుణాకరరెడ్డి శనివారం భూమి పూజ చేశారు.

సైక్లింగ్‌తో స్ఫూర్తి నింపుతూ...

- 22 వేల కిలోమీటర్లకు పైగా సైకిల్‌పై ప్రయాణించిన వరంగల్ వాసి రంజిత్
- ఖండాంతరాలు దాటేస్తోన్న 'రంజిత్ ఆన్ వీల్స్'
- ఐదు ఖండాల్లో సైక్లింగ్ పూర్తి చేసే దిశగా అడుగులేస్తున్న యూట్యూబర్



హైదరాబాద్ టు కన్యా కుమారి రైడ్‌లో రంజిత్

సాక్షి, వరంగల్: ఆరోగ్యాన్ని మించిన మహాభాగ్యం లేదని అందరూ అంటారు. కానీ కొందరు మాత్రమే ఆరోగ్యంకోసం తపిస్తారు. ఆదాయం వేటలోపడి ఆరోగ్యాన్ని మరచిపోతారు. అయితే యుక్త వయసులోనే రంజిత్ కుమార్ దవేరాకు ఆరోగ్యం ఎంత విలువైనదో తెలియజెప్పింది కరోనా...

మార్చిన మహమ్మారి...

కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో ఆ మహమ్మారి బారిన పడిన నాన్న రాములే కాదు... కళ్లెదుటే ఎంతో మంది చనిపోవడం వరంగల్ గిర్మాజీపేటకు చెందిన ఈ డీఫార్మసీ గ్రాడ్యుయేట్‌ను కదిలించింది. సరైన శారీరక శ్రమ లేక వ్యాధినిరోధకత కోల్పోయి ఈ మహమ్మారికి బలయ్యారని ఆయనకు అవగతమైంది. దీంతో ప్రతిఒక్కరిలో ఆరోగ్యంగా ఫిట్‌గా ఉండాలన్న ఆలోచన కలిగించడమే లక్ష్యంగా సైక్లింగ్ వైపు రంజిత్ అడుగులు పడ్డాయి. అలా 2021 ఏప్రిల్ 5న మొదలైన 'రంజిత్ ఆన్ వీల్స్'సైక్లింగ్.....దశలవారీగా రాష్ట్రాలు దాటింది. ఇప్పుడు ఏకంగా ఖండాంతరాలు దాటింది. ఏ ఉద్దేశంతో ఈ సైక్లింగ్ మొదలెట్టాడో... ఇప్పుడు అదీ కార్యాచరణ రూపంలో కనిపించడం ఎంతో సంతృప్తిగా ఉందని అంటున్నాడు రంజిత్. దాదాపు 500 మంది వరకు తనను చూసి స్ఫూర్తి పొందారని మలేసియాలో సైక్లింగ్ కొనసాగిస్తున్న రంజిత్ 'సాక్షి'కి తెలిపారు. తనను ఆగస్టు 15న మలేసియా ఇండియన్ హైకమిషన్ సత్కరించడం సంతోషం కలిగించిందన్నాడు.

అలా మొదలైంది...

2021 ఏప్రిల్ ఐదున హైదరాబాద్ నుంచి కన్యాకుమారి వరకు మొదలైన సైక్లింగ్...దాదాపు 3,000 కిలోమీటర్లు తిరిగి హైదరాబాద్‌లోనే జూన్ 14న ముగిసింది. మళ్లీ జూలై 17న ప్రారంభించి హైదరాబాద్ నుంచి లడఖ్ వరకు సైక్లింగ్ చేశాడు. ఇది కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, జమ్మూకశ్మీర్, లదాఖ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల మీదుగా తిరిగి అక్టోబర్ 22న హైదరాబాద్‌లో ముగిసింది. ఈ సమయంలోనే రంజిత్ సినీ హీరో సోనూసూద్‌ను కలిశాడు. ఆ తరువాత హైదరాబాద్ నుంచి చైనా సరిహద్దు వరకు పెంపుడు శునకం భగీరతో కలిసి రంజిత్ సైక్లింగ్ చేశాడు. విజయవాడ, విశాఖపట్నం, భువనేశ్వర్, కోల్‌కతా, అస్సాం, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్,అస్సాం, వెస్ట్‌బెంగాల్, సిక్కింల నుంచి నథులాపాస్‌లో చైనా బార్డర్ వరకు వెళ్లాడు. గత 2022 ఫిబ్రవరి 8న మొదలైన ఈ ఆరువేల కిలోమీటర్ల యాత్ర జూలై 25న ముగిసింది.

ఆస్ట్రేలియా వైపుగా...

హైదరాబాద్ నుంచి వియత్నాంకు రోడ్డు మార్గాన వెళ్లే అవకాశం లేకపోవడంతో 2023 మే ఐదున శంషాబాద్ విమానాశ్రయంలో సైకిల్ ప్యాక్ చేసుకొని వియత్నాం వెళ్లాడు. అక్కడ హానోయ్ సిటీ నుంచి హోచి మిన్హ్ వరకు దాదాపు మూడు వేల కిలోమీటర్లు సైక్లింగ్ చేసి, ఆ తర్వాత కాంబోడియాలోకి ప్రవేశించి 900 కిలోమీటర్లు, థాయ్‌లాండ్‌లో 2,200 కిలోమీటర్లు, మలేసియాలో 400 కిలోమీటర్లు దాటి ప్రస్తుతం కౌలంలంపూర్‌కు చేరుకున్నాడు. ఆ తర్వాత సింగపూర్, ఇండోనేసియా, జకార్తాకు, అక్కడి నుంచి ఆస్ట్రేలియాకు విమానం ద్వారా చేరుకొని సైక్లింగ్ పూర్తి చేస్తాడు రంజిత్. 2021 ఏప్రిల్ ఐదు నుంచి ఇప్పటివరకు 22 వేల కిలోమీటర్ల మార్క్ చేరుకున్నాడు. ఆసియా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, అమెరికా, యూరప్ ఖండాల్లో సైక్లింగ్ చేసే దిశగా ముందుకు వెళుతున్నానని వెల్లడించాడు.

సోషల్ మీడియాతో మరింత క్రేజ్

సైక్లింగ్ చేస్తున్న సమయంలో రంజిత్ తీస్తున్న వీడియోలు, ఫొటోలు తనకు సామాజిక మాధ్యమాల్లో లక్షలాది మంది ఫాలోవర్స్‌ను తెస్తున్నాయి. 'రంజిత్ ఆన్ వీల్స్'ఫేస్ బుక్ పేజీలో 40,000 మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో 3,15,000 మంది, యూట్యూబ్‌లో రెండు లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇలా సైక్లింగ్ చేస్తూనే...ఇంకోవైపు సామాజిక మాధ్యమాల ద్వారా కూడా రంజిత్ ఎంతో మందిని చైతన్యవంతం చేస్తున్నారు.

క్లుప్తంగా...

ఎడ్యుకేషన్ యూఎస్‌ఏ యూనివర్సిటీ ఫెయిర్ సక్సెస్

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో విద్యావకాశాలపై నిర్వహించిన 'ఎడ్యుకేషన్ యూఎస్‌ఏ యూనివర్సిటీ ఫెయిర్'కార్యక్రమం విజయవంతమైంది. యునైటెడ్ స్టేట్స్- ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నోవాటెల్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు మూడు వేలమంది విద్యార్థులు, అమెరికాలో గుర్తింపు పొందిన 40 విశ్వవిద్యాలయ ప్రతినిధులు హాజరుకావడం విశేషం. అమెరికాలోని వేర్వేరు వర్సిటీలు అందిస్తున్న కోర్సులు, ఇతర వివరాలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఎడ్యుకేషన్ యూఎస్‌ఏ సలహాదారులు, యూఎస్ కాన్సులేట్ వీసా అధికారులు కూడా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా యాక్టింగ్ యూఎస్ కాన్సుల్ జనరల్, కాన్సులర్ చీఫ్ రెబెకా డ్రేమ్ మాట్లాడుతూ భారత్‌-అమెరికాల మధ్య విద్యకు సంబంధించిన భాగస్వామ్యం పెరుగుతోందన్నారు. లక్షలాది మంది విద్యార్థులకు మంచి భవిష్యత్తు కల్పించాలన్నదే 'ఎడ్యుకేషన్ యూఎస్‌ఏ'లక్ష్యమని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మొదలైన ఈ యూనివర్సిటీ ఫెయిర్ కార్యక్రమం ముంబై, పుణె, న్యూఢిల్లీ, అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నై, బెంగళూరుల్లో సెప్టెంబర్ మూడో తేదీ జరగనుంది.

వైద్యుడిపై సదభిప్రాయం ముఖ్యం



సాక్షి, హైదరాబాద్: ప్రతి వైద్యుడిపై ప్రజల్లో సదభిప్రాయం చాలా ముఖ్యమని తెలంగాణ ప్రభుత్వ బోధనాసుపత్రుల డాక్టర్ల సంఘం ప్రతినిధి డాక్టర్ కిరణ్ మాదల అన్నారు. శనివారం ముంబయిలో ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏఐఎఫ్‌జీడీఏ) జాతీయ సదస్సు జరిగింది. దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాల వైద్యులు పాల్గొన్న ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్ మాదల హాజరయ్యారు. సదస్సులో 'వయొలెన్స్ అగైనెస్ట్ డాక్టర్స్'అనే అంశంపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. చాలాచోట్ల వైద్యులపై దాడులు పెరుగుతున్నాయని, వీటికి పరోక్షంగా ఇతర వైద్యులు కూడా కారణమవుతుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి వైద్యుడు ప్రజల్లో సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ఆరోగ్య శిబిరాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావొచ్చని సూచించారు.

రాఖీ పౌర్ణమికి 3 వేల ప్రత్యేక బస్సులు



సాక్షి, హైదరాబాద్: రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా 3 వేల ప్రత్యేక బస్సులను తిప్పాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈనెల 29 నుంచి 31 వరకు రోజుకు వేయి చొప్పున ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయి. గతేడాది రాఖీ పౌర్ణమికి ఆర్టీసీ స్పెషల్ బస్సులను నడపడంతోపాటు సర్వీసులను క్రమబద్ధీకరించటం ద్వారా ఒక్క రోజే 87 శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించి సేఫ్టీ సెస్, టోల్ చార్జీ తదితరాలు కలుపుకుంటే రూ.21 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈసారి రాఖీ పౌర్ణమి రోజు రూ.25 కోట్ల ఆదాయం పొందాలన్న ఉద్దేశంతో సంస్థ ఎండీ సజ్జనార్ శనివారం సాయంత్రం అధికారులతో సమీక్షించి ప్రత్యేక చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రోజుకు వేయి చొప్పున మూడు రోజులపాటు స్పెషల్ బస్సులు తిప్పాలని నిర్ణయించారు. అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి, బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో బాగా పెంచాలని, వీలైనంత ఆదాయం పెంచేలా చూడాలని పేర్కొన్నారు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లే వారు ఆర్టీసీ బస్సుల వైపు మళ్లేలా అవగాహన తెచ్చేలా కూడా చొరవ చూపాలని సజ్జనార్ ఆదేశించారు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లటం కంటే భద్రమైందిగా గుర్తింపు పొందిన ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

గల్ఫ్ చట్టాలు తెలియకే..

జైళ్లలో మగ్గుతున్న 4,630 మంది భారతీయులు | నిషేధిత మందులు ఉన్నా నేరమే..



దుబాయ్‌లోని సెంట్రల్ జైలు

గల్ఫ్ దేశాల చట్టాలపై కనీస అవగాహన కూడా లేకపోవడంతో పలువురు భారతీయులు జైళ్ల పాలవుతున్నారు. మన దేశానికి చెందిన కొన్ని రకాల మందులను గల్ఫ్ దేశాలు నిషేధించాయి. ఇది కూడా తెలియనివారు అనేకమంది ఉన్నారు. ఉపాధి కోసం ఎడారి బాట పట్టేవారిలో డిగ్రీ కూడా దాటని వారే అధికంగా ఉంటున్నారు. ఇలాంటి వారిని విడిపించడానికి మన విదేశాంగ శాఖ చొరవ తీసుకోవాల్సి ఉంది. కేంద్రం ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్‌కు నిధులు కేటాయించి గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న వారికి న్యాయసాయం అందించాలి.

–మోర్తాడ్ (బాల్కొండ)/జగిత్యాల క్రైం

కొందరు ఇలా..

- జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలానికి చెందిన 23 ఏళ్ల యువకుడు ఒళ్లు నొప్పులు తగ్గడానికి వేసుకునే మందులతో పట్టుబడి అబుదాబిలోని సుహాన్ సెంట్రల్ జైలులో మగ్గుతున్నాడు. ఇది గడిచిన జనవరిలో జరగ్గా, విచారణ ఖైదీగా జైలుకు పరిమితమయ్యాడు.
- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన ఓ యువ ఇంజినీర్ జాతీయభద్రత కేసులో నాలుగేళ్ల కింద అరెస్టు అయ్యాడు. అప్పటినుంచి అబుదాబి జైలులోనే శిక్ష అనుభవిస్తున్నాడు.
- నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, జగిత్యాల జిల్లా కన్నాపూర్, కామారెడ్డి జిల్లా కరడ్‌పల్లికి చెందిన యువకులు నిషేధిత మందులతో పట్టుబడి జైల్లోనే ఉండిపోయారు.

గల్ఫ్ దేశాల్లో ఆయా జైళ్లలో ఉన్న వారి సంఖ్య

యూఏఈ	1,611
సౌది అరేబియా	1,461
ఖతర్	696
కువైట్	446
బహ్రెయిన్	277
ఒమన్	139

దౌత్య, న్యాయ సాయం అందించాలి



విదేశీ జైళ్లలో ఉన్న వారికి మన విదేశాంగశాఖ కార్యాలయాల ద్వారా దౌత్య సాయం అందించాలి. న్యాయసాయం అందించి విడుదల అయ్యేలా చూడాలి. రాయభార కార్యాలయాల్లో ప్యానల్ లాయర్ల సంఖ్య పెంచాలి. వలస వెళ్లే కార్మికులకు గల్ఫ్ చట్టాలపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక సదస్సులు నిర్వహించాలి.

– చెన్నమనేని శ్రీనివాసరావు, సీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, గల్ఫ్ జేఏసీ నేత

రాజ్యసభలో ప్రశ్నతో..

ఇటీవల రాజ్యసభలో ఎంపీలు డాక్టర్ మనోజ్ రాజోరియా, రంజితా కోలి, సుమేధానంద సరస్వతిలు గల్ఫ్ జైళ్లో మగ్గుతున్న భారతీయుల సంఖ్య ఎంత అంటూ ప్రశ్నించారు. దీనికి విదేశాంగశాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ సమాధానం ఇస్తూ గల్ఫ్ దేశాల్లోని వివిధ జైళ్లలో మగ్గుతున్న వారు 4,630 మంది ఉన్నారని చెప్పారు.

సాంస్కృతిక ఏకీకరణతో సుస్థిరాభివృద్ధి

- ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాంస్కృతిక వైవిధ్యతే మనందరినీ కలుపుతోంది
- జీ–20 దేశాల సాంస్కృతిక శాఖల మంత్రుల సమావేశంలో కిషన్‌రెడ్డి
- ప్రపంచంలోని భిన్న సంస్కృతులను కాపాడుకునే దిశగా 'కాశీ కల్చరల్ పాత్‌వే'కు ఏకగ్రీవ ఆమోదం



వారణాసి నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: సాంస్కృతిక ఏకీకరణ ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకుంటూనే, ప్రపంచంలోని భిన్న సంస్కృతులను కాపాడుకునే దిశగా జీ 20 దేశాల సాంస్కృతిక శాఖల మంత్రుల సమావేశం కాశీ కల్చరల్ పాత్‌వేకు ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. కాశీలో మూడు రోజులపాటు జరిగిన జీ20 దేశాల సాంస్కృతిక శాఖల మంత్రుల సమావేశాలు శనివారంతో ముగిశాయి. ప్రపంచంలోని వైవిధ్యమైన సంస్కృతి మనందరినీ కలుపుతుందని సమావేశంలోని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి తన సహచర దేశాల మంత్రులను ఉద్దేశించి మాట్లాడుతూ...అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చే శక్తి సంస్కృతి, సంప్రదాయాలకే ఉందన్నారు. 'కల్చర్ యునైట్స్ ఆల్' అని వ్యాఖ్యానించారు. భిన్న ప్రాంతాల్లో భిన్న సంస్కృతుల నిలయమైన భారతదేశం 'భిన్నత్వంలో ఏకత్వాన్ని'ప్రదర్శిస్తున్నట్లే.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాంస్కృతిక వైవిధ్యత అన్ని దేశాలను ఒకేతాటిపైకి తీసుకొచ్చేందుకు, ఒకరినొకరు సంస్కృతి, సంప్రదాయాలను మరొకరు గౌరవించుకునేందుకు వీలవుతుందన్నారు. యావత్ మానవాళిని ఏకం చేసే విషయంలో సంస్కృతి కీలకపాత్ర పోషిస్తోందని, విలువలు, భాషలు, కళలు మొదలైనవి దేశాలు, ప్రజల మధ్య సత్సంబంధాలకు బాటలు వేస్తాయని మంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశానికి ఒకరోజు ముందు జరిగిన నాలుగో వర్కింగ్ గ్రూప్ సమావేశంలోనూ ఈ అంశాలపై మరింత విస్తృతమైన చర్చ జరిగిందని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశాల్లో చర్చించిన అంశాల ఆధారంగా 'కాశీ కల్చరల్ పాత్‌వే'కు రూపకల్పన జరిగిందని ఆయన వెల్లడించారు. రోమ్ డిక్లరేషన్, బాలి డిక్లరేషన్‌లలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు అంశాలు, సభ్యుల అభిప్రాయాల ఆధారంగానే 'కాశీ కల్చరల్ పాత్‌వే'ను రూపొందించినట్లు కిషన్ రెడ్డి వివరించారు.

'కాశీ కల్చరల్ పాత్‌వే'లోని కొన్ని ముఖ్యాంశాలు

- సాంస్కృతిక ఆస్తులకు పునర్వైభవాన్ని కల్పించడం, వాటిని ఆయా దేశాలకు తిరిగి అప్పగించడం ద్వారా సామాజిక న్యాయంతో పాటు నైతిక విలువలకు పట్టం గట్టాలని నిర్ణయించారు.
- సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు సంస్కృతి, సంప్రదాయాలకు ఉన్న శక్తి, సామర్థ్యాలను గుర్తెరిగి సరైన ప్రాధాన్యత కల్పించాలి.
- సంస్కృతికి, పర్యావరణ పరిరక్షణకు మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తిస్తూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులకు సరైన పరిష్కారాలను కనుగొనడం.
- అన్ని సభ్యదేశాల మధ్య సమయానుగుణంగా చర్చలు జరుపుతూ.. అందరినీ భాగస్వాములను చేస్తూ ముందుకెళ్లడం.
- ఈ సమావేశంలో పాల్గొన్న సాంస్కృతిక శాఖ మంత్రులు.. ఆయా దేశాలకు ప్రతినిధులుగానే కాకుండా.. ఆయా దేశాలలో సాంస్కృతిక సంరక్షకులుగా ప్రపంచ సాంస్కృతిక పరిరక్షణకు ఏకతాటిపైకి వచ్చి పని చేయాలి.
- రోమ్, బాలి డిక్లరేషన్లు ఈ దిశగా వేసిన బలమైన పునాదుల ఆధారంగా మరింత స్పష్టమైన విధానాలతో ముందుకెళ్లాలి.

కక్షిదారులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి



బాధితురాలికి చెక్ అందజేస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

కుషాయిగూడ: న్యాయం కోసం కోర్టుకు వచ్చే కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. కుషాయిగూడ పారిశ్రామికవాడలోని ఆఫెల్ భవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ కోర్టుతో పాటు ఇతర కోర్టుల సముదాయాన్ని శనివారం ఆయన మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. వినోద్‌కుమార్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ అరాధే మాట్లాడుతూ, సత్వర న్యాయం అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో ఒకటన్నారు. ఈ క్రమంలో న్యాయస్థానాలను ఆశ్రయించే కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. న్యాయవ్యవస్థ పనితీరు ప్రభావవంతంగా, సమర్థవంతంగా ఉన్నప్పుడే న్యాయస్థానాలపై విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోర్టులో మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించాలని చీఫ్ జస్టిస్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెషన్స్ జడ్జి బి.ఆర్. మధుసూదన్ రావు, జిల్లా కలెక్టర్ డి.అమోయ్‌కుమార్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, రాచకొండ సీపీ డి.ఎస్. చౌహాన్, రిజిస్ట్రార్ జనరల్ తిరుమలదేవి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి రఘునాథ్‌రెడ్డి, మేడ్చల్‌- మల్కాజిగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. రామచంద్రారెడ్డి, సెక్రటరీ ఎం.రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు, సౌకర్యాలపై బిల్డర్లు దృష్టి సారించాలి

- ధరలు అందుబాటులో ఉంటేనే అందరికీ ఇళ్లు
- నరెడ్కో రజతోత్సవాల్లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'దేశంలో భూమి లభ్యత పరిమితంగా ఉండటంతో డెవలపర్లు ఎత్తయిన నిర్మాణాల వైపు మొగ్గు చూపిస్తున్నారు. భవనాల ఎత్తు పెరిగే కొద్దీ సమస్యలు ఉంటాయి. అందుకే ఎత్తు మాత్రమే కొలమానం కాకుండా సౌకర్యాలు, వసతులు కూడా దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలి'అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు డెవలపర్లకు సూచించారు. హైదరాబాద్‌లో శనివారం నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) రజతోత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధమైన రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం కేంద్రం రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) తీసుకొచ్చి ఏళ్లు గడుస్తున్నా...ఇప్పటికీ కొన్ని రాష్ట్రాలు రెరా ప్రతినిధులను నియమించకపోవటం శోచనీయమన్నారు. ఔటర్ రింగ్ రోడ్, ఎయిర్‌వేస్, హైవేస్, రైల్వేస్‌తో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ రంగం.. వెరసి హైదరాబాద్ హ్యాపెనింగ్ సిటీ అని వెంకయ్య కొనియాడారు. చంద్రుడిపై ఇళ్లు కట్టే స్థాయికి నరెడ్కో ఎదుగుతుందని ఛలోక్తి విసిరారు.

సమర్థ నాయకుడితోనే అభివృద్ధి: వేముల

స్థిర, సమర్థవంతమైన నాయకుడితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మెరుగైన మౌలిక వసతులు, శాంతి భద్రతలు బాగున్న చోట పెట్టుబడులు వాటంతటవే వస్తాయని ఈ విషయంలో హైదరాబాద్ ముందున్నదని చెప్పారు. కార్యక్రమంలో నరెడ్కో జాతీయ అధ్యక్షుడు రజన్ బండేల్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుమల: శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలకు శనివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణం జరిగింది. ముందుగా సేనాధిపతిని ఊరేగింపుగా వసంతమండపానికి వేంచేపు చేశారు. అనంతరం మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

పనిమంతులకు 'పండుగే'

వరుస పండుగల నేపథ్యంలో సిబ్బందికి పెరిగిన డిమాండ్	ఈ కామర్స్, లాజిస్టిక్స్, ఆటోమొబైల్స్ రంగాల్లో ప్రతి నెలా 5వేల కొత్త ఉద్యోగాలు లభిస్తాయనే అంచనాలు	ట్రైనీలు, ఎగ్జిక్యూటివ్‌లు, మేనేజర్‌లు, కస్టమర్ రిలేషన్‌షిప్ అధికారులకు డిమాండ్

హైదరాబాద్ సహా బెంగళూరు, చెన్నై, ముంబై, మెట్రోనగరాల్లో ఉద్యోగాల జోరు

ప్రముఖ బిజినెస్ సర్వీసెస్ ప్రొవైడర్ సంస్థ క్వెస్ తాజా అధ్యయనంలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే ప్రారంభం కానున్న పండుగల సీజన్ వివిధ రంగాల్లో అవకాశాలకు తలుపులు తెరుస్తూ ఉద్యోగార్థుల్లో నయాజోష్‌ను నింపుతోంది. ఈ నెలాఖరులో 'రక్షాబంధన్'తో మొదలై కొత్త ఏడాది, ఆపై కాలం వరకు సుదీర్ఘ ఫెస్టివల్ సీజన్ జోరు కొనసాగనుంది. ఈ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని... వివిధ వర్గాల వినియోగదారుల పండుగ మూడ్‌ను క్యాష్ చేసుకునేందుకు ఇప్పటికే పలు కంపెనీలు, సంస్థలు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో వివిధ రంగాల్లో సేవలందించే ఉద్యోగులకు కూడా ఒక్కసారిగా డిమాండ్ పెరిగినట్టుగా పలు అధ్యయనాలు అంచనా వేస్తున్నాయి.

ఇదీ అధ్యయనం..: రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని గడిచిన ఏప్రిల్ నుంచి ఈనెల ఆగస్టు వరకు స్టాఫింగ్ డిమాండ్ 23 శాతం పెరిగినట్టుగా ప్రముఖ బిజినెస్ సర్వీసెస్ ప్రొవైడర్ సంస్థ క్వెస్ తాజా పరిశీలనలో వెల్లడైంది. ఈ కాలంలోనే 32 వేల ఉద్యోగాలకు డిమాండ్ ఏర్పడడంతో పాటు ఏడాది చివర్లో పండుగల సీజన్ ముగిసే దాకా ఈ- కామర్స్, లాజిస్టిక్స్, ఆటోమొబైల్స్ తదితరాల్లో ప్రతీనెల 5 వేల చొప్పున ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, రిటైల్, టెలికం, తదితర రంగాలు, విభాగాల్లో అవకాశాలు పెరిగినట్లు ఈ అధ్యయనం ద్వారా తెలుస్తోంది. గతేడాది ఏప్రిల్‌-ఆగస్టు మధ్యకాలంతో పోల్చితే ఈ ఏడాది అదే కాలంలో 'మాన్యుఫాక్చరింగ్, ఇండస్ట్రీయల్ సెగ్మెంట్'లో 245 శాతం వృత్తినిపుణుల డిమాండ్ పెరిగినట్టు ఈ నివేదిక పేర్కొంది.

> పండుగల సీజన్ మొదలై క్రమంగా పుంజుకుంటున్న కొద్దీ వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నాం. ముఖ్యంగా వినియోగదారులు ప్రత్యక్షంగా ప్రభావం చూపే ఈ-కామర్స్, లాజిస్టిక్స్, ఆటోమొబైల్, తదితర రంగాల్లో ఉద్యోగాలు పెరుగుతాయి.
>
> – లోహిత్ భాటియా, ప్రెసిడెంట్‌-వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్, క్వెస్

రిక్రూట్‌మెంట్ విషయానికొస్తే...దసరా, దీపావళి పండుగల సందర్భంగా అత్యధికంగా వాహనాల కొనుగోలుకు మొగ్గు నేపథ్యంలో ఆటోమొబైల్ పరిశ్రమ ముందంజలో (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా)ఉంది. ఫెస్టివల్ సీజన్ దృష్ట్యా... బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండస్ట్రీ (బీఎఫ్ఎస్ఐ)కి సంబంధించి మ్యాన్‌పవర్ కోసం 27 శాతం డిమాండ్, టెలికాం రంగంలో 14 శాతం డిమాండ్ పెరిగినట్టు తెలిపింది.

హైదరాబాద్ సహా మెట్రోలు, విజయవాడల్లో డిమాండ్

ఈ పండుగల సీజన్ నేపథ్యంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన వివిధ రకాల సేవలు, నూతన రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకునే విషయంలో, తదనుగుణంగా అవసరమైన 'మ్యాన్‌పవర్'అందించడంలో హైదరాబాద్‌తో సహా బెంగళూరు, చెన్నై, ముంబై మెట్రోనగరాలతో పాటు నోయిడా, పుణె నగరాలు అత్యధిక డిమాండ్ కలిగి ఉన్నట్టు క్వెస్ పరిశీలన వెల్లడించింది. వీటికి ఏమాత్రం వెనకబడకుండా విజయవాడ, కోయంబత్తూరు, జంషెడ్‌పూర్, రాంఛీ వంటి నగరాల్లోని వివిధ రంగాలకు చెందిన వర్క్‌ఫోర్స్‌కు మంచి ఉద్యోగ అవకాశాలున్నట్టు తెలిపింది.

ఏ ఉద్యోగాలకు డిమాండ్ అధికం అంటే..

ప్రొడక్షన్ ట్రైనీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, బ్రాంచ్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్, కలెక్షన్ ఆఫీసర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, బ్రాడ్ బ్యాండ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, వేర్‌హౌస్ అసోసియేట్ తదితర ఉద్యోగాలకు అధిక డిమాండ్ ఏర్పడింది. ఈ-కామర్స్, లాజిస్టిక్స్ ఇండస్ట్రీలో దాదాపు మూడులక్షల దాకా ఉద్యోగులకు అవకాశాలు కల్పించే అంచనాలతో ముందువరసలో నిలుస్తోంది. ఇందులో భాగంగానే వేర్‌హౌస్, డెలివరీ ఆపరేషన్స్ వంటివి కూడా అంతర్భాగంగా ఉంటాయి.

నెలాఖరులోగా గురుకుల పరీక్షల తుది 'కీ'లు!

ప్రాథమిక కీలపై అభ్యంతరాలకు ముగిసిన గడువు

- ఆన్‌లైన్‌లో వచ్చిన అభ్యంతరాలు నిపుణుల కమిటీ ముందుకు
- కమిటీ సూచనలకు అనుగుణంగా ఫైనల్ 'కీ'లు విడుదల
- అదేరోజు వెబ్‌సైట్‌లో అభ్యర్థుల మార్కుల వివరాలు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ నియామకాల ప్రక్రియ వడివడిగా సాగుతోంది. తొలిసారిగా ఆన్‌లైన్ పద్ధతిలో అర్హత పరీక్షలను కేవలం మూడు వారాల వ్యవధిలో నిర్వహించి రికార్డు సృష్టించిన తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ).. చివరి పరీక్ష రోజునే ప్రాథమిక కీలను విడుదల చేసింది. తాజాగా 'ఫైనల్ కీ'(తుది జవాబు పత్రం) తయారీలో గురుకుల బోర్డు నిమగ్నమైంది. దాదాపు 56 కేటగిరీలకు సంబంధించి 19 రోజుల పాటు రోజుకు మూడు సెషన్లలో పరీక్షలు నిర్వహించిన టీఆర్ఈఐఆర్‌బీ.. ప్రాథమిక కీలను విడుదల చేసి అభ్యంతరాలను కూడా ఆన్‌లైన్ పద్ధతిలో స్వీకరించింది. శనివారంతో అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసింది. ఆన్‌లైన్‌లో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించేందుకు బోర్డు ప్రత్యేకంగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ అభ్యర్థుల అభ్యంతరాలను తగిన ఆధారాలతో పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. రెండ్రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు. నిపుణుల కమిటీ సూచనలకు అనుగుణంగా ఫైనల్ కీలను తయారుచేసి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచేందుకు టీఆర్ఈఐఆర్‌బీ కసరత్తు వేగవంతం చేసింది. ఈనెలాఖరులోగా ఈ ప్రక్రియను పూర్తి చేసేలా గురుకుల బోర్డు కసరత్తు చేస్తోంది.

అవరోహణ క్రమంలో నియామకాలు

గురుకుల విద్యా సంస్థల్లో వివిధ కేటగిరీల్లో 9,231 ఉద్యోగాలకు వెబ్‌నోట్ జారీ చేసిన టీఆర్ఈఐఆర్‌బీ.. ఆ తర్వాత జారీ చేసిన పూర్తిస్థాయి నోటిఫికేషన్ల ప్రకారం 9,210 పోస్టులకు మాత్రమే ప్రకటనలను పరిమితం చేసింది. ఇందులో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అర్హత పరీక్షలు జరిగాయి. సగటున 75 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ కేటగిరీలు మినహా మిగతా అన్ని కేటగిరీల్లోని అర్హత పరీక్షల ప్రాథమిక కీలను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టారు. కోర్టు కేసుల నేపథ్యంలో ఈ మూడు కేటగిరీల కీలను విడుదల చేయలేదు. ఈ నెలాఖరులో తుది కీలను ఖరారు చేసి, అదేరోజున అభ్యర్థులు సాధించిన మార్కులను కూడా వెబ్‌సైట్‌లో పెడతారు. గురుకుల సొసైటీల్లో ఉద్యోగాల భర్తీకి బోర్డు అవరోహణ విధానాన్ని ఎంచుకుంది. ముందుగా పైస్థాయి పోస్టులను భర్తీ చేస్తూ క్రమంగా కింది స్థాయిలో పోస్టుల నియామకాలను ముగిస్తుంది. ఈ క్రమంలో తొలుత డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ పోస్టులను భర్తీ చేస్తారు. ప్రస్తుతం తుది కీలను విడుదల చేసి మార్కులు ప్రకటించిన తర్వాత అర్హతల ఆధారంగా డీఎల్, జేఎల్ పోస్టులకు డెమో పరీక్షలు సైతం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అతి త్వరలో తేదీలను ఖరారు చేసే దిశగా గురుకుల బోర్డు చర్యలు వేగవంతం చేసింది.

'4-ఈ'లతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ: సీవీ ఆనంద్



సాక్షి, హైదరాబాద్: ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎనేబుల్‌మెంట్ (4-ఈ)లతో ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరిస్తూ.. వాహనాల సగటు వేగాన్ని పెంచాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. ట్రాఫిక్ డ్యూటీ ప్రతి పౌరుడి జీవితాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుందని, అందుకే చురుగ్గా, సమయస్ఫూర్తితో పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఆయన అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నగరంలోని ప్రతి ట్రాఫిక్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)లు తమ ఠాణా పరిధిలో ఒక మోడల్ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అన్ని ట్రాఫిక్ స్టేషన్లలో డబ్లింగ్ క్రేన్‌లు, ఆపరేషన్ రోప్ (అబ్స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ రిమూవల్)లను అమలు చేయాలని సూచించారు. రివర్సబుల్ లైన్స్, యూటర్న్‌లు, క్లోజర్స్ వంటి ఇంజినీరింగ్ అంశాలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో అధికారులు వ్యూహాత్మకంగా పనిచేయాలని చెప్పారు. న్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.